


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 25-08-2026 మంగళవారం సంపుటి : 14 | సంచిక :247 *SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY* రూ. 4.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal Follow us on

## విదేశాల్లో ఉన్నా

# వదిలేది లేదు

### 51 మంది నేరస్థుల డిపోర్టేషన్
### లూథియానా గ్రనేడ్ దాడి నిందితులు భారత్‌కు తరలింపు
### ప్రధాని మోదీ నేతృత్వంలో జోరందుకున్న చర్యలు
### మలేషియాలో పట్టుబడిన 'బంబీహా' ముఠా గ్యాంగ్‌స్టర్లు
### కేంద్ర ఏజెన్సీల ఆపరేషన్ సక్సెస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఐ ఎంస్) :** దేశంలో పలు అరాచకాలకు, కుట్రలకు పాల్పడి విదేశాలకు పారిపోయిన నేరస్థులపై భారత్ కఠినంగా వ్యవహరిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పంజాబ్‌కు చెందిన ప్రముఖ 'బంబీహా ముఠా'తో సంబంధాలు కలిగి ఉండి విదేశాల్లో తలదాచుకున్న ముగ్గురు కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్లు జస్‌ప్రీత్ సింగ్, అజయ్ సింగ్, పవన్‌దీప్ సింగ్‌లను భారత దర్యాప్తు ఏజెన్సీలు మలేషియాలో ఆపరేషన్ నిర్వహించి పట్టుకున్నాయి. అనంతరం వారిని మలేషియా నుంచి భారత్‌కు విజయవంతంగా రప్పించాయి. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. నిందితులపై తీవ్రమైన నేరారోపణలు ఉన్నాయని, వీరంతా బెదిరింపులు, వసూళ్లు, ఆయుధాలు మరియు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో కీలక నిందితులుగా ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా, పంజాబ్‌లోని లూథియానాలో జరిగిన గ్రనేడ్ దాడి కుట్రలోనూ ఈ ముగ్గురికి నేరుగా ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని హోంమంత్రి వెల్లడించారు.



ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో సురక్షితమైన, భద్రమైన వాతావరణాన్ని పెంపొందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. నేరస్థులు విదేశాలకు పారిపోయినా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించిన ఆయన, ఈ ఒక్క ఏడాదే ఇప్పటివరకు 51 మంది కరడుగట్టిన నేరస్థులను వివిధ విదేశాల నుంచి భారత్‌కు తిరిగి రప్పించినట్లు తెలిపారు. దేశద్రోహులు, గ్యాంగ్‌స్టర్లపై భారత ఏజెన్సీలు చేపడుతున్న ఈ చర్యలు నేర నియంత్రణలో కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

## గుజరాత్‌కు ఒక న్యాయం

# తెలంగాణకు మరో కటా?

- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ
- కేంద్రానిది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమైన వైఖరి
- తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను ఆపేది లేదు
- ప్రధాని మోదీ వైఖరిని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 24 (వుదయం) :** భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి అనేది రాష్ట్రాల కలయికపైనే ఆధారపడి ఉందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసేందుకు విద్య, క్రీడలు, పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విదేశీ పర్యటన కార్యాచరణను రూపొందించుకున్నామని వెల్లడించారు. ఈ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖకు సమర్పించినప్పటికీ, కేంద్రం ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతినిచ్చి, అమెరికా పర్యటనను నిరాకరించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ రాజకీయపరమైన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ప్రధాని నరేంద్ర మోదీ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒకే సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రి వైబ్రంట్ గుజరాత్ పేరిట అమెరికా, కెనడా పర్యటనలు చేయడానికి అనుమతించిన కేంద్రం, తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా తాము తలపెట్టిన పర్యటనను అడ్డుకోవడం స్పష్టమైన వివక్షకు నిదర్శనమని సీఎం విమర్శించారు. నిజంగా తమ పర్యటనలో ప్రాధాన్యత లేకపోతే ఇంగ్లాండ్‌కు అనుమతి ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ పర్యటనను అడ్డుకోవడమే కాకుండా, బీజేపీ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వంపై, అధికారిక పర్యటనపై తప్పుడు ప్రకటనలు చేస్తూ వ్యక్తిగత ఆరోపణలకు దిగడం శోచనీయమన్నారు. ఇది రేవంత్ రెడ్డికి జరిగిన అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన తీవ్ర అన్యాయమని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ వైఖరిని ఖండించాలని పిలుపునిచ్చారు.

కేంద్రం వైఖరి వల్ల రాష్ట్రానికి రావాల్సిన విదేశీ పెట్టుబడులు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, తమ ఎంపీల ద్వారా ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామని తెలిపారు.



గుజరాత్ అభివృద్ధికి ఇబ్బంది కలుగుతుందనే కుట్రతోనే తెలంగాణ పర్యటనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు దెబ్బతినేలా ప్రధాని మోదీ ఇంకా ఒక గుజరాతీ నేతలానే వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. పర్యటనలను అడ్డుకున్నంత మాత్రాన తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను ఆపలేరని స్పష్టం చేసిన సీఎం, డిసెంబర్ 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఆధ్వర్యంలో 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని, రాష్ట్ర హక్కులు, అభివృద్ధి కోసం కేంద్రంపై ఒత్తిడి కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## ప్రశ్నోత్తరాల సెషన్ వద్దన్నా వినలేదు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఐ ఎంస్) :** న్యూఢిల్లీ: ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశానికి సంబంధించి ఆసక్తికర పరిణామాలను అగ్రరాజ్య రాయబారి సెర్గియో గోర్ ఇటీవల వెల్లడించారు. ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆ రోజు విలేకరుల నుంచి ప్రశ్నలు అడిగే సెషన్ వద్దని భారత విదేశాంగ శాఖ ముందే కోరిందని, దానికి ట్రంప్ కూడా అంగీకరించారని తెలిపారు. అయితే, నేతలిద్దరూ తమ ప్రారంభ ఉపన్యాసాలు పూర్తి చేసిన తర్వాత, భారత్ పంపిన రిక్వెస్ట్‌ను ట్రంప్ మర్చిపోయి నేరుగా మీడియాను ప్రశ్నలు అడగాలని కోరారని పేర్కొన్నారు. దీంతో దాదాపు 50కి పైగా కెమెరాల ముందు ఒక్కసారిగా సమావేశ శైలి మారిపోయి, ప్రశ్నల సెషన్ మరో 45 నిమిషాల పాటు సాగిందని గోర్ వివరించారు. గోర్ చేసిన ఈ వ్యాఖ్యలపై భారత కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెంటనే స్పందించాయి. వీవీఐపీ పర్యటనల సమయంలో ఇలాంటి బహిరంగ కార్యక్రమాలకు సంబంధించి ముందస్తు చర్చలు జరగడం సర్వసాధారణమైన ప్రక్రియ అని స్పష్టం చేశాయి. ఈ పర్యటన విషయంలో కూడా ఎప్పటి నుంచో అనుసరిస్తున్న దౌత్య విధానాలనే తాము కమ్యూనికేట్ చేశామని, భారత విదేశాంగ శాఖ ఏనాడూ పూర్తిస్థాయి సమావేశాన్ని నిరోధించలేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది.



## డిప్రెషన్‌తో కేపీహెచ్‌బీలో మహిళ ఆత్మహత్య

**ఐదో అంతస్తు నుంచి దూకి వివాహిత బలవన్మరణం**

**ఆరేళ్ల క్రితం పెళ్లి, నాలుగేళ్ల చిన్నారికి తల్లిగా ఉన్న మహిళ**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వుదయం) :** నగరంలోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మానసిక కుంగుబాటు (డిప్రెషన్) కారణంగా ఓ వివాహిత ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ (32) దంపతులకు ఆరేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. పురుషోత్తమన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో డిప్యూటీ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కుటుంబం తమ కుమార్తె మరియు పురుషోత్తమన్ తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో నివాసముంటోంది. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ టెర్రస్ పైకి వెళ్లే మెట్లపై కొద్దిసేపు కూర్చుని, అనంతరం అకస్మాత్తుగా టెర్రస్ పైనుంచి అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోకి దూకేసింది. తీవ్ర గాయాలవ్వడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ వేగవంతం చేశారు. మృతురాలి భర్తతో పాటు కేరళలో ఉన్న ఆమె సోదరుడిని ప్రశ్నించగా, శీతల్ కొంతకాలంగా తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతోందని, దీనికోసం వైద్యుల సలహాతో మందులు కూడా వాడుతున్నట్లు వెల్లడించారు. ఈ సమాచారాన్ని కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు అందించిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ఓదార్పు

**మాజీ సీఎం కేసీఆర్ నివాళి**



**హైదరాబాద్, ఆగస్టు 24 (వుదయం) :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తన బావమరిది జోగినపల్లి శ్రీనివాసరావుకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. శ్రీనివాసరావు దశదిన కర్మ సందర్భంగా కొంపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లిన కేసీఆర్, అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం తీవ్ర శోకసప్తంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, కేసీఆర్ సతీమణి శోభమ్మకు స్వయానా సోదరుడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న శ్రీనివాసరావు, సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 14న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. శ్రీనివాసరావు మృతి చెందిన రోజున జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో కూడా కేసీఆర్ స్వయంగా పాల్గొని, భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. సోమవారం నాటి దశదిన కర్మ కార్యక్రమంలో కూడా కేసీఆర్ పాల్గొని, తన బావమరిది జ్ఞాపకాలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులతో కాసేపు మాట్లాడారు.



## 'స్కూల్ ఠీక్ కరో'

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఐ ఎంస్) :** దేశంలో ప్రాథమిక విద్య అనేది కేవలం ఒక రాజకీయాంశం కాదని, అది ప్రతి చిన్నారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని కాక్రోచ్ జనతా పార్టీ (సిజిపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులను ఉద్దేశించి ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లేమి తీవ్రంగా ఉందనడానికి క్షేత్రస్థాయి పరిశీలనలే నిదర్శనమని ఆయన ఎత్తిచూపారు. ఇటీవల తమ పార్టీ చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా వెలుగులోకి వచ్చిన సమస్యలను లేఖలో ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణను అత్యవసర ప్రాధాన్యతాంశంగా గుర్తించాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వారిని మనుషులుగా కూడా పరిగణించకపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రుల ముందు ఆయన పలు కీలక డిమాండ్లను ఉంచారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలను బాగుచేశారు, ప్రస్తుతం తక్షణ మరమ్మతులు లేదా పూర్తిస్థాయి పునరుద్ధరణ అవసరమైన బడుల సంఖ్య ఎంత అనే వివరాలను బహిర్గతం చేయాలని కోరారు.

## అమెరికా కలపై 'రక్షణాత్మక' దెబ్బ

**రూ. 95 లక్షలు చెల్లిస్తేనే అమెరికాలో ఉపాధి ?**

**అంతర్జాతీయ విద్యార్థుల భవిష్యత్తుపై కొత్త సందిగ్ధత**

**హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలపై నిబంధనల ఉక్కుపాదం**

**నిరుత్సాహంలో భారతీయ నిపుణులు**




**వాషింగ్టన్ :** అమెరికాలో ఉన్నత చదువులు అభ్యసించి, అక్కడే మంచి ఉపాధి అవకాశాలు పొందాలని ఆశిస్తున్న భారతీయ విద్యార్థులు, ఐటీ నిపుణులకు ట్రంప్ ప్రభుత్వం మరో భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. హెచ్ 1బీ వీసా పిటిషన్లతో పాటు ఎఫ్1 ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) ప్రోగ్రామ్‌కు కొత్తగా రూల్స్ తెచ్చి, భారీగా రుసుములు విధించేందుకు డీహెచ్ఎస్ (యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ) వేగంగా చర్యలు ప్రారంభించింది. న్యూయార్క్‌కు చెందిన ప్రముఖ ఇమిగ్రేషన్ సంస్థ ఫ్రాగోమెన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కొన్ని రకాల హెచ్ 1బీ అప్లికేషన్లు మరియు ఓపీటీ ప్రోగ్రామ్‌లపై కొత్త ఫీజులు ఖరారు చేసేందుకు అవసరమైన రెగ్యులేటరీ ప్రక్రియను హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు త్వరలోనే ప్రచురితం కానున్నాయి. డిగ్రీ పూర్తి చేసుకున్న విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉద్యోగ అనుభవం పొందేందుకు ఓపీటీ అత్యంత కీలకమైన మార్గంగా ఉపయోగపడుతోంది. అయితే, ఈ ఓపీటీ దరఖాస్తులపై ఏకంగా 1 లక్ష అమెరికన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.95 లక్షలు) ఫీజుగా వసూలు చేసే ఆలోచనలో అమెరికా సర్కార్ ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనను ఇప్పటికే ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ (ఓఎంబీ) సమీక్షకు పంపగా, హెచ్ 1బీ పిటిషన్లపై ప్రతిపాదిత ఫీజుల నిబంధనలకు ఓఎంబీ ఆమోదం తెలిపిందని ఫ్రాగోమెన్ పేర్కొంది. గతంలో హెచ్ 1బీ ఫీజుల పెంపుపై మసాచుసెట్స్ ఫెడరల్ కోర్టు స్టే విధించిన నేపథ్యంలో, ఈసారి ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా కాకుండా పక్కా చట్టబద్ధమైన రెగ్యులేటరీ ప్రక్రియ ద్వారా ఈ ఫీజుల భారాన్ని మోపేందుకు డీహెచ్ఎస్ పావులు కదుపుతోంది.

## ఇంతే కదా...!




# అసలు స్వరూపం బయటపడింది

**కోల్‌కతా , ఆగస్టు 24 (ఎంఎస్) :** భారతీయ జనతా పార్టీని దేశ రాజకీయాల నుంచి పూర్తిగా కనుమరుగు చేసే వరకు తాను విశ్రమించేది లేదని, అలాగే రాజకీయ సన్యాసం తీసుకునే ప్రసక్తే లేదని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ఆన్‌లైన్ వేదికగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ప్రభుత్వం మారిన నాలుగు నెలల్లోనే భాజపా అసలు స్వరూపం ఏంటో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా అర్థమైందని విమర్శించారు. జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్సీ)ను వెనుక తలుపు ద్వారా అమలు చేసేందుకే కేంద్రం జనగణనను ఒక సాధనంగా ఉపయోగిస్తోందని ఆరోపించారు. ఎలాంటి రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరపకుండానే దీనిని తీసుకువచ్చారని పేర్కొన్న ఆమె, జనగణన దరఖాస్తులపై సంతకాలు చేసే సమయంలో మరియు వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు ప్రజలంతా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్నపూర్ణ భండార్ పథకం కింద ఆర్థిక సాయం అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ మహిళలు చేపడుతున్న నిరసనలపై మమత స్పందించారు.



అర్హత లేదనే నెపంతో ప్రభుత్వం కావాలనే లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తోందని, ఎన్నికల సమయంలో మహిళలందరికీ ఆర్థిక సాయం చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించి ఇప్పుడు వారిని మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ, వామపక్ష విద్యార్థి సంఘాల మధ్య జరిగిన ఘర్షణలను ప్రస్తావిస్తూ, క్యాంపస్‌లో విధ్వంసకర వాతావరణానికి భాజపానే పూర్తి కారణమని ఆరోపించారు. మరోవైపు, ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేసిన మమతా బెనర్జీ, ఆ ఓటర్లను తిరిగి జాబితాలో చేర్పించేందుకు అవసరమైతే తాము మళ్లీ సుప్రీంకోర్టు తలుపు తడతామని తేల్చిచెప్పారు.

# గ్రామం కు వెలుగులు నింపేందుకు దాతలు విరాళం

- ఉదరాతను చాటుకున్న మాజీ తహసీల్దార్ కుమారులు
- "40.ఎల్. ఈ. డి.లైట్ల కు విరాళం దాతలకు ఘన సన్మానం"
- "హర్షం వ్యకం చేస్తున్న గ్రామస్థులు"



**కోహీర్ ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని కవెళ్లి గ్రామంలో వెలుగులు నింపేందుకు స్థానిక దాతలు ముందుకు రావడం అభినందనీయం. గ్రామ ప్రధాన రహదారి అయిన కవెళ్లి ఎక్స్ రోడ్డు నుండి ఊరి వరకు రాత్రి వేళల్లో చీకటి వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారు.సుమారు 2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 40 విద్యుత్ స్తంభాల కు మాజీ తహసిల్దార్ కుమారులు ప్రమోద్ మరియు ప్రణీత్ తమ స్వంత ఖర్చులతో ఉచితంగా వీధి లైట్లను ఏర్పాటు చేశారు. రాత్రి పూట పాదచారులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ప్రమాదాల నివారణకు ఈ లైట్ల ఏర్పాటు ఎంతోగానో ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాతల ఉదారతను గుర్తిస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాజియా లాయక్ దాతలను పూలమాలలు, శాలువాలతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.గ్రామ అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ఇలాంటి దాతల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని సర్పంచ్ కొనియాడారు.సమాజ సేవలో ముందుంటూ గ్రామానికి వెలుగులు అందించిన మాజీ తహసిల్దార్ కుటుంబాన్ని గ్రామ యువత, పెద్దలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని దాతలను అభినందించారు. గ్రామానికి చేసిన ఈ సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని దాతలు ఈ సందర్భంగా తెలియజేసారు ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ మొగులయ్య వార్డ్ సభ్యులు గ్రామ యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# పశువైద్యుల నిర్లక్ష్యంతో ఆవు మృతి

- కోహీర్ మున్సిపాలిటీలో రైతు నిరసన, 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు విన్నపం

**కోహీర్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కోహీర్ మున్సిపల్ లిటిలో స్థానిక పశు వైద్యుల బాధ్యతారాహిత్యం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఒక పాడి ఆవు ప్రాణాలు కోల్పోవడం తో, రైతు కు తీవ్ర నష్టం వాటిలింది . కోహీర్ మున్సిపా లిటీ పరిధిలోని పట్లూర్ బేస్ కాలనీకి చెందిన పేద రైతు సోన్నయిల లక్ష్మయ్య కు పశుపోషణనే ప్రధాన జీవనాధారం. ఈ క్రమంలో సోమవారం ఉదయం లక్ష్మయ్య కు చెందిన పాడి ఆవు అక స్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆందోళన చెందిన లక్ష్మయ్య, ఆవును కాపాడుకునేందుకు ఉదయం 10:30 గంటల సమయంలో స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలకు తరలించారు. అయితే, ఆస్పత్రికి వెళ్లేసరికి అక్కడ వెటర్నరీ డాక్టర్ గానీ, ఇతర సహాయక సిబ్బంది గానీ అందుబాటులో లేరు. ఆస్పత్రికి తాళాలు వేసి ఉండటం,గంటల తరబడి వేచి చూసినా ఎవరూ రాకపోవడంతో సరైన సమయంలో ప్రాథమిక చికిత్స అందక ఆవు లక్ష్మయ్య కళ్లముందే విలవిలలాడుతూ మృతి చెందింది. ఈ సందర్భంగా రైతు లక్ష్మయ్య కన్నీరుమున్నీరవుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పశువైద్యశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకుండా జీవాల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఆస్పత్రికి సరఫరా అయ్యే ఉచిత మందులను బయట అమ్ముకుంటున్నారనే అనుమానాలు కూడా ఉన్నాయని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రూ. వేల విలువైన పాడి ఆవు చనిపోవడంతో తన కుటుంబం ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని వాపోయారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన లక్ష్మయ్య, స్థానిక రైతులతో కలిసి కోహీర్.ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమంలో కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విధులకు గైర్హాజరై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పశువైద్యుడితో పాటు బాధ్యులైన సిబ్బందిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, జీవనాధారాన్ని కోల్పోయి ఆర్థికంగా దెబ్బతిన్న తన కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వేడుకున్నారు. సంబంధించిన పశు వైద్య వెటర్నరీ డాక్టర్ కు స్థానిక యువకులు రికార్డ్ చూయించమని అడుగగా స్టాప్ ఎవ్వరు లేరు అని చెప్పడం అలాగే హాస్పిటల్ లో కనీసం అత్యవసర మందులు లెకపొవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యకం చేశారు..ప్రభుత్వం స్పందించి వెంటనే కాంటాక్ట్ డాక్టర్ ను విధులోనుంచి తొలగించి పర్మినెంట్ డాక్టర్ ను నియమించాలని ప్రజావాణి లో కోరారు లేదంటే భారీ ఎత్తున నిరసన కార్యక్రమలు చేపడతాం అని రైతులు. యువకులు హెచ్చరించారు





# పత్రికా కథనాలపై డీఎఫ్ఓ స్పందన.. బాధ్యులపై వేటు?

- రామవరం రేంజ్‌పై ఉక్కుపాదం.. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి)**


డ్యూటీకి డుమ్మా.. దందా జోరు..?
అధికారుల అండతో వసూళ్ల దందా..?
చెక్‌పోస్ట్‌లో బీట్ అధికారుల గైర్హాజరు..
కలప వాహనాలకు కాసుల దారి!

రామవరం అటవీశాఖ రేంజ్ పరిధిలో విధుల నిర్వహణ, చెక్‌పోస్టు పనితీరు, కలప వాహనాల తనిఖీలకు సంబంధించి వరుసగా వెలుగులోకి వస్తున్న పత్రిక కథనాలపై జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్ స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, శాఖా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రం సింగ్ స్పష్టం చేశారు.రామవరం రేంజ్ పరిధిలో బీట్ అధికారులు విధులకు గైర్హాజరై ఇతర బేస్ క్యాంప్ సిబ్బందితో విధులు నిర్వహింపజేస్తున్నారనే విషయంపై గతంలో పత్రిక కథనాలు వెలువడ్డాయి. ఇటీవల చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ఇద్దరు బీట్ అధికారులు విధుల సమయంలో వీధుల్లో లేకుండా ఇళ్లల్లోకి వెళ్లిపోయారనే పత్రిక కథనాలు వెలువడ్డాయి. అనుమతి పత్రాల పరిశీలన, కలప వాహనాల తనిఖీలు, విధుల్లో సిబ్బంది హాజరు వంటి అంశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వరుస కథనాలు వెలుగులోకి వచ్చాయి. అలాగే అనుమతి పత్రాలు లేని కలప వాహనం చెక్‌పోస్టు వరకు వచ్చి, అనంతరం రేంజ్ అధికారి తనిఖీలో సీజ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం పైనా విమర్శలు వచ్చాయి. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ముందుగానే వాహనాన్ని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అలా ఎందుకు జరగలేదనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంలో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే విచారణ ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎఫ్ఓ తెలిపారు.రామవరం రేంజ్‌లో వరుసగా వెలుగులోకి వస్తున్న పత్రిక కథనాల నేపథ్యంలో చెక్‌పోస్టు వద్ద సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, కలప రవాణా వాహనాల తనిఖీలు, అనుమతి పత్రాల పరిశీలన తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన జరిపే అవకాశం ఉంది. అటవీశాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరించినట్లు నిర్ధారణ అయితే ఉపేక్షించేది లేదని డీఎఫ్ఓ స్పష్టం చేసినట్ల సమాచారం.పత్రికల్లో ప్రచురితమైన కథనాలను పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను నిర్ధారించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో రామవరం రేంజ్ పరిధిలో విధుల నిర్వహణ, చెక్‌పోస్టు వ్యవహారాలపై అటవీశాఖ ఉన్నతాధికారుల చర్యలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.



# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**దౌల్తాబాద్, ఆగస్టు 24 (వుదయం):**

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగాధరి స్వప్న స్వామి, ఉపసర్పంచ్ తాటి సాయి, 6వ వార్డు సభ్యుడు బొల్లం రాజేష్, 7వ వార్డు సభ్యుడు గంగాధరి దుర్గయ్య, 10వ వార్డు సభ్యుడు కేంబసారి మల్లేశం, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు దండు భూపాల్, దోమల సాయిలు, జీపీఓ లక్ష్మి, రేషన్ డీలర్ భూపతిరెడ్డి, జర నరసింహులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గాజులపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**దౌల్తాబాద్, ఆగస్టు 24 (వుదయం):**

దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ గొల్లపల్లి ప్రేమ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి నర్రా నర్సింలు, జీపీఓ రమేష్, రేషన్ డీలర్ శ్రీకాంత్, వార్డు సభ్యులు డి.సత్యం, ఎం.స్వామి, బి.బ్రహ్మానందరెడ్డి, ఎం. కనకయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు.

# తనిఖీకి వచ్చి సోషల్ పాఠం చెప్పిన కలెక్టర్



- బల్మూరు జెడ్పీ పాఠశాలలో సోషల్ టీచర్ గా మారిన హేమంత్ కేశవ్ పాటీల్

**అచ్చంపేట, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**

నియోజకవర్గ పరిధిలోని బల్మూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీకి వచ్చిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ కాసేపు సోషల్ టీచర్ గా మారి విద్యార్థులకు పాఠం బోధించారు.పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, తరగతుల నిర్వహణను పరిశీలించారు. అనంతరం 8వ తరగతి గదిలోకి వెళ్లి సాంఘిక శాస్త్రంలో భూమధ్యరేఖ, అక్షాంశాలు, రేఖాంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. వారి అవగాహన స్థాయిని తెలుసుకొని స్వయంగా బోర్డుపై బొమ్మలు గీస్తూ వివరించారు. పాఠ్యాంశాలను కేవలం బట్టీ పట్టకుండా అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రజాక్ తదితరులు ఉన్నారు.

# వైరల్ జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి

**సంగారెడ్డివుదయం :**



జిల్లాలో వైరల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది, మందుల కొరత లేకుండా చూడాలని కోరారు.మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు, ఈగలు పెరిగి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు దోమల మందు పిచికారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)కు వినతి పత్రం అందజేశారు. ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర, ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం పేరిట 'వెంచర్లు'.. పసికందు ప్రాణం బలి!

- సౌమ్య ఆస్పత్రి నిర్లక్ష్యానికి మూడేళ్ల పాప కాపాడలేని దారుణం!
- మానవత్వం మరచి కాసుల వేట.. అధికారుల నిద్రమత్తుకు ఇంకెన్ని ప్రాణాలు కావాలి?

**గద్వాల ఆగస్టు 24 (వుదయం కరస్పాండెంట్)**



**కంటిపాపను కబళించిన కాలకూటం!**

ప్రాణాలు పోసే ఆస్పత్రులు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. దేవుళ్లా భావించే వైద్యులు కాసుల కక్కుర్తితో ప్రాణాలతో చెలగాటమాడుతు న్నారు. అనారోగ్యంతో వచ్చిన పసికందును కంటికి రెప్పలా కాపాడాల్సింది పోయి, పర్యవేక్షణ లేని ప్రైవేటు 'వ్యాపార' వైద్యానికి బలిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సౌమ్య చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపడమే కాకుండా, ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై తీవ్ర నిరసన జ్వాలలు రగిలిస్తోంది.

గద్వాల మండలం చేనుగోనిపల్లికి చెందిన హరీష్, శ్రావణి దంపతులు తమ మూడు నెలల పసిపాప అనారోగ్యానికి గురికావ డంతో కొండంత ఆశతో సౌమ్య చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. అయితే, అక్కడి వైద్యుల ఘోర నిర్లక్ష్యం, అత్యవసర చికిత్సలో చూపిన నిర్లక్ష్యపు అలసత్వం ఆ చిన్నారి ఊపిరి తీసింది. కళ్ల ముందే బిడ్డ ప్రాణాలు వదిలేయడంతో తల్లిదండ్రుల గుండెకోత, ఆక్రందనలు మిన్నంటాయి. తమ బిడ్డ మృతికి కారణమైన ఆస్పత్రి ముసుగులో ఉన్న 'వ్యాపారుల'పై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు.

**రోగుల ప్రాణాలు చౌకగా మారాయా?:** బీఆర్ఎస్వీ విరుచుకుపాటు ఈ నిలువు దోపిడీ, హత్యకు సమానమైన నిర్లక్ష్యంపై బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు, జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అగ్గిగోళమై మండిపడ్డారు. అధికారుల మౌనం దేనికి సంకేతం?: "ఆస్పత్రికి వచ్చిన మూడేళ్ల పాప శవమై బయటికొస్తే అధికారులు ఏ నిద్రమత్తులో ఉన్నారు? అక్కడ జరిగింది వైద్యమా.. లేక నిర్లక్ష్యపు హత్యల ప్రసవమా?" అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**రెఫరల్ మాఫియా గుట్టు రట్టు చేయాలి:** ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు మళ్లించే 'రెఫరల్ దందా' జిల్లాలో దర్జాగా సాగుతోందని, ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆస్పత్రుల అనైతిక కుమ్మక్కుపై తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**కాగితాలకే పరిమితమైన నిబంధనలు:** అర్హత లేని సిబ్బంది, కనీస ఐసీయూ సదుపాయాలు లేకుండా ఆస్పత్రులు నడుపుతుంటే తనిఖీలు చేయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు.మామూళ్ల మత్తులో యంత్రాంగం.. ప్రతి ఘటన తర్వాత అటకే!: గద్వాల జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల అక్రమాలు, వైద్యుల నిర్లక్ష్యానికి ప్రాణాలు పోవడం పరిపాటిగా మారిందని, ప్రతిసారీ విచారణ నాటకం ఆడి ఆ తర్వాత వ్యవహారాన్ని నీరుగారుస్తు న్నారని పల్లయ్య తీవ్రస్థాయిలో ఆరోపిం చారు.

**తక్షణ డిమాండ్లు:** జిల్లా కలెక్టర్, డీఎంహెచ్ఓ వెంటనే సౌమ్య చిల్డ్రన్స్ హాస్పిటల్ రికార్డులను సీజ్ చేసి విచారణకు ఆదేశించాలి. నిర్లక్ష్యానికి పాల్పడిన వైద్యులపై నాన్‌బెయిలబుల్ క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. నిబంధనలు తక్కిన సౌమ్య ఆస్పత్రి గుర్తింపును రద్దు చేసి, జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులన్నింటిపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించాలి. పసిపాప ప్రాణం తీసిన ఆస్పత్రిపై కఠిన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ప్రజాపోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్, ఆగస్టు 24 (వుదయం బ్యూరో):**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య దేవ సహాయంతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 42 ఫిర్యాదులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ప్రజావాణి, జిల్లా, ఆర్డీవో, మండల స్థాయిల్లో అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, తమ శాఖ పరిధిలో లేని సమస్యలను సంబంధిత శాఖలకు బదిలీ చేసి సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ ఫిర్యాదులను శాఖల వారీగా సమీక్షించి వెంటనే పరిష్కరించాలని, పరిష్కార వివరాలను ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలున్న పెరట్లో పస్తుల వెతలు!



- కృష్ణమ్మ ఉప్పొంగుతున్నా.. 'చోరీల' సమ్మోహనంలో పంప్‌హౌస్‌లు!
- 8 ట్రాన్స్‌ఫార్మర్లను తుక్కు చేసిన దొంగలు.. అంధకారంలో 10 వేల ఎకరాలు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే విజయుడు.. ఈఎన్సీకి అల్టిమేటమ్

**గద్వాల ఆగస్టు 24 (వుదయం కరస్పాండెంట్)**

కళ్లముందే జీవనది కృష్ణమ్మ నిండుగా ప్రవహిస్తోంది... తీరంలో పంట పొలాలు సాగునీటి కోసం తల్లడిల్లుతున్నాయి! నీరు పుష్కలంగా ఉన్నా.. దాన్ని పొలాలకు ఎత్తిపోసే విద్యుత్ వ్యవస్థను దొంగలు దోచేస్తుంటే పాలకుల నిర్లక్ష్యం రైతుల మెడకు ఉరితాడవుతోంది. అలంపూర్ నియోజకవర్గంలో వెలుగు చూసిన ఈ దారుణ పరిస్థితి వేలాదిమంది రైతు కుటుంబాలను తీవ్ర అభద్రతలోకి తోసేసింది. దొంగల రాసలీలలు.. స్తంభించిన 'ఎత్తిపోతలు నియోజకవర్గ పరిధిలోని ఉట్కూర్1, ఉట్కూర్2, క్యాతూర్1, క్యాతూర్2 ఎత్తిపోతల పథకాలు అధికారుల నిరంతర అలసత్వానికి సజీవ సాక్ష్యాలుగా మారాయి. పంప్‌హౌస్‌లలో కనీస సెక్యూరిటీ కూడా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు ఏకంగా 8 ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్లను గుల్ల చేశారు.ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రూ.లక్షల విలువైన రాగి తీగలు, నూనెను అపహరించుకుపోయారు. మోటార్లు మూగబోవడంతో 10 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందక పచ్చని పైర్లు కళ్లముందే ఎండిపోయి బూడిదయ్యే పరిస్థితి దాపురించింది.

**ప్రభుత్వ మొద్దునిద్రపై ఎమ్మెల్యే ఆగ్రహం** పంటలు ఎండిపోతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (ఈఎన్సీ)ను ముట్టడించినంత పని చేసి వినతిపత్రం అందజేశారు. రైతాంగం తరపున విధించిన ప్రధాన డిమాండ్లు

**తక్షణ నిధుల మంజూరు:** దొంగలపాలైన 8 ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చేందుకు యుద్ధప్రాతిపదికన నిధులు విడుదల చేసి, పంపింగ్‌ను తక్షణమే పునరుద్ధరించాలి. పెండింగ్ ప్యాకేజీలపై ఉక్కుపాదం: ఏళ్ల తరబడి మూలనపడ్డ 99, 100వ ప్యాకేజీల పెండింగ్ పనులను కాలపరిమితితో పూర్తి చేసి రైతులకు నీరివ్వాలి. చివరి ఆయకట్టు కూ నీరు: చిన్నంపల్లె రిజర్వాయర్ ఫీడర్ కెనాల్స్ ద్వారా చివరి భూముల వరకు సాగునీరు పారేలా తక్షణ చర్యలు చేపట్టాలి. నీళ్లున్నా రైతులకు నీరివ్వలేని ఈ నిర్లక్ష్య వైఖరి నశించాలి. తక్షణమే నిధులు మంజూరు చేసి మోటార్లు నడపకపోతే రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతాం" అని ఎమ్మెల్యే హెచ్చరించారు.

# మల్లారెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం



- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్

**నాగర్ కర్నూల్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**

తెలంగాణ సాయుధ పోరాట నాయకులు, రైతు ఉద్యమాల రథసారథి, సీపీఎం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మృతి దేశ వామపక్ష ఉద్యమాలకు, రైతు పోరాటాలకు తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్ అన్నారు.సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతుల పక్షాన అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన నాయకుడని, విద్యుత్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. నదీ జలాలపై సమగ్ర అవగాహనతో ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రభుత్వాలకు కూడా ఆయన రచించిన పుస్తకాలే ఆధారంగా మారాయని, అలాంటి మహా మేధావిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. రైతు సంఘంలో అఖిలభారత నాయకునిగా అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, ఆయన ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులన్నీ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్, అంతటి కాశన్న, నాగపూర్ మధు, శివరాం, మనోహర్, రఫీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 15,000 కోట్ల ఫీజుల బకాయిలపై విరుచుకుపడ్డ బీజేపీ

- సర్కార్‌ను పాతరయేస్తామంటూ గద్వాలలో ఉగ్రరూపం!
- 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ దాగుడుమూతలు!
- తక్షణమే నిధులు విడుదల చేయకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం: బీజేవైఎం తీవ్ర హెచ్చరిక
- రోడ్డెక్కిన గద్వాల.. మారుమోగిన 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి'

**గద్వాల ఆగస్టు 24 (వుదయం కరస్పాండెంట్)**



రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై అగ్గిమీద గుగ్గులమవుతూ బీజేపీ సమరభేరి మోగించింది. విద్యార్థుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ గద్వాల పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరిట గురువారం చేపట్టిన భారీ నిరసన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణం నుంచి కదలి వచ్చిన ఈ జలప్రళయం వంటి ర్యాలీ కృష్ణవేణి చౌక్, రాజీవ్ మార్గ్ మీదుగా పాత బస్టాండ్ వరకు విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను ఎండగడుతూ చేసిన నినాదాలతో గద్వాల నలుమూలలా మారుమోగింది. చదువులను చంపేస్తున్న సర్కార్.. విద్యావ్యవస్థ చిన్నాభిన్నం! పాత బస్టాండ్ వద్ద జరిగిన ధర్నా చౌక్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి నిప్పులు చెరిగారు. రూ. 15,000 కోట్ల భారీ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ పేద, బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయడం సర్కార్ పాతక చర్య అని మండిపడ్డారు. నిధులు రాక ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడే స్థితికి చేరుకున్నాయని, కళాశాలల యాజమాన్యాలను ఆర్థిక దివాళా తీయించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ఏమైంది? అడ్డంకులు సృష్టిస్తే తొక్కేస్తాం!దిగొచ్చే వరకు విరామం లేని పోరాటం! విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ విశ్రమించేది లేదని నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయకపోతే ఈ ఉద్యమాన్ని గద్వాల వీధుల నుంచి హైదరాబాద్ సచివాలయం వరకు ఉద్ధృతం చేస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు జయశ్రీ నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, వివిధ మోర్చాల నేతలు సమత గౌడ్, కిష్టన్న, దాస్, పురపాలక సంఘ సభ్యులు మరియు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మిరుదొడ్డి, ఆగస్టు 24, వుదయం:**

పేదోడికి భరోసా కల్పించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయడం జరుగుతుందని మిరుదొడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సంయుక్త శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో రేషన్ కార్డులు అందించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడం జరిగిందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో పేద ప్రజలకు రేషన్ సరుకులకే కాకుండా ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంతగానో కీలకంగా రేషన్ కార్డులు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

## అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 24(ఉదయం ప్రతినిధి)**: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం (IDOC) సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 75 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (DRO) మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## గుమ్మడిదల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



**గుమ్మడిదల,ఆగస్టు 24 (ఉదయం ప్రతినిధి)** యం): నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం మరియు పరిశ్రమల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో రూ. 1.69 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

ఇందులో భాగంగా బొంతపల్లిలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో రూ. 86.50 లక్షల వ్యయంతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి, వీరన్నగూడెంలో రూ. 15 లక్షల సీఆర్ఆర్ నిధులతో అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే గుమ్మడిదల లో హానర్ ల్యాబ్స్, మైత్రి పరిశ్రమల సౌజన్యంతో రూ. 45 లక్షలతో సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా.. నాగిరెడ్డిగూడెం గ్రామంలో న్యూల్యాండ్ పరిశ్రమ సహకారంతో రూ. 22 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ధ్యేయంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. గుమ్మడిదల ప్రాంత అభివృద్ధిలో పరిశ్రమల యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో భాగస్వామ్యం కావడం అభినందనీయమని, ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సహకారం అందితే అభివృద్ధి మరింత వేగంగా సాగుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు , పరిశ్రమల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## పిఎన్ ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**రామచంద్రపురం ఆగస్టు 24 (ఉదయం ప్రతినిధి)**

శ్రీనివాస్ నగర్ కాలనీలో పిఎన్ ఫౌండేషన్ నూతన కార్యాలయాన్ని ఆలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ బీర్ల ఐలయ్య కురుమ ప్రారంభించారు. స్థానిక రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం బూరుగడ్డ పుష్పనగేష్ కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.కార్యక్రమం అనంతరం స్థానిక నాయకులు, కాలనీ వాసులు, కార్యకర్తలతో కలిసి బీర్ల ఐలయ్య ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ ఒక మొక్క

- వన మహోత్సవాన్ని విస్తృతంగా చేపడదాం!
- అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.







**రంగారెడ్డి జిల్లా. ఆగస్టు 24 (ఉదయం)**: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని

ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు.

వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలుఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది.రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, "ఒక్క వ్యక్తికి ఒక మొక్క - ఒక్క ఇంటికి ఒక మొక్క" అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధుల ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలిదేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీఅన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

**పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత**

పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.

చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకంతాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టిఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ మరియు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి (DFO) శివ ఆశిష్‌సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్‌మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, డి. ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 19,20 తేదీలలో... ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సమావేశాలు



**హైదరాబాద్ ఆగస్టు 24 (ఉదయం ప్రతినిధి)**

ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 19,20 తేదీలలో బీహార్ రాష్ట్రంలోని బోధ్ గయాలో జరుగుతాయని ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలిపారు.అదే విధంగా అక్టోబర్ 28న ఐఎఫ్ డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు దేశవ్యాపిత జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ తో ఢిల్లీలోని జంతర్ మంతర్ లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో పాత్రికేయుల రక్షణకు ప్రత్యేక చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రైల్వే రాయితీ పునరుద్ధరణ తదితర డిమాండ్ల సాధనకై తలపెట్టిన ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జర్నలిస్టులను సమీకరించడం జరుగుతుందని అన్నారు. సెప్టెంబర్ 19,20 తేదీలలో బోధ్ గయాలో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఆయా రాష్ట్రాల అధ్యక్ష,కార్యదర్శులు హాజరవుతారని పేర్కొన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు గోపాల్ మిశ్రా అధ్యక్షతన బోధ్ గయాలో జరిగే ఈ రెండు రోజుల జాతీయ కౌన్సిల్ సమావేశాలలో ఆయా రాష్ట్రాల సమస్యలు, జాతీయ స్థాయి జర్నలిస్టుల సమస్యల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని మామిడి సోమయ్య తెలిపారు.

పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ, జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులు, రక్షణ చట్టాలు తదితర అంశాలపై జాతీయ సమావేశాలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వివిధ జిల్లాల కు చెందిన ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని, అదేవిధంగా అక్టోబర్ 28న ఢిల్లీ జంతర్ మంతర్ లో జరిగే నిరసన ప్రదర్శన కు రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులను తరలిస్తామని అన్నారు.



## నాణ్యమైన అల్పాహారంతో మెరుగైన విద్యాభ్యాసం

- చేవెళ్ల 14వ వార్డులో సీఎం అల్పాహారం పథకం ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి

**చేవెళ్ల,ఆగస్టు24 (ఉదయం)** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ప్రభుత్వ పాఠశాలలో సీఎం అల్పాహారం పథకాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, ప్రారంభించారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె అల్పాహారం చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ..విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు విద్యాభ్యాసం కూడా మరింత చురుగ్గా సాగుతుందని తెలిపారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించగలరని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం అభినందనీయమని ఆమె అన్నారు. సీఎం అల్పాహారం పథకం విద్యార్థుల ఆరోగ్యానికి, వారి విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, మద్దెల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 22A, భూ భారతి భూముల విషయంలో బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

**రంగారెడ్డి జిల్లా ,ఆగస్టు24 (ఉదయం)**

రంగారెడ్డి జిల్లాలో 22A జాబితాలో ఉన్న భూములు, భూ భారతి రికార్డులకు సంబంధించిన భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు. కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు భూముల రికార్డులను సరిచేస్తామని, 22A జాబితా నుంచి భూములను తొలగిస్తామని, భూ భారతి ద్వారా భూమిపై హక్కులు కల్పిస్తామని చెబుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందన్నారు. ఇలాంటి వ్యక్తుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు.భూమిని కొనుగోలు చేసే ముందు లేదా భూమికి సంబంధించిన ఏదైనా లావాదేవీ నిర్వహించే ముందు సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి సర్వే నంబర్, భూమి స్థితి, 22A జాబితాలోని వివరాలు, భూ భారతి రికార్డులు,

ఇతర చట్టపరమైన అంశాలను అధికారికంగా నిర్ధారించుకోవాలని సూచించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయిస్తామని చెప్పే మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

## పోచమ్మ దేవాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే జిఎంఆర్ రూ.12 లక్షల భారీ విరాళం



**జిన్నారం ఆగష్టు 24 (ఉదయం ప్రతినిధి )**

ఒక వైపు ప్రజాసేవలో.. మరో వైపు భక్తి సేవలో తనదైన ముద్రను చాటుతున్నారు పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా పరమతసహనం పెంపొందిస్తూ.. సొంత నిధులతో గుడులు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందిస్తున్నారు. తాజాగా.. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి 12 లక్షల రూపాయల భారీ విరాళం అందించి తన దైవభక్తిని మరోమారు చాటుకున్నారు. సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు,

గ్రామ ప్రజలతో కలిసి ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించి.. ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవను తన బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా.. ప్రజలను ఐక్యం చేసే సామాజిక వేదికలని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సొంత నిధులతో నియోజకవర్గం వ్యాప్తంగా 200 లకు పైగా దేవాలయాలు, మసీదులు, ఆశీర్ఖానాలు, చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం ఆధ్యాత్మికతను ప్రోత్సహించడంతో పాటు ప్రజల సంక్షేమం,

నియోజకవర్గ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్ సేవా కార్యక్రమాలు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో నషా ముక్త భారత్ అభియాన్ పై పీఐబీ వార్తా మీడియా వర్క్ షాప్

**హైదరాబాద్., ఆగస్టు24 (ఉదయం)**

మాదక ద్రవ్యాలు కలిగించే దుష్ప్రభావాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడంలో భాగంగా పత్రికా విలేకరుల అవగాహన కోసం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో ఈ నెల 25వ (ఆగస్టు 25, 2026) తేదీన ఒక వర్క్ షాపును నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ పత్రికా సమాచార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మహేశ్వరంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మాదక ద్రవ్య రహిత సమాజాన్ని రూపొందించడంలో భాగంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజల్లోకి ఎలా తీసుకుపోవాలన్న అంశంపై విలేకరులకు అవగాహన కల్పిస్తారు.మాదక ద్రవ్యాలు సమాజంపై ఎలాంటి చెడు ప్రభావాన్ని చూపిస్తున్నాయన్న అంశాన్ని ఐపీఎస్ అధికారి శ్రీ కె.నారాయణ రెడ్డి (మహేశ్వరం జోన్ డీసీపీ) విలేకరులకు వివరించడంతోపాటు, ఈ అంశంపై వచ్చే వార్తలకు పత్రికల్లో ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్నీ, ఈ సవాలును ఎదుర్కోవడంలో విలేకరులు పోషించాల్సిన పాత్రనూ తెలియజేస్తారు. తెలంగాణలో మాదక ద్రవ్యాల తాజా పరిస్థితి గురించి 'ఈగల్ బృందం' నుంచి వస్తున్న ఓ అధికారి విలేకరులకు వివరిస్తారు. 2026, ఆగస్టు 25వ తేదీ ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరుతూ హైదరాబాద్ పీఐబీ విలేకరులందరినీ ఆహ్వానిస్తున్నది. మరిన్ని వివరాల కోసం హైదరాబాద్ పీఐబీ, మీడియా కమ్యూనికేషన్ అధికారి వి గాయత్రి గారిని సంప్రదించవచ్చు.

## శ్రీ పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపనలో మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్

**శంకర్ పల్లి ఆగస్టు 24 (ఉదయం)**

శంకర్ పల్లి పట్టణంలో బి డి ఎల్ చౌరస్తా సమీపంలో నీ కాలనీలో నాలుగు రోజులుగా శ్రీ పోచమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు జరిగాయి. సోమవారం పోచమ్మ దేవి కి కాలనీవాసులు బోనాలు తలపై పెట్టుకుని అమ్మవారికి సమర్పించారు.

భాజా భజంత్రీలతో శివసత్తుల పాటలతో ఈ బోనాల ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమానికి శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చేకూర్త గోపాల్ రెడ్డి, శంకర్ పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి,

నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవింగ్ లో సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలి..

**.ఏ ఎస్ ఐ లు కాటంరాజు, చంద్రకళ..**



**శంకర్ పల్లి ఆగస్టు 24 (ఉదయం)**

వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ ఏ ఎస్ ఐ లు కాటమరాజు, చంద్రకళ తెలిపారు. సోమవారం శంకర్ పల్లి పట్టణ పరిధిలోని మీడియా చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. కార్లు నడిపేవారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదని, అలాగే రాంగ్ రూట్లో వెళ్లకూడదని తెలిపారు.మొబైల్ మాట్లాడుతూ బైకులు, వాహనాలు నడపకూడదని చెప్పారు.ప్రమాదాలు జరిగేలా వాహనాలు వేగంగా నడపకూడదు అన్నారు.


IN THE COURT OF THE HON'BLE VI ADDL JUNIOR CIVIL JUDGE, R.R.COURT AT : L.B.NAGAR
O.S.NO. 612 OF 2026

**Between :**
Surabi Vidyawathi and others ....Plaintiffs
**AND**
Ponugoti Sripathi Rao and all concerned ... Defendants

To
1.Ponugoti Sripathi Rao, S/o.Late Sudhakar Rao, Aged about 46 years, Occ: Business, R/o.Flat no.401, Plot no.259, 260, Road no.9, Prashanth Hills, Meerpet, R.R.District.
2.All concerned ... Defendants

**NOTICE**

To
All concerned
That the plaintiffs filed the above suit for Declaration to declare the plaintiffs are the legal heirs of Late Surabhi Ranga Rao who died on 24-01-2016 and to declare the plaintiffs are the owners and possessors of the half share i.e., 150 Sq.yds in plot.no.257 in sy.no.747, situated at Nadergul village (the then Saroornagar Mandal), Balapur mandal, R.R.Dist. NORTH: 30' Wide Road, SOUTH: Plot no.304, EAST : Plot no.258 and WEST : 30' Wide Road and successors of deceased Late Surabhi Ranga Rao who died on 24-01-2016 against the defendants and the above case is posted on 07-09-2026 at 10:30 A.M. That if any person or persons having any objection or claim, they may appear either in person or through an advocate on 07-09-2026 at 10:30 A.M failing which the matter will be decided basing on the documents available on records.
(By order of the court)

**Sd/-**
**K.Sada Siva Reddy**
**Advocate, Off : 17-1-386/SN/9, S.N.Reddy Nagar, Saidabad, Hyderabad.**
**Cell : 9848996050**

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE; MEDCHAL- MALKAJGIRI DISTRICT ::AT MEDIPALLY
O.S. NO.574 OF 2026

**Between :**
Singireddy Madhu Latha Reddy & Others .... Plaintiffs
**AND**
The Union Bank & Another .... Defendants

To
1. The Union Bank, Peerzadiguda Branch, Medchal-Malkajgiri District, Telangana – 500039 ...D1
2. All Concerned. ...D 2

NOTICE

That the above named Plaintiffs filed the above O.S for Legal Heir Certificate against all Defendants. The Defendants 1 & 2 are not appearing before the Hon'ble Principal Junior Civil Judge, Medchal-Malkajgiri District, at Medipally. The said case is posted to **29-09-2026** for your appearance. If the said Defendant No.1 & 2 will not appear on the said date at **10.30 A.M** before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter in your absence.
//By order of the court//

**Sd/-**
**P. Radhika Sharma**
**Advocate M/s Radhical Global Attorneys Uppal, Medchal-Malkajgiri District Telangana-98, Cell: 8978301122**
**radhicalglobalattorneys@gmail.com**

IN THE COURT OF X JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURTS; AT: HYDERABAD
O.S.NO. 2030 OF 2026

**Between :**
Kishore Sethuraman and Others ... Plaintiff
**AND**
The Tahsildar (MRO) and All concerned ... Defendants

To All concerned Whereas plaintiffs have instituted a suit against you for declaration to declare that the plaintiffs are the Legal Heirs of Late N.S. Sethuraman and Late Rajalakshmi Sethuraman and you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall accompanied by same person able to answer all such question on the **31st day of August, 2026** at 10-30 clock. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence.
By Order of Court

**Sd/-**
**DAMODAR MUNDRA**
**DINESH K GILDA**
**G VENKATESH**
**SHREYA MUNDRA**
**DIVYA MUNDRA**
**RIDHI RANKA**
**D NITHIN**
**Advocates 102, II Floor, KGN Plaza, Street No.8, Himayatnagar, Hyderabad. Cell No.9849013595**




ఆ బిల్లు కోసమే కేంద్రం ఆరాటం

"లోక్‌సభ సమావేశాలు ముగిసిన తర్వాత ప్రోరోగ్ చేయడానికి సాధారణంగా 24 రోజుల వ్యవధి ఉంటుంది. కొన్నిసార్లు రెండూ ఒకేరోజు నిర్వహించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ, లోక్‌సభ వాయిదాపడి 10 రోజులు గడుస్తున్నా.. ప్రోరోగ్‌కు సంబంధించిన సమాచారం లేదు. 2015, 2021లో నిరవధిక వాయిదాకు, ప్రోరోగ్‌కు మధ్య కాస్త గ్యాప్ ఉన్నప్పటికీ.. ఆ సమయంలో ఎలాంటి దుష్ట పన్నాగాలూ జరగలేదు. బహుశా ప్రత్యేక సమావేశాలు పెట్టి రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి హోంమంత్రి అమిత్‌షా 2/3 మెజారిటీ కోసం వెతుకులాడుతున్నట్లు ఉన్నారు'"

**- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి**

## వే'మన' పద్యం

**కల్లలాడువాని గ్రామకర్త యరుగు**
**సత్యమాడువాని స్వామి యరుగు**
**బెక్కుతిండపోతు(బెండ్లా మెరుంగురా**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



# సంపాదకీయం

## తినే ఆహారం.. తస్మాత్ జాగ్రత్త

ప్యాక్ చేసిన ఆహార పదార్థాల మార్కెట్... దేశంలో వేగంగా విస్తరిస్తోంది. ఆధునిక జీవనశైలిలో భాగమైన ఈ ఆహారం మన ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోందనేది చర్చనీయాంశంగా మారింది. నేడు మార్కెట్లో లభించే అత్యధిక శాతం ప్రాసెస్ చేసిన ఆహార ప్యాకెట్లపై 'షుగర్ ఫ్రీ', 'సహజమైనది', 'కొలెస్ట్రాల్ ఫ్రీ', లేదా 'పోషకాలతో కూడినది' అని ఆకర్షణీయమైన అక్షరాలతో ప్రచారం చేస్తుంటారు. కానీ నిజానికి ప్యాకెట్ వెనుక భాగంలో అతి చిన్న అక్షరాలతో ముద్రించే సమాచారాన్ని పరిశీలిస్తే... అందులో అధిక మొత్తంలో సేచురేటెడ్ కొవ్వులు, చక్కెర, అధిక ఉప్పు ఉన్నట్లు స్పష్టమవుతుంది. సాధారణ వినియోగదారుడికి ఈ సాంకేతిక పరిభాష లేదా చిన్న అక్షరాలను చదివి అర్థం చేసుకునే అవకాశం కానీ, సమయం కానీ ఉండవు. ఫలితంగా 'ఆరోగ్యకరమైనది' అని భావించి కొనుగోలు చేసే ఉత్పత్తులే స్థూలకాయం, మధుమేహం, గుండె జబ్బుల వంటి వ్యాధులకు దారితీస్తున్నాయి. 'రంగురంగుల ప్రచారాలతో పిల్లలను ఆకర్షించే అల్ట్రాప్రాసెస్డ్ ఆహారాల వెనుక ఉన్న నిజమైన ప్రమాదాలను తల్లిదండ్రులకు స్పష్టంగా తెలియజెప్పేలా ప్యాకెట్లపై హెచ్చరికలు ఉండాలి. పిల్లల పోషకాహార రక్షణకు ఇది ప్రాథమిక సూత్రం' అని యునిసెఫ్ చాలా కాలంగా హెచ్చరిస్తోంది. వాస్తవానికి ఆహార ఉత్పత్తుల ప్యాకెట్లపై ఆరోగ్య హెచ్చరికలను ప్రముఖంగా ముద్రించాల్సి వుంది. వ్యాపార సంస్థలు గానీ, ప్రభుత్వాలుగానీ దీనిని చూసీచూడనట్లే వ్యవహరిస్తున్నాయి.

మన చేతుల్లోకి వచ్చే ప్రతి ప్యాకెట్ ఆహారం... మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కానీ ఆ ప్యాకెట్‌పై ఉండే పోషక విలువల పట్టికను చూస్తే సాధారణ వినియోగదారుడికి అర్థమయ్యేది ఎంత? స్పష్టమైన ఆరోగ్య హెచ్చరికల లేబుళ్లను తీసుకురావడంపై దాదాపు దశాబ్ద కాలంగా చర్చలు జరుగుతున్నప్పటికీ, అమలు మాత్రం ఆలస్యమౌతూనే వుంది. ఈ జాప్యంపై అత్యున్నత న్యాయస్థానం తాజాగా కేంద్ర ప్రభుత్వం, 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎఫ్ఎస్ఎస్ఎఐ)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 'వినియోగదారుల ఆరోగ్య హక్కు... వాణిజ్య ప్రయోజనాల కంటే మిన్న' అని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నది ప్రభుత్వ విధానాల ప్రాథమిక లక్ష్యం కావాలి. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21లో జీవించే హక్కుతో పాటు ఆరోగ్యంగా ఉండే హక్కు కూడా అంతర్భాగం. ప్రాసెస్డ్ ఫుడ్, కంపెనీల మాయాజాలంపై 'ఆహార పరిశ్రమ మనల్ని పోషించడానికి ప్రయత్నించడం లేదు, అది మనల్ని వ్యసనపరులుగా మార్చడానికి ప్రయత్నిస్తోంది' అంటారు ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ మార్క్ హైమన్. కనుక ప్రజల ఆరోగ్యానికి వ్యాపార ప్రయోజనాలు అడ్డంకి కాకూడదు. 'ఆహార ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లు వినియోగదారులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడానికి ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయి' అంటారు డబ్లుహెచ్ఓ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్యా స్వామినాథన్.

ప్రజారోగ్యాన్ని కాపాడటానికి ఎఫ్ఎస్ఎస్ఎఐతో పాటు ప్రభుత్వం కూడా ఆహార ప్యాకెట్లపై స్పష్టంగా కనిపించేలా హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయాలి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ పద్ధతి మంచి ఫలితాలనిచ్చింది. అయితే, ఆహార తయారీ పరిశ్రమలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం హెచ్చరిక లేబుళ్ల అంశాన్ని నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నాయని నిపుణులు ఆరోపిస్తున్నారు. హెచ్చరిక లేబుళ్లకు బదులుగా ప్రకటనల తరహా 'స్టార్ రేటింగ్' విధానాన్ని తేవడం వినియోగదారులను దారితప్పించడమే అవుతుంది. ప్రజారోగ్యాన్ని వ్యాపార ప్రయోజనాల కంటే ప్రాధాన్యతాంశంగా చూసినప్పుడే దేశంలో పెరుగుతున్న స్థూలకాయం, మధుమేహ మహమ్మారులను అరికట్టడం సాధ్యమవుతుంది. హెచ్చరిక లేబుళ్లపై కేంద్ర ప్రభుత్వం ఇకనైనా జాప్యం వీడి పారదర్శకమైన విధానాన్ని తక్షణం అమలు చేయాలి. చిలీ, మెక్సికో వంటి దేశాల్లో ఆహార ప్యాకెట్ల ముందు భాగంలో కనిపించే స్పష్టమైన హెచ్చరికలు వినియోగదారులకు సులభంగా నిర్ణయం తీసుకునే అవకాశం కల్పిస్తాయి. కంపెనీలను కూడా తమ ఉత్పత్తులలో చక్కెర, ఉప్పు, కొవ్వు తగ్గించే దిశగా ప్రోత్సహించాయని అనుభవాలు చెబుతున్నాయి. మన దేశం కూడా ఈ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. వినియోగదారుడు ప్యాకెట్ కొనేటప్పుడు ముందుగా బ్రాండ్‌ను కాదు, తన ఆరోగ్యాన్ని చూడగలిగేలా లేబుల్ ఉండాలి. లేబుల్ అనేది కేవలం వ్యాపార సమాచారం కాదు; అది వినియోగదారుడి హక్కు. ఏ ఆహారాన్ని తినాలి, ఎంత తినాలి, ఏ ఆహారాన్ని దూరంగా ఉంచాలి అనే అంశంపై నిర్ణయం తీసుకునేంత స్పష్టమైన సమాచారం ప్రతి పౌరుడికి అందాలి.

**రచనలు పంపండి**

ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# సమాజ హితుడు ప్రవక్త

స్త్రీల పట్ల ప్రవక్త (స) చూపిన గౌరవం, కల్పించిన హక్కులు అప్పట్లో ఒక అపూర్వ విప్లవానికి నాంది పలికాయి. మహిళను కేవలం భోగవస్తువుగా చూసే సమాజంలో ఆమెకు ఆస్తి హక్కు, వివాహ ఎంపిక హక్కు, విడాకుల హక్కు, గౌరవప్రదంగా జీవించే హక్కును అందించారు. 'తల్లి పాదాల కిందనే స్వర్గం ఉంది' అని ప్రకటించడం ద్వారా సమాజంలో స్త్రీ స్థానాన్ని అత్యున్నత శిఖరానికి చేర్చారు. ఆడపిల్ల జననాన్ని శాపంగా కాకుండా, దైవ ఆశీర్వాదంగా స్వీకరించాలని బోధించారు. భార్యగా, తల్లిగా, కుమార్తెగా, సోదరిగా ప్రతి రూపంలోనూ మహిళకు సమాజంలో తగిన రక్షణ, ప్రాధాన్యత, మార్గదర్శి మాత్రమే కాదు, ఒక అద్భుతమైన సమాజ నిర్మాత, దార్శనిక పాలకుడు.

మా మానవజాతి చరిత్రలో ఏడవ శతాబ్దపు అరేబియా ఒక అత్యంత అంధకార పూరితమైన కాలం. అది అన్యాయం, అజ్ఞానం, జాతి వివక్ష, స్త్రీలపై దౌర్జన్యాలు, బలవంతుల అణచివేతలతో కూరుకుపోయిన చీకటి యుగం. మానవత్వానికి ఏమాత్రం విలువ లేని ఆ రోజుల్లో, బలహీనుల ఆర్తనాదాలు అరణ్యరోదనగానే మిగిలిపోయేవి. ఆడపిల్ల పుట్టడమే ఒక పెద్ద అపరాధంగా, శాపంగా భావించి ఆమెను ప్రాణాలతోనే మట్టిలో పాతిపెట్టే కిరాతక సంస్కృతి రాజ్యమేలేది. సమాజంలో సమానత్వం, మానవ హక్కులు అనే ప్రాథమిక భావనలకు సైతం స్థానం లేని ఆ కఠిన పరిస్థితుల్లో, ముహమ్మద్ ప్రవక్త (స) ఒక వెలుగుగా, మానవాళి విమోచకుడిగా లోకంలోకి వచ్చారు. ఆయన రాకతో అరేబియా ద్వీపకల్పంలోనే కాక, విశ్వవ్యాప్తంగా ఒక నూతన మానవతా శకం ఆరంభమైంది.

**సామాజిక విప్లవం, సమానత్వ స్థాపన**

ముహమ్మద్ ప్రవక్త (స) తెచ్చిన మార్పు కేవలం మతపరమైన పరిమితులకు మాత్రమే పరిమితం కాలేదు. అది సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక రంగాలన్నింటినీ ప్రభావితం చేసిన ఒక సమగ్ర విప్లవం. మానవులందరూ ఒక్కటేనని, దేవుని దృష్టిలో అందరూ సమానులేనని ఆయన చాటి చెప్పారు. అరబ్బుకు అరబ్బేతరునిపై గానీ, తెల్లవానికి నల్లవానిపై గానీ ఎటువంటి ప్రాధాన్యత లేదని, కేవలం నైతికత, దైవభీతి మాత్రమే మనుషుల శ్రేష్ఠతకు కొలమానాలని స్పష్టం చేశారు. ఈ మహోన్నత బోధన ద్వారా శతాబ్దాలుగా వేరూనుకుపోయిన జాతి, వర్ణ, వర్గ వైషమ్యాలను ఆయన వేళ్లతో సహా పెకలించి వేశారు. బానిసత్వాన్ని అంతం చేసే దిశగా చారిత్రాత్మకమైన చర్యలు చేపట్టి, బానిసలను తమ సొంత సోదరులుగా చూడాలని, వారిని విముక్తులను చేయడం అత్యంత పుణ్యకార్యమని బోధించి సమాజంలో సరికొత్త సమతాభావాన్ని నింపారు.

**స్త్రీ హక్కుల పునరుద్ధరణ, కుటుంబ విలువలు**

స్త్రీల పట్ల ప్రవక్త (స) చూపిన గౌరవం, కల్పించిన హక్కులు అప్పట్లో ఒక అపూర్వ విప్లవానికి నాంది పలికాయి. మహిళను కేవలం భోగవస్తువుగా చూసే సమాజంలో ఆమెకు ఆస్తి హక్కు, వివాహ ఎంపిక హక్కు, విడాకుల హక్కు, గౌరవప్రదంగా జీవించే హక్కును అందించారు. 'తల్లి పాదాల కిందనే స్వర్గం ఉంది' అని ప్రకటించడం ద్వారా సమాజంలో స్త్రీ స్థానాన్ని అత్యున్నత శిఖరానికి చేర్చారు. ఆడపిల్ల జననాన్ని శాపంగా కాకుండా, దైవ ఆశీర్వాదంగా స్వీకరించాలని బోధించారు. భార్యగా, తల్లిగా, కుమార్తెగా, సోదరిగా ప్రతి రూపంలోనూ మహిళకు సమాజంలో తగిన రక్షణ, ప్రాధాన్యత, న్యాయమైన హక్కులు లభించేలా చట్టబద్ధమైన, నైతికపరమైన నియమాలను ఏర్పాటు చేశారు.

**మదీనా రాజ్యాంగం: ప్రజాస్వామ్యానికి తొలి అడుగు**

ముహమ్మద్ ప్రవక్త (స) కేవలం ఒక ఆధ్యాత్మిక మార్గదర్శి మాత్రమే కాదు, ఒక అద్భుతమైన సమాజ నిర్మాత, దార్శనిక పాలకుడు. ఆయన మదీనాకు వలస వచ్చిన తర్వాత అక్కడ రూపొందించిన 'సహీఫతుల్ మదీనా' (మదీనా రాజ్యాంగం) మానవ చరిత్రలోనే మొట్టమొదటి లిఖితబద్ధమైన సామాజిక ఒప్పందంగా నిలిచింది. భిన్న తెగలు, ముస్లింలు, యూదులు, ఇతర మతస్థులందరినీ ఒకే వేదికపైకి తెచ్చి, అందరికీ సమాన పౌర హక్కులు, మత స్వేచ్ఛను ఈ రాజ్యాంగం ద్వారా ఖరారు చేశారు. పరస్పర సహకారం, సామరస్యం, కలిసికట్టుగా మాతృభూమిని రక్షించుకోవడం ఇందులో ప్రధానాంశాలు. ఆధునిక లౌకిక, ప్రజాస్వామ్య భావనలకు, పౌర హక్కుల పత్రాలకు ఈ మదీనా రాజ్యాంగమే అసలైన పునాదిగా నిలిచింది.



**ఆర్థిక న్యాయం, దోపిడీ రహిత వ్యవస్థ**

సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించి, సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చూడటానికి ప్రవక్త (స) ఒక సమగ్రమైన ఆర్థిక నమూనాను అందించారు. పేదలను, బలహీనులను పీల్చి పిప్పిచేసే వడ్డీ (రిబా) రహిత వ్యవస్థను అమలులోకి తెచ్చారు. జకాత్ , సదఖా వంటి దానధర్మాల వ్యవస్థల ద్వారా ధనవంతుల సంపద నుండి పేదలకు న్యాయమైన వాటా అందేలా చూశారు. ధనం అనేది కేవలం వ్యాపార వర్గాల మధ్య మాత్రమే పరిభ్రమించకుండా, సమాజంలోని అత్యంత దిగువ స్థాయిలో ఉన్న పేదవాడికి కూడా ఆసరాగా నిలవాలనే ఆర్థిక సత్యాన్ని ఆచరణలో చూపించారు. ఇది నేటికీ ప్రపంచానికి కావలసిన అత్యుత్తమ ఆర్థిక సంక్షేమ నమూనా.

**శాంతి, సహనం, చివరి హజ్ ప్రసంగం**

హింస, యుద్ధాల కంటే శాంతి, సంప్రదింపులు, క్షమాగుణానికే ప్రవక్త (స) ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. శత్రువులను సైతం క్షమించి మనస్సులను గెలుచుకోవడమే నిజమైన విజయమని ఆయన తన జీవితాంతం నిరూపించారు. ఆయన చేసిన చివరి హజ్ ప్రసంగం (విదా ఖుత్బా) మానవ హక్కుల చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. మానవుల ప్రాణాలు, ఆస్తులు, గౌరవ మర్యాదలు పవిత్రమైనవని, వాటిని భంగపరచే హక్కు ఎవరికీ లేదని ఆ ప్రసంగంలో స్పష్టం చేశారు. నేటి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనకు శతాబ్దాల ముందేప్రవక్త (స) మానవాళికి ఈతొలి విశ్వజనీన హక్కుల చార్టర్‌ను అందజేశారు.

**ఆధునిక సమాజానికి ప్రవక్త బోధనల ఆవశ్యకత**

నేటి ఆధునిక యుగంలో కూడా ప్రపంచం మళ్లీ నూతన రూపాల్లో అన్యాయం, అసమానతలు, ద్వేషం, వర్గ పోరాటాలు, యుద్ధాలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సాంకేతికంగా మానవుడు ఎంతో ప్రగతి సాధించినప్పటికీ, మానవీయ విలువల విషయంలో తీవ్రంగా వెనుకబడిపోతున్నాడు. అధికారం, ధనం, వర్ణం, లింగం పేరిట విభజనలు రోజురోజుకూ పెరుగుతున్న ఈ కాలంలో ముహమ్మద్ ప్రవక్త (స) బోధనలు మునుపటి కంటే అత్యంత ప్రాసంగికంగా మారాయి.మీలాదున్నబీ సందర్భం అనేది కేవలం ఉత్సవాలు, ఊరేగింపులకే పరిమితం కాకూడదు. ప్రవక్త (స) చూపిన శాంతి, దయ, సమానత్వం, న్యాయమనే మార్గంలో నడవడమే ఆయన పట్ల మనం ప్రకటించే నిజమైన ప్రేమాభిమానాలకు నిదర్శనం. సమాజంలో బలహీనులకు అండగా నిలవడం, స్త్రీలను గౌరవించడం, ఆర్థిక శోషణను నిరసించడం, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడం ద్వారా మాత్రమే మనం ఒక సమతాపూరితమైన, శాంతియుతమైన నవ సమాజాన్ని నిర్మించగలము.



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645

# హెచ్చరిక లేబుళ్లు!



100 శాతం స్వచ్ఛం, 100 శాతం సహజం, 100 శాతం స్వచ్ఛతకు హామీ వంటి పదాలు భారత వినియోగదారుల నమ్మకంలో భాగమయ్యాయి. ఆ పదాలు ఉత్పత్తి నాణ్యతకు హామీ ఇస్తున్నాయనే భావనతో చాలామంది వాటిని ఎంచుకుంటున్నారు. ఇప్పుడు ఆ నమ్మకాన్నే భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ చేపట్టిన తాజా చర్యలు ప్రశ్నిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ 150కు పైగా ఆహార, పానీయ సంస్థలకు తప్పుదోవ పట్టించే ప్రకటనలు, నిర్ధారణ లేని క్లెయిమ్‌లు, లేబులింగ్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి నోటీసులు జారీ చేసింది. నెస్లే ఇండియా, పెప్సీకో ఇండియా, కోకాకోలా ఇండియా వంటి ప్రముఖ సంస్థలు కూడా ఈ నోటీసులు అందుకున్నట్లు సమాచారం. అయితే ఈ 150కు పైగా సంస్థలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ విక్రయ నిషేధం విధించిందని చెప్పడం మాత్రం వాస్తవం కాదు; ప్రధానంగా వివరణ కోరడం, నిబంధనలకు అనుగుణంగా లేబుళ్లు, ప్రకటనలను సవరించుకోవడం వంటి చర్యలు చేపట్టింది.డాబర్ విషయంలో మాత్రం ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్య మరింత కఠినంగా మారింది. ఆగస్టు 3న ఎఫ్ఎస్ఎస్ఏఐ కొన్ని డాబర్ ఉత్పత్తులపై 100 శాతం సంబంధిత క్లెయిమ్‌లతో విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించింది. తేనె, ఆవు నెయ్యి, కొన్ని తినదగిన నూనెలు తదితర ఉత్పత్తులు ఇందులో ఉన్నాయి. అయితే ఆగస్టు 7న ఢిల్లీ హైకోర్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఆ నిషేధ ఉత్తర్వుపై తాత్కాలికంగా నిలుపుదల ఆదేశాలు ఇచ్చింది. డాబర్‌కు ముందుగా తన వాదన వినిపించే అవకాశం ఇవ్వకుండా నిషేధ ఉత్తర్వు జారీ చేయడంపై కోర్టు ప్రాథమికంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది తుది తీర్పు కాదు. డాబర్ ఉత్పత్తులపై చేసిన క్లెయిమ్‌లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది తుది న్యాయపరిశీలనలో తేలాల్సి ఉంది.


అసలు సమస్య ఇక్కడే ఉంది. 100 శాతం అంటే ఏమిటి? 2018లో అమల్లోకి వచ్చిన ఆహార ప్రకటనలు, క్లెయిమ్‌ల నిబంధనలు ఆహార ఉత్పత్తులపై చేసే క్లెయిమ్‌లు నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, తప్పుదోవ పట్టించనివిగా ఉండాలని నిర్దేశిస్తున్నాయి. అయితే 100 శాతం అనే పదానికి ప్రత్యేక నిర్వచనం ఆ నిబంధనల్లో లేదు. 2025లోనే ఆహార భద్రతా సంస్థ ఈ పదబంధం అస్పష్టమైనదిగా, తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉన్నదిగా పేర్కొంటూ ప్రత్యేకంగా హెచ్చరించింది. అందువల్ల ఈ పరిణామాన్ని కంపెనీలు సంవత్సరాలుగా మోసం చేశాయి అనే ఒకపక్ష నిర్ణయంగా చూడటం సరికాదు. అదే సమయంలో నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలు ఎందుకు ఇంత ఆలస్యంగా, ఇప్పుడు ఇంత విస్తృతంగా జరుగుతోంది? అనే ప్రశ్నకు నియంత్రణ సంస్థ సమాధానం చెప్పాలి. 2024లోనే 100 శాతం పండ్ల రసం వంటి క్లెయిమ్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు రావడం ఈ అంశం కొత్తది కాదని చూపుతోంది.మరో ముఖ్యమైన అంశం సమాన అమలు. దేశీయ సంస్థ అయినా, బహుళజాతి సంస్థ అయినా ప్రమాణం ఒకటే కావాలి. కంపెనీ పరిమాణం, మార్కెట్ ప్రభావం, రాజకీయ లేదా వాణిజ్య ఒత్తిడి ఏదీ నియంత్రణ ప్రమాణాలను మార్చకూడదు. అదే సమయంలో నోటీసు అందుకున్న ప్రతి సంస్థను దోషిగా ప్రకటించడం కూడా సరికాదు. కొందరు సంస్థలు ఇప్పటికే లేబుళ్ల, ప్రకటనల్లో మార్పులు చేపట్టాయి.

ఇక ముందుకు వెళ్లాల్సిన మార్గం స్పష్టంగా ఉంది. 100 శాతం, సహజం, స్వచ్ఛం, సేంద్రియం, ఆరోగ్యకరం వంటి క్లెయిమ్‌లకు శాస్త్రీయ ఆధారం, స్పష్టమైన నిర్వచనం, నిర్ధారణ విధానం ఉండాలి. ఉల్లంఘన నిర్ధారణ అయితే జరిమానాలు కంపెనీల పరిమాణానికి తగినంత ప్రభావవంతంగా ఉండాలి. పునరావృత ఉల్లంఘనలకు కఠిన చర్యలు ఉండాలి. వినియోగదారుడి నమ్మకాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించే అవకాశం లేకుండా ముందస్తు తనిఖీ వ్యవస్థను కూడా బలోపేతం చేయాలి.లేబుల్‌పై ఒక మాట వినియోగదారుడిని అదనపు ధర చెల్లించేలా చేస్తే, ఆ మాటకు శాస్త్రీయమైన, చట్టపరమైన బాధ్యత కూడా ఉండాలి. ఆ బాధ్యత కంపెనీలకే కాదు, నియంత్రణ సంస్థలకూ వర్తించాలి. 100 శాతం అనే ఆకర్షణ కంటే నిరూపించగల నాణ్యత భారత ఆహార మార్కెట్‌కు నిజమైన ప్రమాణంగా మారినప్పుడే వినియోగదారుడి నమ్మకానికి న్యాయం జరుగుతుంది.



సి. హెచ్. ప్రతాప్
77938 00743

# తెలుగు ప్రజలకు వరం సురవరం



హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి.

అవి తెలుగు భాషను గుర్తించని, స్థానిక ప్రాంతీయ భాషకు విలువలేని, తెలుగు భాషలో చదువు కోవడానికి కూడా సౌకర్యాలు అంతగా లేని రోజులు. నిజాం పాలకుల నిరంకుశ పాలనలో సామాజిక చైతన్యం దాదాపు శూన్య స్థితిలో స్తబ్ధంగా ఉన్న సమయం. తెలంగాణ ప్రాంతంలో అధికార భాష ఉర్దూ మాధ్యమంలో చదువులు సాగడం, ఉర్దూ లోనే ప్రభుత్వ, వ్యావహారిక కార్యక్రమాలు కొనసాగడం, చదువుకున్న వారు ఉర్దూ చదవటం ఒక హోదా చిహ్నంగా ప్రజలు భావించే కాలం. అప్పుడు రాజభాషగా, పాలనా భాషగా, వ్యవహారభాషగా ఉర్దూ ఉండగా, ఉర్దూ భాషలోనే మీజాన్, జామీన్, రయ్యత్ పత్రికలు వచ్చేవి. అప్పటికి రెండు తెలుగు వార పత్రికలు మాత్రమే 'నీలగిరి' నల్లగొండ జిల్లా నుండి, 'తెలుగు' వరంగల్ జిల్లా నుంచి వెలువడు తుండేవి.

అలాంటి నిజాం రాజ్యంలో, ప్రతికూల వాతా వరణంలో తెలుగు పత్రికని స్థాపించడమే ఓ సాహసం. ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషలు రాజ్యమేలుతున్న నిజాం రాజ్యంలో తెలుగు సాహిత్యం నిలదొక్కు కునేందుకు 'గోలకొండ పత్రిక' బీజం వేసింది.

హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు ప్రజల విజ్ఞానానికి తెలుగులో పత్రికను ప్రారంభించాలని నిశ్చయించారు. అంధకార బంధుర మైన నాటి పరిస్థితులలో గోలకొండ పత్రిక అనే చిరుదివ్వెను వెలిగించి తన బహుముఖ ప్రజ్ఞతో సంస్థలను, ఉద్యమాలను నిర్మించి, ప్రజల చైతన్యాన్ని తట్టిలేపే బృహత్తర కార్యక్రమం ప్రారంభించారు సురవరం ప్రతాపరెడ్డి. మాతృ భాషలో చదువుకొనే అవకాశాలు లేక అంతా ఉర్దూమయమై, నిజాం నిరంకుశ పరిపాలనలో, నిద్రాణ స్థితిలో ఉన్న తెలంగాణను జాగృతం చేయాలన్న సురవరం దీక్ష ఫలితమే...1926 మే 19న గోలకొండ పత్రిక ప్రారంభ నేపథ్యం. ఆ పత్రిక వారానికి రెండు మార్లు వెలువడు తుండేది. పత్రిక నిర్వహణలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. జాతీయ భావాలను ధైర్యంగా ప్రచారం చేశారు. 1947 లో అది దినపత్రికగా మారింది. నిజాంను తన పత్రికలలో ఏకిపారేస్తూ దూకుడుగా వ్యవహరించేవారు సురవరం. ఒక దశలో నిజాం రాజు గోలకొండ సంపాదకీయాలకు భయపడ్డారంటే... ఆయన కలం నిజాం ను ఎంత కలవర పరిచిందో అర్థం చేసుకోవచ్చు.

పత్రిక ఆదర్శాలను గురించి వివరిస్తూ ప్రతాపరెడ్డి ఒక సంపాదకీయంలో... "మేము మా పత్రిక స్థాపన కాలం నుండియు రెండంశములు దృష్టి పథమందుంచు కొని దేశీయులకు సేవ చేయు చున్నాము. మొదటిది ఆంధ్రాభాషా సేవ, రెండవది జాతి, మత, కుల వివక్షత లేక ఆంధ్రులలో సర్వశాఖల వారి యొక్క సత్వరాభి వృద్ధికై పాటుపడుట".

ఈ ఆశయాన్ని నెరవేర్చేందుకే ప్రతాపరెడ్డి క్షణం విశ్రాంతి లేకుండా ఎనలేని కృషి చేశారు. గోలకొండ పత్రికకి సురవరమే సర్వస్వంగా ఉండేవారు. సంపాదకుడి దగ్గర నుంచి ప్రూఫ్ రీడరు వరకూ అన్ని బాధ్యతలూ నెత్తిన వేసుకుని పత్రికను నడిపించే వారు. గోలకొండ ప్రతాపరెడ్డి ప్రతిభకు అద్దం పట్టింది. తెలంగాణ ప్రజానీకాన్ని జాగృత పరచటంలో అద్భుత పాత్రను నిర్వహించింది. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి పత్రికా సంపాదకుడిగా,రచయితగా సేవలు అందించారు. ఆయన రాసిన వ్యాసాలూ, పద్యాలూ, విమర్శలూ, సంపాదకీయాలూ 1000కి మించి ఉంటాయి. ఇతర పత్రికల్లో 100కు పైగా వ్యాసాలు రాసి ఉంటారు. కథానికలూ, కవితలూ రాశారు. పత్రికలో కొన్ని శీర్షికలని స్వయంగా నిర్వహించారు. చిత్రగుప్త, భావకవి, రామ్మూర్తి, యుగపతి సింహ, సంగ్రామసింహ మొదలైన ఎన్నో మారు పేర్లతో ఆయన అసంఖ్యాక రచనలు చేశారు.

1896 మే 28 తేదీన జన్మించిన సురవరం కర్నూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వెల్లాల శంకరశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు, వ్యాకరణం చదువు కొన్నారు. నిజాం కాలేజీలో ఎఫ్.ఎ. మద్రాసు ప్రెసిడెన్సి కాలేజిలో బి.ఏ. చదివిన తర్వాత బి.ఎల్. చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. కాని ఎంతో కాలం ఆ వృత్తిలో ఉండలేక పోయారు.

గాంధీజీ నాయకత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటం ఆయనను ఆకర్షించింది. తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయారు. భావుకుడైన రచయితగా, సురవరం కథలు నిజాం కాలం నాటి ప్రజల జీవితాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రించినవి.

1924లో హైదరాబాద్ లోని రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా నియమితులై,

ప్రతాపరెడ్డి హాస్టల్ విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి వారిని చైతన్య వంతులను కావించి, నాటి కొత్వాల్ అయిన రాజా బహదూర్ ఆశీస్సులతో 1926 మే 10వ తేదీన 'గోలకొండ' పత్రికను ప్రారంభించారు. పోలీస్ చర్య వరకు ప్రతాపరెడ్డి 'గోలకొండ' పత్రికా సంపాదకులుగా పనిచేసారు. 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి 'ఆంధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. కార్యాకలాపాలన్ని తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు. 1951 లో ప్రతాపరెడ్డి పులిజాల హనుమంతరావు తో కలిసి 'ప్రజావాణి' దినపత్రికను స్థాపించి రెండేళ్ళు నడిపారు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి పట్ల ప్రగాఢమైన అభిమానం ఉండేది. ప్రజలలో విజ్ఞాన వికాసానికి గొప్ప రచనలు చేశారు. తెలంగాణా ప్రజల భాషనుకాని, సంస్కృతినిగాని తక్కువ చేసి మాట్లాడితే సహించేవారు కాదు. తెలంగాణలో తెలుగు కవులు లేరన్న ముదుంబ వెంకట రాఘవాచార్య వ్యాఖ్యలకు స్పందించి, 354 మంది తెలంగాణ కవుల పరిచయాలతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక'ను విడుదల చేశారు సురవరం. ఆయన నిజాం రాష్ట్ర పాలన, మొగలాయి కథలు, సంఘోద్ధరణ, ఉచ్చల విషాదము, గ్రంథాలయము, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, యువజన విజ్ఞానం మొదలైన రచనలు, దాదాపు 40 గ్రంథాలు రచించారు. సురవరం రచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్రకు 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు' లభించింది. దానిలో దాదాపు వెయ్యేళ్ల ఆంధ్రుల చరిత్రను నమోదు చేశారు. తెలంగాణలో గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించారు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ఆయనే అధ్యక్షులు.

1952 లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో, మిత్రుల ఒత్తిడిపై వనపర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పక్షాన పోటీచేసి విజయం సాధించారు. కాని రాజకీయాలు ఆయనకంతగా రుచించలేదు. త్యాగము, దేశభక్తి, భాషాభిమానం ప్రజా శ్రేయస్సు పరమార్థంగా జీవించిన సురవరం ప్రతాపరెడ్డి 1953 ఆగష్టు 25న దివంగతులయ్యారు.

అయన సేవలు అందుకొనని సంస్థ తెలంగాణలో లేదంటే అతిశయోక్తి కాదు.

ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, వేమన ఆంధ్ర భాషా నిలయం, హిందీ ప్రచారసభ తదితర సంస్థల ప్రగతికి ఎంతో కృషి చేశారు. తెలుగు జాతికి అయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదు లోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం ఉంది. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులుగా ,పత్రికా సంపాదకుడుగా, న్యాయవాదిగా, రచయితగా, సంఘ సంస్కర్తగా, ప్రజా ప్రతినిధిగా, చరిత్రకారునిగా, పరిశోధకుడుగా, పండితుడుగా, క్రియాశీల ఉద్యమ కారుడుగా బహుముఖాలుగా సాగిన సురవరం ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ఒక అధ్యాయం.

ఆయన తెలుగు ప్రజలకు వరం..



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# జాతీయం-అంతర్జాతీయం



## కొత్తూరు ఫలితంపై హైకోర్టులో డీఎంకే సవాల్

- కోర్టుకెక్కిన మాజీ సీఎం స్టాలిన్
- తమిళనాడులో కీలక పరిణామం
- టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు ఎన్నిక చెల్లదంటూ పిటిషన్
- రీకౌంటింగ్ చేపట్టాలని విజ్ఞప్తి



**చెన్నై, ఆగస్టు 24 (ఎ.ఎం.ఎస్):** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొళత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనపై విజయం సాధించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అభ్యర్థి వీఎస్ బాబు ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఎంకే స్టాలిన్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే కొళత్తూర్ నియోజకవర్గంలో ఓట్లను మరోసారి లెక్కించాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎంలు), వీవీపాట్ ప్రక్రియకు సంబంధించి పలు అవకతవకలు జరిగాయని స్టాలిన్ తన పిటిషన్‌లో ఆరోపించినట్లు తెలుస్తోంది. ఓట్ల లెక్కింపు సమయంలో కూడా లోపాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ రీకౌంటింగ్‌కు ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును కోరారు.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఎంకే స్టాలిన్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు.. ఎంకే స్టాలిన్‌పై 8,795 ఓట్ల మెజార్టీతో ఘన విజయంసాధించారు. దీంతో కొళత్తూర్ నుంచి వరుసగా నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలవాలన్న స్టాలిన్ ప్రయత్నానికి బ్రేక్ పడింది.

కొళత్తూర్ నియోజకవర్గం స్టాలిన్‌కు రాజకీయంగా ఎంతో కీలకమైన ప్రాంతంగా ఉంది. గతంలో ఆయన ఇక్కడి నుంచి వరుసగా 3 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే తాజా ఎన్నికల్లో వీఎస్ బాబు చేతిలో ఓటమి పాలు కావడం తమిళనాడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 1996 తర్వాత స్టాలిన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఎన్నికల ఫలితాల తర్వాత వీఎస్ బాబు తన విజయానికి టీవీకే అధినేత విజయ్‌తో పాటు కొళత్తూర్ ప్రజలతో తనకున్న స్థానిక అనుబంధమే కారణమని పేర్కొన్నారు. తమిళనాడులో మార్పు కోరుకున్న ప్రజలు తమకు అవకాశం ఇచ్చారని తెలిపారు. తాను కొళత్తూర్ ప్రాంతంలోనే పుట్టి పెరిగానని.. స్థానిక ప్రజల సమస్యలు, వారి అభిప్రాయాలు తనకు తెలుసని వెల్లడించారు. కొళత్తూరు ప్రజలతో స్టాలిన్ మరింతగా మమేకం కావాల్సిన అవసరం ఉందని కూడా బాబు వ్యాఖ్యానించారు.

మరోవైపు..ఎన్నికల ఫలితాల తర్వాత ఎంకే స్టాలిన్ తన ఓటమిని అంగీకరిస్తూనే డీఎంకే కూటమికి భారీగా ఓట్లు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. అయితే ఇప్పుడు కొళత్తూర్ ఫలితంపై న్యాయపోరాటానికి దిగడంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది. అయితే ఎంకే స్టాలిన్ పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు ఎలా స్పందిస్తుంది.. రీకౌంటింగ్‌కు ఆదేశిస్తుందా.. వీఎస్ బాబు ఎన్నిక కొనసాగుతుందా.. అనే అంశాలపై తమిళనాడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## పీపీపీలో చైనాదే అగ్రస్థానం

- నాలుగు దశాబ్దాల్లో అంచనాలకు అందని ఎదుగుదల
- నామినల్ జీడీపీలో యూఎస్ ముందంజ
- ఆర్థిక రంగంలో బీజింగ్ దూకుడు
- అమెరికాతో ఆర్థిక అంతరాన్ని వేగంగా తగ్గించిన చైనా
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇరు దేశాల హోరాహోరీ



**బీజింగ్, ఆగస్టు 24(ఎ.ఎం.ఎస్):** ఒకప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థతో పోల్చినప్పుడు దూరంగా నిలిచిన చైనా..ఇప్పుడు అదే దేశానికి ప్రధాన ఆర్థిక ప్రత్యర్థిగా మారింది. నామినల్ జీడీపీలో అమెరికా ఇంకా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నప్పటికీ.. ప్రజల కొనుగోలు శక్తిని పరిగణనలోకి తీసుకునే పీపీపీ కొలమానంలో చైనా ఇప్పటికే అమెరికాను అధిగమించింది. గత నాలుగు దశాబ్దాల్లో అంచనాలకు అందని ఎదుగుదలను నమోదు చేసింది. అగ్రరాజ్యంగా ప్రచారం చేసుకుంటున్న అమెరికాకు ముచ్చెమటలు పట్టిస్తోంది. చైనా సాధించిన ఈ ఆర్థిక ప్రస్థానం ప్రపంచ ఆర్థిక శక్తి సమీకరణాలు మారుతున్నాయనే సంకేతాన్ని ఇస్తోందని విశ్లేషకులు, నిపుణులు చెప్తున్నారు. వాషింగ్టన్, బీజింగ్ : ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ఆధిపత్యానికి చైనా క్రమంగా సవాల్ విసురుతోంది. 2026 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన రెండు శక్తులుగా అమెరికా, చైనా నిలిచాయి. ప్రపంచ జీడీపీలో ఈ రెండు దేశాల వాటా కలిపి నామినల్ లెక్కల్లో 42.15 శాతంగా, పీపీపీ ప్రాతిపదికన 34.42 శాతంగా ఉంది. అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాదాపు సగం వరకు ప్రభావం చూపగల స్థాయి లో ఈ రెండు దేశాలు ఉన్నాయి. అయితే ఈ పోటీలో చైనా ఎదుగుదలే ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ఆసక్తికరమైన పరిణామంగా మారింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) 2026 అంచనాల ప్రకారం... నామినల్ జీడీపీలో అమెరికా 32.384 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. ఇందులో చైనా జీడీపీ 20.851 ట్రిలియన్ డాలర్లుగా అంచనా. ఈ లెక్కన అమెరికా ఆర్థిక వ్యవస్థ చైనా కంటే సుమారు 1.55 రెట్లు పెద్దది. రెండు దేశాల మధ్య సుమారు 11.532 ట్రిలియన్ డాలర్ల తేడా ఉంది. కానీ దేశీయ ధరలు, ప్రజల కొనుగోలు శక్తిని పరిగణనలోకి తీసుకునే పర్చేజింగ్ పవర్ ప్యారిటీ (పీపీపీ) లెక్కల్లో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. పీపీపీ ఆధారంగా చైనా జీడీపీ 44.295 ట్రిలియన్ డాలర్లుగా అంచనా. అమెరికా జీడీపీ 32.384 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. అంటే పీపీపీ పరంగా చైనా

... అమెరికా కంటే సుమారు 1.37 రెట్లు పెద్దది. ఇది చైనా ఆర్థిక వ్యవస్థలోని భారీ దేశీయ ఉత్పత్తి, వినియోగ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. చైనా ఎదుగుదల ఎంత వేగంగా సాగిందో అమెరికాతో జీడీపీ పోలికే చెప్తుంది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం...1960లో చైనా జీడీపీ.. అమెరికా జీడీపీలో కేవలం 11 శాతం మాత్రమే. 1987లో ఈ నిష్పత్తి మరింత తగ్గి 5.6 శాతానికి చేరింది. అయితే ఆ తర్వాత చైనా ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరించింది. 2026 నాటికి చైనా జీడీపీ అమెరికా జీడీపీలో 64 శాతానికి చేరింది. అంటే ఒకప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే చాలా చిన్నదిగా ఉన్న చైనా.. కొన్ని దశాబ్దాల్లోనే ప్రపంచంలో రెండో అతిపెద్ద నామినల్ ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది.

ఇదే చైనా ఆర్థిక పరివర్తన ఎంత భారీగా జరిగిందో సూచించే ముఖ్యమైన గణాంకమని విశ్లేషకులు వివరిస్తున్నారు. ఆర్థిక వృద్ధి రేట్లను పరిశీలించినా చైనా దూకుడు స్పష్టమవుతుంది. 1961 నుంచి 2024 మధ్య చైనా 22 ఏండ్లలో 10 శాతానికి పైగా జీడీపీ వృద్ధిని నమోదు చేసింది. చైనా అత్యధిక వృద్ధి రేటు 1970లో 19.30 శాతం. అమెరికా అత్యధిక వృద్ధి రేటు మాత్రం 1984లో 7.24 శాతమే. అంటే చైనా అభివృద్ధి దశలో సాధించిన వృద్ధి వేగం అమెరికా నమోదు చేసిన అత్యధిక వార్షిక వృద్ధి రేటుతో పోల్చి నా చాలా ఎక్కువ. చైనా మొత్తం ఆర్థిక పరిమా ణంలో అమెరికాకు చేరువవుతున్నప్పటికీ... ప్రజల సగటు ఆదాయాన్ని కొలిచే తలసరి జీడీపీలో మాత్రం అమెరికా ముందుంది. అయితే చైనా జనాభా అమెరికా కంటే నాలుగు రెట్లకు పైగా ఉండటం ఇందుకు ప్రధాన కారణంగా ఆర్థిక విశ్లేషకులు చెప్తున్నారు. దశాబ్దాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంటే అమెరికా ఆధిపత్యమే అన్న భావన బలంగా ఉంది. డాలర్ ఆధిపత్యం, భారీ వినియోగ మార్కెట్, ప్రపంచ ఆర్థిక సంస్థలపై ప్రభావం, సాంకేతిక రంగంలో ఆధిపత్యం అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టాయి. కానీ చైనా ఎదుగుదల ఆ సమీక రణాన్ని మార్చుతోందని గణాంకాలే చెప్తున్నాయి. పీపీపీ లెక్కల్లో ఇప్పటికే అమెరికాను అధిగ మించడం, నామినల్ జీడీపీలో అంతరాన్ని తగ్గిం చడం, గత దశాబ్దాల్లో అధిక వృద్ధి రేట్లు నమోదు చేయడం ద్వారా చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని గణనీయంగా పెంచుకుంది.

చైనా ఎదుగుదలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ఆధిపత్యం క్రమంగా సవాల్‌కు గురవుతోందన్న వాదనకు బలం చేకూరుతోంది. చైనా.. పీపీపీలో ముందుండటం, అమెరికాతో జీడీపీ అంతరాన్ని తగ్గించడం, భారీ దేశీయ మార్కెట్‌ను కలిగి ఉండటం వంటి అంశాలు భవిష్యత్తులో బీజింగ్ అగ్ర ఆర్థిక వ్యవస్థ కుర్చీని సొంతం చేసు కోగలదన్న విశ్వాసాన్ని ఆర్థిక విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి 21వ శతాబ్దపు ఆర్థిక పోటీని కేవలం "అమెరికా వర్సెస్ చైనా"గా కాకుండా.. "పాత ఆర్థిక ఆధిపత్యం (అమెరికా), వేగంగా ఎదు గుతున్న కొత్త ఆర్థిక శక్తి (చైనా) మధ్య పోటీ"గా చూడాల్సిన అవసరం ఉందని చెప్తున్నారు.

## మరో ఆందోళనకు సీజేపీ పిలుపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (ఎ.ఎం.ఎస్) :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మరో ఆందోళనకు పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇండియా గేట్ నుండి ఢిల్లీలోని నూతన పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిరసన ర్యాలీ కొనసాగనుంది. జూలై 20న నీట్ పేపర్ లీకేజ్ ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పార్లమెంట్ మార్చ్ నిర్వహించారని, యువత ఆందోళనల నేపథ్యంలో మోడీ ప్రభుత్వం పలు హామీలు ఇచ్చిందని, కానీ నేడు వాటిని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీజేపీ ఆరోపించింది. కేంద్రం తీరుకు నిరసనగా తాము దేశవ్యాప్త నిరసనలకు పూనుకున్నామని సీజేపీ ఆరోపించింది.

దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌ల జాబితాను అందిస్తే, వాటిని రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామని కోర్టు పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదని తెలిపింది. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి లిఖితపూర్వక హామీ అందలేదని వివరించింది. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు శాంతియుతంగా, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది.

## పోటాపోటీ ఆందోళనలు

- కర్నాటకలో అధికార, ప్రతిపక్ష పార్టీల ధర్నాలు



**బెంగళూరు, ఆగస్టు 24 (ఎ.ఎం.ఎస్) :** కర్నాటకలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటా పోటీగా ధర్నాలు చేపట్టాయి. మంత్రి బి. నాగేంద్ర రాజీనామా చేయాలంటూ బీజేపీ శ్రేణులు బెంగళూరులోని విధాన సౌధ ఎదుట నిరసన చేపట్టారు. ఈక్రమంలో వారికి పోటీగా అధికార పక్షం కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఇరు పక్షాల నేతలు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. ఈ నిరసన సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు కర్ణాటకకు చెందిన ప్రముఖ బీజేపీ మరియు జేడీ(ఎస్) నాయకుల ముఖచిత్రాలు కలిగిన మాస్కులను ధరించారు.

"బీజేపీ అవినీతితోనూ, అవినీతిపరులైన నాయకులతోనూ నిండిపోయింది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చూస్తే, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు ముఖ్యమంత్రులు కనిపిస్తారు. అయినప్పటికీ వారికి పదవులు దక్కుతున్నాయి, వారు రాష్ట్రాలను పాలిస్తూనే ఉన్నారు. కాబట్టి, వారిని ప్రశ్నించాల్సింది పోయి, కర్ణాటకలోని బీజేపీ ఎమ్మెల్యేలు మా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. నాగేంద్ర అప్పటికే రాజీనామా చేశారు." కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.



## వేగంగా వ్యాపిస్తున్న కార్చిచ్చు

- 20 చదరపు మైళ్లకు విస్తరణ

**వాషింగ్టన్, ఆగస్టు 24 (ఎ.ఎం.ఎస్) :** అమెరికాలోని నెవాడా రాష్ట్రం రెనో నగరంలో కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. పీవైన్ పీక్ ప్రాంతంలో ప్రారంభమైన మంటలు దాదాపు 20 చదరపు మైళ్లకు విస్తరించడంతో సుమారు 90 వేల మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 60 వేల నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వేలాది అగ్నిమాపక సిబ్బంది, నేషనల్ గార్డ్స్ మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. ఈ కార్చిచ్చు మానవ తప్పిదం వల్లే సంభవించిందని అధికారులు నిర్ధరించి దర్యాప్తు చేపట్టారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో గవర్నర్ జో లొంబార్డో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

## అమెరికా వీసా ఫీజుల పెంపు

- విద్యార్థులు, ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం



**న్యూయార్క్, ఆగస్టు 24 (ఎ.ఎం.ఎస్) :** అమెరికా వీసా ఫీజులను భారీగా పెంచే ప్రతిపాదన భారతీయ విద్యార్థులు, ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. హెచ్1బీ వర్క్ వీసాలతో పాటు ఎఫ్1 ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) ప్రోగ్రామ్‌పై కొత్త ఫీజులు విధించే ప్రతిపాదనను ఈ నెలలో ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్‌కు సమర్పించినట్లు న్యూయార్క్‌కు చెందిన న్యాయ సంస్థ ఫ్రాగోమాన్ తెలిపింది. కొత్త ఫీజు లక్ష డాలర్ల వరకు ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి. అంటే భారత కరెన్సీలో సుమారు రూ.83 లక్షలు. గతంలో ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ పిటిషన్లపై లక్ష డాలర్ల అదనపు ఫీజు విధించేందుకు ప్రయత్నించింది. అయితే ఈ నిర్ణయంపై న్యాయపరమైన సవాళ్లు ఎదురవడంతో దాని అమలుపై అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇప్పుడు అదే తరహా భారాన్ని కొత్త పన్ను రూపంలో విధించే ప్రయత్నం జరుగుతున్నట్లు న్యాయ నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుతం హెచ్1బీకి సాధారణ పిటిషన్ ఫీజుతో పాటు శిక్షణ, మోసాల నివారణ వంటి వివిధ రుసుములు ఉంటాయి. వీటిలో ఎక్కువ భాగాన్ని ఉద్యోగం కల్పించే కంపెనీలే భరిస్తాయి. అయితే ఎఫ్1 వీసాపై అమెరికాలో చదువుకున్న తర్వాత ఓపీటీ ద్వారా పని అనుమతి పొందే విద్యార్థులు కొన్ని రుసుములను వ్యక్తిగతంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఓపీటీకి సంబంధించిన ఫీజులు సుమారు రూ.39 వేల నుంచి రూ.43,200 వరకు ఉండేవి.

అమెరికాలో హెచ్1బీ వీసాలు పొందుతున్న వారిలో భారతీయుల వాటా 71 శాతంగా ఉంది. హెచ్1బీకి సంబంధించిన భారీ రుసుములను కంపెనీలు భరించే అవకాశం ఉన్నప్పటికీ, ఓపీటీ ఫీజుల్లో భారీ పెరుగుదల నేరుగా విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపనుంది.

దీంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థులకు ఈ ప్రతిపాదన పెద్ద ఆందోళనగా మారింది.

## ఇరాన్‌లో వెలుగులోకి భారీ గ్యాస్ క్షేత్రం

**టెహ్రాన్, ఆగస్టు 24(ఎ.ఎం.ఎస్) :** అమెరికా, ఇజ్రాయెల్‌లతో జరిగిన యుద్ధం వల్ల ఇరాన్ ఇంధన రంగం తీవ్రంగా దెబ్బతిన్న కొన్ని నెలల తర్వాత, ఆ దేశం 7.5 ట్రిలియన్ ఘనపుటడుగులకు పైగా సహజ వాయువు నిల్వలను కనుగొంది.

ఇరాన్‌లోని దక్షిణ ఫార్స్ ప్రావిన్స్‌లో కొత్తగా కనుగొన్న ఈ వాయువులో 5.7 ఘనపుటడుగులు

వెలికితీయదగినదేనని చమురుశాఖ మంత్రి మొహసెన్ పక్నెజాద్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం సౌత్ పార్స్‌లో 15 సంవత్సరాల ఉత్పత్తికి ఇది సమానమన్నారు.



## ఢిల్లీలో వర్షాలు



- విమాన సర్వీసులకు ఆటంకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** వర్షాల కారణంగా ఢిల్లీలో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఢిల్లీ విమానాశ్రయంలో దిగాల్సిన 15 విమానాలను అధికారులు అత్యవసరంగా ఇతర నగరాలకు దారి మళ్లించారు. జైపూర్ 12, చండీగఢ్ రెండు, లక్నో ఒక విమానాన్ని దారి మళ్లిచంగా.. ట్రాఫిక్ నియంత్రణ, ప్రతికూల వాతావరణం వల్ల విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌లలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ మేరకు ఢిల్లీ పరిసర ప్రాంతాలకు వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ప్రయాణికులు తమ విమాన సమయాల గురించి సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించి బయలుదేరాలని అధికారులు సూచించారు.

## ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

- నవజాత శిశువులు సజీవదహనం

**ముంబయి, ఆగస్టు 24 (ఎ.ఎం.ఎస్) :** మహారాష్ట్రలో అమరావతిలోని జిల్లా మహిళా ఆసుపత్రిలో నవజాత శిశువుల అత్యవసర చికిత్సా విభాగంలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ వెంటిలేటర్‌లో పేలుడు సంభవించడంతో ముగ్గురు నవజాత శిశువులు సజీవదహనం కాగా, మరో ఆరుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంది. ఆ సమయంలో వార్డులో 39 మంది నవజాత శిశువులు ఉన్నారు. పొగ, మంటలు వ్యాపించడంతో సిబ్బంది వెంటనే స్పందించి ఆ వార్డులోని శిశువులను సురక్షిత ప్రాంతానికి తరలించారు.





# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

## వసతి గృహాల్లో సకల సదుపాయాలు!

**బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి – జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తుందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ గోకుల్ నగర్ లోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల సంఖ్య గురించి ఆరాతీశారు, వారు ఎక్కడెక్కడి నుండి వచ్చారు ,అలాగే వసతి గృహం లో ఉన్న సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు అనంతరం సీసీ కెమెరాల పనితీరును, వంటకు ఉపయోగించే పప్పు దినుసులు, బియ్యం, గుడ్ల నాణ్యత ను పరిశీలించి వాటి సరఫరా గురించిన వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలకి వెళ్లి భోజన తయారీ తీరు గురించి తెలుసుకొని.... విద్యార్థులతో మాట్లాడుతూ... ఈరోజు ఎం టిఫిన్ పెట్టారు...రుచికరంగా ఉందా అని కలెక్టర్ అడిగారు. కిచెన్ షెడ్ మరమ్మత్తు పనుల పురోగతి ని తెలుసుకొని పలు సూచనలను కలెక్టర్ తెలుపుతూ.... వాటర్ పోవడానికి డ్రైనేజి వ్యవస్థ బాగుండాలని...నీరు ఎక్కడ ఆగకుండా ఉండేలా చూడాలన్నారు. వర్షపు నీటి సంరక్షణకు కావాల్సిన చర్యలను చేపట్టాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించి.... వసతి గృహంలో పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని,వసతి గృహ నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని వార్డెన్ కి తెలియజేశారు.

అలాగే విద్యార్థులు కూడా బాగా చదువుకోవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా... సమయాన్ని వృధా చేయకుండా...ఒక లక్ష్యం పెట్టుకొని అందుకు తగ్గట్టు గా కష్టపడాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇన్చార్జి బీసీ సంక్షేమ అధికారి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు

### పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి

## ఎస్పీ అభినందనలు



**జయశంకర్ భూపాలపల్లి వుదయం జిల్లా ప్రతినిధి):**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన కార్యవర్గం పోలీసు అధికారులు,సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో ఐక్యత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ సమర్థవంతంగా పని చేయాలని సూచించారు.పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అసోసియేషన్ చేపట్టే కార్యక్రమాలకు జిల్లా పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గం అధ్యక్షుడు గుగులోతు నరేష్, ఏఎస్ఐ కానిస్టేబుల్, భూపాలపల్లి, ఉపాధ్యక్షులు, ఎస్. వెంకటేశ్వర్లు,ఇన్స్పెక్టర్, మహదేవపూర్, ఎస్. సాంబమూర్తి, ఎస్ఐ, మహదేవపూర్, కార్యదర్శి, బి. అశోక్, ఎస్ఐ, ములుగు, జాయింట్ సెక్రటరీ, ఎ. రమేష్, పీసీ, మహముత్తారం, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎ. సతీష్, పీసీ, ఘనపూర్, కోశాధికారి, ఓ. చిన్నన్న, కానిస్టేబుల్, పీసీఆర్,భూపాలపల్లి, కార్యవర్గ సభ్యులు, బి. సతీష్, భూపాలపల్లి పోలీస్ స్టేషన్, డి. శ్రావణ్, పీసీ, పలిమెల పోలీస్ స్టేషన్, పి. విజయ్, పీసీ, మొగుళ్లపల్లి, ఎం. అంబిక, పీసీ, మహముత్తారం పోలీస్ స్టేషన్,ఎం. యాదిరెడ్డి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, భూపాలపల్లి, క్రాంతి, ఏఆర్ పీసీ, భూపాలపల్లి,పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి

**– జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు. ములుగు, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**



ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ,ఎం.సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్లకు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**నోటీసులు జారీ చేసే సమయంలోనే అవసరమైన పత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలి**

**ఎస్ఐఆర్ పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

**ఖమ్మం వుదయం బ్యూరో ఆగస్టు-24**



అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లను కలిపి సుమారు 1.75 లక్షల నోటీసులు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్ చేసినట్లు వివరించారు. అనామలీస్ కేటగిరీ కింద 80 వేల మంది ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన పత్రాలను విచారణకు పిలిచేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. నోటీసులు జారీ చేసే సమయంలోనే సంబంధిత ఓటర్లు విచారణకు హాజరయ్యే సమయంలో సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఎస్ఐఆర్ ప్రక్రియపై మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. వీడియో సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, డీటీ అన్సారీ, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులు నష్టపోతున్నారని కలెక్టర్కు వినతిపత్రం

**నల్గొండ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉద్దంకి రవీందర్**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి ఆగస్టు 24**



నల్గొండ పట్టణ కేంద్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా గ్రీవెన్స్ లో కలెక్టర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు జరిగిన తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 97 ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఉద్దంకి రవీందర్ జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు పాలిటెక్నిక్ బిటెక్ సంబంధించిన విద్యార్థులకు శక్తి అనే పేరుతో జీవో 97 ను తీసుకువచ్చి పాలిటెక్నిక్ డిప్లమా పూర్తయిన విద్యార్థులకు Eecet ద్వారా బీటెక్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరానికి ప్రవేశానికి విద్యార్థులకు ఇప్పుడు ఉన్న అవకాశాలు ఉన్నాయి కేవలం శిక్షణ నైపుణ్యతకి అవకాశం ఇస్తే సాంకేతిక విద్యను దెబ్బతీసే అవకాశాలు ఉన్నాయి ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాపాక శ్రీనివాస్ సురేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## శ్రీ కొత్తకొండ వీరభద్రస్వామి సేవలో మంత్రి పొన్నం ప్రభాకర్

**నెల రోజుల పాటు అన్నదాన వితరణ మంత్రి**

**భీమదేవరపల్లి, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్ర స్వామి (భద్రకాళి సమేత) దేవాలయం లో వీరభద్ర స్వామి వారి దీక్షోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. గత 2004 నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం, భక్తులు 27 రోజుల పాటు "వీరన్న మాల" ధరించి స్వామివారిని నిష్టతో సేవిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడితే వీరభద్ర స్వామి మాల ధరిస్తానని ఎన్నికలకు ముందు మొక్కుకున్న రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన మొక్కును చెల్లించుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి మంత్రి బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయన స్వయంగా వీరన్న మాల ధరించి 27 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.పాలనాపరమైన బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ భగవంతునిపై ఉన్న అపారమైన నమ్మకంతో మంత్రి ఈ దీక్షలో పాల్గొన్నారు. అంతేకాకుండా, గత మూడేళ్లుగా తన సొంత నిధులతో స్వాములకు, భక్తులకు నెల రోజుల పాటు నిరంతర అన్నదానం, ఉదయం అల్పాహారం, పాల వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భక్తులందరికీ ఆయురారోగ్యాలు, సంతాన ప్రాప్తి, సకల దోష నివారణ కలగాలని మరియు రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

## జిల్లా కలెక్టర్ చొరవతో బాధితుడికి తక్షణ ఊరట!

**ప్రజావాణి'లో వినతి ఇచ్చిన అరగంటలోనే చిన్నారి పేరు ఆరోగ్యశ్రీలో నమోదు**

**జనగామ, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**



ప్రజా సమస్యల త్వరిత పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అభయాన్నిచ్చింది. జనగామ జిల్లా కేంద్రంలోని బాణాపురం కాలనీకి చెందిన రోజువారీ కూలి మహమ్మద్ రఫత్ తన ఒక సంవత్సరం కుమార్తె మహమ్మద్ అల్ఫియనూర్ తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతుండటంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించాలని వైద్యులు సూచించారు.

ఆపరేషన్‌కు రూ. 60 వేల నుండి రూ. 70 వేల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఆరోగ్యశ్రీ కార్డులో చిన్నారి పేరు నమోదు కాకపోవడంతో ఉచిత వైద్యం అందక ఇబ్బంది పడ్డారు. మీ సేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, చివరికి సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను ప్రజావాణిలో కలిసి తమ బాధను విన్నవించుకున్నారు. బాధితుడి అర్జీపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సంబంధిత అధికారులను తక్షణమే ఆదేశించి కేవలం అరగంట వ్యవధిలోనే చిన్నారి పేరును ఆరోగ్యశ్రీ కార్డులో నమోదు చేయించారు. దీంతో పాపకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్స పొందే మార్గం సుగమమైంది. తమ నిరుపేద కుటుంబ సమస్యను అరగంటలోనే పరిష్కరించి ఆదుకున్న జిల్లా కలెక్టర్‌కు బాధితుడు మహమ్మద్ రఫత్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఘటనతో సామాన్య ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం పై మరింత నమ్మకం పెరిగిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ఈ నెల 25 నుండి సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నాటిన ప్రతి మొక్క బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలి**

**సూర్యాపేట, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**




ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవంలో భాగంగా ఈ నెల 25 నుండి సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వనమహోత్సవంపై జిల్లా కలెక్టర్లు, అటవీ, దేవాదాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ... జిల్లాలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వార్డులు, గ్రామాల వారీగా నాటేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ఒక్కో మండలంలో 10 వేల మొక్కలకు తక్కువ కాకుండా నాటించాలని, అన్ని మండలాల్లో 150 మందికి తక్కువ కాకుండా లేబర్ మొబలైజేషన్ చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలలు, ఇనిస్టిట్యూషన్స్, అటవీ ప్రాంతంలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం అత్యంత ముఖ్యమని, నాటిన ప్రతి మొక్క బతికేలా అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు.

అంతకుముందు మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొక్కలు నాటేందుకు ఉన్న అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, మున్సిపల్ చైర్మన్లను భాగస్వాములను చేయాలని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి టీజీ ఫారెస్ట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా మొక్కలు నాటాలని, ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించాలని, దేవాలయాల్లో ప్రత్యేకమైన మొక్కలు నాటాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి దామోదరరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## గిరిజనుల హక్కులను కాపాడుతూ.. అటవీని సంరక్షించాలి

**అంబాసత్రం భూమిని గుర్తించి 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టతకు చర్యలు**

**అటవీ–రెవెన్యూ భూ సమస్యలకు సమగ్ర సర్వేతో శాశ్వత పరిష్కారం: ఎన్‌సీఎస్‌టీ సభ్యుడు జాటోత్ హుస్సేన్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి)**



అటవీ-రెవెన్యూ భూ సమస్యలను సమగ్ర సర్వే ద్వారా పరిష్కరించడంతో పాటు గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ అటవీ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ అధికారులను ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కూనారం గ్రామంలో అటవీ-రెవెన్యూ భూములకు సంబంధించిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి భూ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గిరిజనులు, స్థానిక ప్రజలు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా భూ సమస్యలపై తుది నిర్ణయానికి రావడం సరికాదన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులు, వాదనల్లో తేడాలు ఉన్నందున గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని సూచించారు. పాత సర్వేకు, తాజా జాయింట్ సర్వేకు మధ్య తేడాలు ఎందుకు వచ్చాయో స్పష్టంగా తేల్చాలని ఆదేశించారు.

అంబాసత్రం భూమిపై 15 రోజుల్లో స్పష్టత అంబాసత్రం భూమికి సంబంధించిన అంశంపైనా సమగ్ర పరిశీలన చేయాలని జాటోత్ హుస్సేన్ సూచించారు. గతంలో సుమారు 250 ఎకరాలకు పైగా అంబాసత్రం భూమి ఉన్నట్లు అధికారులు పేర్కొన్న నేపథ్యంలో ప్రస్తుతం ఆ భూమి రికార్డుల్లో స్పష్టంగా కనిపించకపోవడానికి గల కారణాలను గుర్తించాలన్నారు. అంబాసత్రం భూమి ఎక్కడ ఉందో నిర్ధారించడంతో పాటు ఓవర్‌ల్యాప్ అయిన ప్రాంతాలను మరోసారి సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. సమగ్రంగా పరిశీలించి తుది నివేదిక జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. కూనారం గ్రామ భూ సమస్యపై గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. జాయింట్ సర్వేకు ముందు, అనంతరం నిర్వహించిన సర్వే వివరాలతో పాటు రెవెన్యూ, అటవీ శాఖల వద్ద ఉన్న రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ.. కూనారం గ్రామంలోని భూ సమస్య గత ఐదారు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. ఈ పబ్లిక్ హియరింగ్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ శిరీష, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులు, సర్వేయర్లు, గ్రామస్థులు, గిరిజనులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక వనమహోత్సవాన్ని జయప్రదం చేయండి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 25న నిర్వహించనున్న 'ప్రత్యేక వనమహోత్సవం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు.సోమవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ నివాసం నుంచి జూమ్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎఫ్ఓలతో సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. పచ్చదనం పెంపునకు మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ అరణ్యభవన్ నుంచి అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం నిర్దేశించిన శాఖల వారీ లక్ష్యాలను పకడ్బందీ ప్రణాళికతో పూర్తి చేసి, రేపటి (ఆగస్టు 25) వనమహోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) లావణ్య, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పురుషోత్తం, DRDO ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**యాదాద్రి భువనగిరి జిల్లా. ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**

గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పైళ్ల గణపతి రెడ్డి జిల్లా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దాసరి పాండులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు ఈ రోజున సిఐటియు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేయడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా గ్రామాలలో వాటర్ మెన్స్ పారిశుద్ధ్య కార్మికులుగా బిల్లు కలెక్టర్గా ఎలక్ట్రిషన్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడంలేదని అధికారంలోకి వస్తే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన నేటికీ ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్స్ గ్రామపంచాయతీ సిబ్బందిని రెండో పి ఆర్ సి లో గుర్తించాలని గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని జీవో 51ని సవరణ చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు పర్మినెంట్ చేయాలని కారోబార్ బిల్ కలెక్టర్ సహాయ కార్యదర్శులుగా నియమించాలని కనీస వేతనం చెల్లించాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పొట్ట యాదమ్మ నకర కంటి రాము వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షం జ్ఞానేశ్వర్ నాయకులు కిష్టయ్య పరమేష్ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

## దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**

**భూపాలపల్లి: ఆగస్టు 24(వుదయం విలేకరి)**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 27 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు స్పందిస్తూ, వినతులను పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

### కమిషనర్ టి.వెంకన్న



**వరంగల్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**

ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని, పౌరుల నుంచి 72 దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం గత వారం వచ్చిన అర్జీల పరిష్కార స్థితిగతులపై విభాగాల వారీగా సమీక్ష జరిపారు. పన్నుల వసూలు లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

విభాగాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు wటౌన్ ప్లానింగ్: 30, ఇంజినీరింగ్: 15,, రెవెన్యూ: 14, నీటి సరఫరా: 07, హెల్త్ అండ్ శానిటేషన్: 05, హార్టికల్చర్: 01, (మొత్తం దరఖాస్తులు: 72)నగరంలో అందుబాటులోకి వచ్చిన 150 కేఎల్‌డీ సామర్థ్యంగల మల వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను వినియోగించుకోవాలని, బల్దియా అనుమతి పొందిన 29 సెప్టిక్ ట్యాంకర్ వాహనాల ద్వారా శుభ్రత ప్రక్రియను చేపట్టాలని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబరు చివరి నాటికి పూర్తి చేయాలి

**-- జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కల నాట్లు**

**-- మంత్రి కొండా సురేఖ**

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :**





వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబరు చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వన మహోత్సవ కార్యక్రమాలపై సమీక్షించారు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు, రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు.మంగళవారం అన్ని జిల్లాల్లో భారీగా సామూహిక మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు, ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని ఆదేశించారు,ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు, మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేయాలని, వాటి మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వెంటనే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని సూచించారు.అటవీ ప్రాంతాల్లో ఖాళీ భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి వసతి కల్పించాలని, వన మహోత్సవంపై విస్తృత ప్రచారం నిర్వహించి మీడియాను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు, జిల్లాలో వన మహోత్సవం కింద మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు 8,65,200 మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 6,89,212 మొక్కలు నాటి 79.66 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు, అటవీ శాఖతోపాటు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలను పెద్దఎత్తున భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం...

**ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**




**జగిత్యాల ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల రూరల్ మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సోమవారం పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యంతో గత వారం నుండి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమాదేవి తహసీల్దార్ హకీమ్ సంబంధిత అధికారులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

**ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్**



**పెద్దపల్లి, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి)**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏ.ఫాతిమా తాము 30 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నామని తమకు డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గేటు గ్రామానికి చెందిన ధర్మపురి శిరీష తాను ఏఎన్ఎం పూర్తి చేశానని తనకు కాంట్రాక్ట్ లేదా అవుట్సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారది కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన బర్ల బాపు సర్వేనెంబర్ 119 సర్వే నెంబరు లోగల రెండు ఎకరాల 25 గుంటల వ్యవసాయ భూమికి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా ముత్తారం తహసిల్దార్ కు రాస్తూ విచారణ చేసి రిపోర్ట్ సమర్పించవలసిందిగా అదనపు కలెక్టర్ సూచించారు.పెద్దపెల్లి మండలం బందారి కుంట గ్రామానికి చెందిన నేరెళ్ల లత వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నూతన అర్హత మేరకు నూతన పెన్షన్ మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ బి.ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

**ఆదిలాబాద్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**



వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున సామూహిక మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. సోమవారం అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వన మహోత్సవంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటేందుకు అనుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకుని నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు నాటిన మొక్కలు, మిగిలిన లక్ష్యం, నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం నిర్వహించే మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు.ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని స్పష్టం చేశారు. ప్రతి మొక్కకు రక్షణగా కంచె ఏర్పాటు చేయడంతో పాటు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదిలాబాద్ కలెక్టరేట్ వీడియో హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ మంగళవారం చేపట్టనున్న భారీ మొక్కల నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మిగిలిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, ఇచ్చోడ అటవీ అభివృద్ధి అధికారులు విశ్వనాథ్ బుసారెడ్డి, ప్రథమేష్, డీఆర్‌డీఓ రవీందర్, అదనపు డీఆర్‌డీఓ రామ్‌ప్రసాద్, ఏపీడీ గజానంద్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి :కలెక్టర్

**కరీంనగర్ ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**



ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామి, ఇతర ఉన్నత అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 193 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా నగరపాలికకు 58, గృహ నిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం క్యాంపు కార్యాలయం, సీఎస్ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎప్పటికప్పుడు లాగిన్ లో పరిష్కరించిన దరఖాస్తులను అప్డేట్ చేయాలన్నారు. మేజర్ ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారులను సంప్రదించి దరఖాస్తులను పరిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# ఆస్తి, ఇన్సూరెన్స్ కోసం కోడలి వేధింపులు

**వృద్ధురాలికి ప్రాణభయం**


**మృతుడి తల్లిపై భౌతిక దాడులు, బెదిరింపులు**

**రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు బాధితురాలి వినతి**

**ధర్మపురి, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**





ఆస్తి, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సొంత కోడలే తన కుటుంబ స భ్యులతో కలిసి వేధింపులకు గురిచేస్తోందని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని ధర్మపురికి చెందిన వృద్ధురాలు దహ గం.దత్తప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుల నుంచి తనకు, తన భర్తకు తక్షణమే పోలీస్ రక్షణ కల్పించాలని కోరుతూ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద జగిత్యాల ఆర్డీవోకు సోమవారం వేర్వేరుగా లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. బాధితురాలి వివరాల ప్రకారం దత్తప్రియ చిన్న కుమారుడు స్వర్గీయ దహగం గిరీష్ 2025 మే 18న గుండెపోటుతో మరణించారు. అప్పటి నుంచి కోడలు కామోజ్జల మానస, ఆమె తండ్రి కామోజ్జల. సత్యనారాయణ రావు, తల్లి కా మోజ్జల. వాగ్దేవి వీణవంక మండలం చల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కలిసి ఆమెపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. గిరీష్‌కు చెందిన బోయింగ్ కంపెనీ జీటీఎల్ ఇన్సూరె న్స్‌లో నిబంధనల ప్రకారం తల్లిగా తనకు రావాల్సిన 33 శాతం వాటాను వదులుకోవాలని, ఎన్‌వోసీ పై సంతకం చేయాలని నిరంతరం బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. సంతకం పెట్టకపోతే ప్రాణాలు తీస్తామని హెచ్చ రిస్తున్నారని పేర్కొన్నారు. భౌతిక దాడికి యత్నం చేసారని, కిరాణా సరుకుల్లో అనుమానాస్పద పదార్థాలు తీసుకువచ్చారని తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో సదరు వ్యక్తులు తన ఇంటికి వచ్చి బూతులు తిడుతూ రెండుసార్లు భౌతిక దాడికి యత్నించారని దత్తప్రియ వాపోయారు. ప్రాణభయంతో తాను పెద్ద కుమారుడు గణేష్ ఇంటికి వెళ్లి ఆశ్రయం పొందాల్సి వచ్చిందన్నారు. తాను ఇంటి నుంచి వెళ్లిన తర్వాత ఇంట్లోని కిరాణా సరుకుల్లో గుర్తుతెలియని పొడి, నూనె లాంటి పదార్థాలు కనిపించాయని, తనను అంతమొందించేందుకు ఏమైనా కుట్ర చేశారా అనే బలమైన అనుమానం కలుగుతోందని తెలిపారు. తనకు అండగా నిలుస్తున్న పెద్ద కుమారుడు గణేష్, ఆయన భార్యపై కూడా తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తూ ఒంటరిని చేసేందుకు 1యత్నిస్తున్నారని, తన సంతకాలను ఫోర్జరీ చేశారేమోనన్న అనుమానం ఉందని ఫిర్యాదులో వెల్లడించారు. నాకు ఎవరిపైనా పగలేదు, న్యాయ బద్ధంగా రావాల్సిన హక్కులనే కోరు తున్నాను. నా ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున అధికారులు వెంటనే స్పందించి నిష్పక్షపాత విచారణ జరపాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకముందే మా దంపతులకు రక్షణ కల్పించాలని దహగం దత్తప్రియ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి – కలెక్టర్



**మంచిర్యాల /ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమం నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలి

**రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**




**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), ఆగస్టు 24:**

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుంచి పి.సి.సి.ఎఫ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2026-27 సీజన్‌లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలకు కేటాయించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. బృహత్ పల్లె వనాల అభివృద్ధిలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ అధికారి బాలమణితో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన 47 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణల్లో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వన మహోత్సవ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

**మంగళవారం మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టాలి:**

**రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**నిర్మల్ జిల్లా 24 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**




వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సోమవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటివరకు నాటిన మొక్కలు, ఇంకా నాటాల్సిన మొక్కలు, నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రస్తుతం అనుకూలమైన వర్షాలు కురుస్తున్నందున, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని (మంగళవారం) అన్ని జిల్లాల్లో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించి, వన మహోత్సవం లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.మాస్ ప్లాంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, ఇతర అనువైన ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్కకు రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు, తప్పనిసరిగా జియో ట్యాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం చేపట్టనున్న వన మహోత్సవం మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన వన మహోత్సవం లక్ష్యంలో మిగిలిన మొక్కల నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసి పూర్తి చేయాలని తెలిపారు.అటవీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కల సంరక్షణకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, జియో ట్యాగింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్‌డీఓ విజయలక్ష్మి , ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా పాఠశాలను కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలి

**టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు**

**కామారెడ్డి, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**



కామారెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లా కేంద్రంలో బస్టాండ్, రైల్వే స్టేషన్ కి దగ్గరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు ఉన్నాయని, ఆ భూములలో విద్యాసంస్థల ఏర్పాటు చేసి అభివృద్ధి పరచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సాంకేతికపరమైన విద్యాసంస్థలు లేక ఇప్పటికే కామారెడ్డి వెనుకబడిపోయిందని ఏటీసీ సెంటర్ ను కూడా భిక్కనూరులో కాకుండా కామారెడ్డిలో ఏర్పాటు చేస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరు విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఈ విషయాన్ని గమనించి జిల్లా కేంద్రంలోనే విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.భిక్కనూరు మండలంలో ఫార్మా కంపెనీల వలన ఎన్నో ఇబ్బందులను చాలా గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్నారని, రాబోయే రోజుల్లో తాగే నీరు, పీల్చే గాలి, భూములు కాలుష్యం అయిపోయి ప్రజలు గ్రామాలను విడిచి పెట్టే పరిస్థితులు రానున్నాయని వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో అన్ని రకాల సదుపాయాలు ఉన్న డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేసినట్లయితే కామారెడ్డి జిల్లా కేంద్రం అభివృద్ధితో పాటుగా విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి పర్యటనలో ఎడ్యుకేషన్ ఏర్పాటు చేస్తానని డిగ్రీ కళాశాల భూములలో విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తానని మోసం చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా ఈ భూములలో విద్యాసంస్థల ఏర్పాటు చేయాలని కోరారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## నిబంధనల మేరకే లే అవుట్లకు అనుమతులు జారీ

**నారాయణపేట ఆగస్టు24 (వుదయం ప్రతినిధి)**



ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కమిటీ పరిశీలనకు వచ్చిన జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన 6 లే అవుట్ దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారుల క్లియరెన్స్ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కమిటీ పరిశీలన అనంతరం 3 లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయగా, మరో 3 లే అవుట్ల దరఖాస్తులను తిరస్కరించింది.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ**

లే అవుట్ అనుమతుల జారీ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రక్రియను సులభతరం చేయడం, సమయాన్ని తగ్గించడం, అనవసరమైన భౌతిక సమావేశాలను నివారించడమేనని కలెక్టర్ తెలిపారు. ఆన్‌లైన్‌లో పరిశీలన పూర్తయిన తర్వాత కూడా ప్రతి దరఖాస్తుకు మళ్లీ భౌతిక సమావేశం నిర్వహిస్తే ప్రక్రియ రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ వెరిఫికేషన్ సమయంలో ఏదైనా అధికారి లేదా కమిటీ సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తే, ఆ అభ్యంతరాన్ని సిస్టమ్‌లోనే నమోదు చేసే విధానం ఉండాలని సూచించారు. అభ్యంతరం నమోదైన సందర్భంలో సంబంధిత ఫైల్‌ను తదుపరి స్థాయికి ఆటోమేటిక్‌గా పంపించేలా ప్రక్రియను రూపొందించవచ్చని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఆమోదించిన దరఖాస్తులకు మళ్లీ ప్రత్యేకంగా భౌతిక సమావేశం నిర్వహించాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లోనే తదుపరి ప్రక్రియకు ఫైల్‌ను పంపించే విధానం అమలు చేస్తే సమయం, శ్రమ రెండూ ఆదా అవుతాయని స్పష్టం చేశారు.ఏదైనా అంశంపై అభ్యంతరం ఉన్న దరఖాస్తులను మాత్రమే భౌతిక సమావేశానికి తీసుకువచ్చి చర్చించి నిర్ణయం తీసుకునే విధానం మరింత సమర్థవంతంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై ప్రతి లే అవుట్‌లోనూ రహదారుల ఇరువైపులా మొక్కలు నాటే నిబంధనను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు, లే అవుట్లలో పచ్చదనం పెంపొందించేందుకు ఈ నిబంధనను తప్పని సరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ అశోక్, నీటిపారుదల శాఖ ఈఈ సాల్మన్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్య, డీటీసీపీఓ కిరణ్, కోస్గి, మక్తల్, మద్దూరు టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ నిశ్చితార్థంలో డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్ నగర్ ఆగస్టు24 (వుదయం ప్రతినిధి)**

మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తమ మేనల్లుడు కలెక్టర్ అక్షయ్ దీపక్ సిపి సజినార్ కుమార్తె అదితి నిశ్చితార్థ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిశ్చితార్థ వేడుకలో పాల్గొని నూతన జంటను ఆత్మీయంగా ఆశీర్వదించారు. వారి జీవితంలో ఈ కొత్త అధ్యాయం ఆనందం, ప్రేమ, పరస్పర అవగాహనతో నిండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ ఆత్మీయ కార్యక్రమంలో సంజీవ్ ముదిరాజ్ సతీమణి డాక్టర్ అనుపమ కుటుంబ సభ్యులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు అందజేశారు.



## ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారంలో జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఎస్పీ తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి ఉద్దేశమని ఎస్పీ పేర్కొన్నారు.

## స్లాబ్‌ల కప్పివేత.. నిధుల గండి!

- అడుగున కుళ్ళిన మురుగు.. పైన శ్లాబ్‌ల కంటితుడుపు!
- పాలకుల కాసుల కక్కుర్తికి గద్వాల 10వ వార్డు బలి: ధరూర్‌మెట్టులో ప్రజాక్షేమం శూన్యం

**గద్వాల ఆగస్టు 24 (వుదయం కరస్పాండెంట్)**



అది మురుగు కాలువా? లేక రోగాలు పంచే విషపూరిత నిలయమా? పాలకుల నిర్లక్ష్యం, పురపాలక అధికారుల అవినీతి దాహానికి గద్వాల పట్టణంలోని 10వ వార్డు ధరూర్‌మెట్టు వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఏళ్లుగా కాలువ అడుగున గడ్డకట్టుకుపోయిన టన్నుల కొద్దీ పూడికను, మురుగును తీసి పారేయడం చేతకాక.. పైపైన రెండు స్లాబ్‌లు కప్పేసి "పనులు పూర్తయ్యాయి" అని బిల్లులు బొక్కేసే కుట్రకు తెగబడ్డారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాధనం బొక్కేసి.. ప్రజల జీవితాలతో చెలగాటమా? గత మున్సిపల్ ఎన్నికల ముందు ఎమ్మెల్యే చేతుల మీదుగా అర్భాటంగా భూమిపూజలు గుప్పించారు. కానీ తీరా చూస్తే కాలువను జేసీబీలతో తవ్వి ప్రవాహాన్ని పునరుద్ధరించాల్సిన యంత్రాంగం.. కంటితుడుపుగా పైభాగంలో మూతలు పెట్టి చేతులు దులుపుకుంది. అడుగున మురుగు కదలకుండా అలాగే కుళ్ళిపో తుంటే, పైన స్లాబ్‌లు వేస్తే సమస్య తీరుతుందా? ఇది ప్రజలను మభ్యపెట్టడం కాకపోతే మరేమిటి? 'రూపాయి పని చేసి.. రూ. లక్షల రికార్డులు' రాసుకునే కాసుల కక్కుర్తి తప్ప పౌరుల ఆరోగ్యం పాలకులకు పట్టడం లేదు. ఇళ్ల మధ్యే విష వలయం.. వర్షం వస్తే మురుగు సమరం! కాలువలో నీరు పారక నిల్వ ఉండిపోవడంతో ధరూర్‌మెట్టు వీధి దుర్గంధంతో ఊపిరాడని స్థితికి చేరింది. దోమలు స్వైరవిహారం చేస్తూ విషజ్వరాలను వ్యాపింపజేస్తున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు అంటురోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. రేపో మాపో వర్షాలు పడితే ఈ నరకకూపంలోని మలమూత్రాలు, వర్షపు నీరు కలిసి రోడ్లెక్కి ఇళ్లలోకి చేరడం ఖాయం. అప్పుడు సంభవించే విపత్తుకు బాధ్యులెవరు?కలెక్టర్ గారూ.. కళ్లముందున్న 'కుంభకోణం 'పై చారిత్రాత్మక చర్యలేవి? పత్రాల్లో లెక్కలు చూపి పబ్బం గడుపుకుం టున్న అధికారుల మాటలు నమ్మకుండా, జిల్లా కలెక్టర్ స్వయంగా ధరూర్‌మెట్టులో అడుగుపె ట్టాలి! వెంటనే జేసీబీ యంత్రాల ను దింపి డ్రైనేజీ అడుగుభాగంలోని పూడికను పూర్తిగా తవ్వి బయటకు తీయాలి. నీటి ప్రవాహానికి శాశ్వత మార్గాన్ని సుగమం చేయాలి. పైపూత పనులతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై, కాంట్రాక్టర్లపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. ధరూర్‌మెట్టు ప్రజల ఆక్రోశాన్ని పట్టించుకో కపోతే పురపాలక సంఘం ముట్టడికి స్థానికులు సిద్ధమవుతున్నారు!

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే రైతులకు శాపం

- యూరియా యాప్ ను తొలగించాలన్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి..

**మెదక్ జిల్లా వుదయం**



నిజాంపేట మండలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై చిన్నచూపు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించారు.ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలోనే మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియా యాప్ పేరిట దొంగ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు.యూరియా ఫాస్పేట్ ల పేర్ల మీద యాప్ తీసుకువచ్చి చిన్న ఫోన్లలో బుక్ కావని స్మార్ట్ ఫోన్లలో బుక్ అవుతావని అధికారులే చెప్పడం దారుణమన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా యూరియాను అందించి రైతులకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను నట్టేట ముంచేలా పన్నాగం కట్టారని అది రైతులు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేలా చేయడం ఖాయమన్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు సరిపడే యూరియాను అందించాలని లేనిపక్షంలో బిఆర్ఎస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ బాపురెడ్డి, బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బజార్ రంజిత్ గౌడ్, మాజీ ఎంపీపీ బిజ్జ సంపత్, మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్, గౌస్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,నాయిని లక్ష్మణ్, శివకుమార్, వెంకటస్వామి గౌడ్, హనుమంత్ రెడ్డి, దుబ్బరాజా గౌడ్,పున్న వెంకటస్వామి, బండారి తిరుమల్, మాజీ సర్పంచ్ బాలనరసవ్వ, తిరుపతిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్సీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

- పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్‌కు సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ వినతి

**వుదయం, సిద్దిపేట**



తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో పెండింగ్‌లో ఉన్న మరమ్మతులు, పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టి, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ కోరారు.ఈ మేరకు సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తిమ్మాపూర్‌తో పాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవల కోసం ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. అయితే పీహెచ్సీలో పలు మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడం, మరమ్మతులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు పీహెచ్సీలో కాంపౌండ్ వాల్ నిర్మాణం లేదా మరమ్మతులు, గేట్ల ఏర్పాటు, బోర్ డ్రిల్లింగ్ చేసి సింగిల్ ఫేజ్ మోటార్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మీటింగ్ హాల్ సీలింగ్ లీకేజీలను అరికట్టడంతో పాటు ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీహెచ్సీ ఆవరణలో పచ్చదనం, గ్రీనరీ అభివృద్ధి, కిచెన్ రూమ్ తలుపు మరమ్మతులు, సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు వంటి పనులను కూడా చేపట్టాలని కోరారు.స్థల పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలి పీహెచ్సీని సంబంధిత అధికారులతో స్థల పరిశీలన చేయించి, అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని సర్పంచ్ కోరారు. అనంతరం వీలైనంత త్వరగా తగిన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.తిమ్మాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన, సురక్షితమైన వైద్య సేవలు అందించేందుకు పీహెచ్సీలో మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో అవసరమని గుర్రాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినతిని సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోలీస్ ప్రజావాణికి 2 ఫిర్యాదులు



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి రెండు ఫిర్యాదులు స్వీకరించారు. భూ వివాదానికి సంబంధించి ఒకటి, న్యాయం కోరుతూ మరొకటి ఉన్నాయి. ఫిర్యాదులను పరిశీలించి చట్టప్రకారం తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మధ్యవర్తులు, పైరవీలు లేకుండా నేరుగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, వారి సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరిస్తామని, ప్రజలకు పోలీసులు మరింత దగ్గరయ్యేలా శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## టైలరింగ్ శిక్షణతో స్వయం ఉపాధికి బాట!

- 30 రోజుల శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసిన డీఆర్డీఓ శ్రీనివాస్

**వికారాబాద్ ఆగస్టు 24 ( వుదయం బ్యూరో )**



ఆర్కతల గ్రామంలో నిర్వహించిన 30 రోజుల టైలరింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన శిక్షణార్థులకు సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) శ్రీనివాస్ శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. టైలరింగ్‌లో పొందిన శిక్షణను ఆచరణలో పెట్టి ఆర్థికంగా ఎదగాలని, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.నైపుణ్య శిక్షణతో ఆత్మవిశ్వాసం.. స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, యువతకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ (EGMM) జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బిల్లపాటి సుధాకర్, ట్రైనర్ మల్లయ్య, జూనియర్ రిసోర్స్ పర్సన్స్ నరసింహులు, వెంకటయ్య పాల్గొన్నారు.

## ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ/వార్డు సభలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**సిద్దిపేట, ఆగస్టు 24 (వుదయం బ్యూరో)**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ మరియు వార్డులలో సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సభల్లో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్ల సమక్షంలో ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్ (ఏఎస్‌డీ) జాబితాలను చదివి వినిపించాలని తెలిపారు. సభల సమయంలో ఫారం6, 7, 8లను అందుబాటులో ఉంచుకోవాలని, అభ్యంతరాలు ఉంటే నోట్ చేసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని లేదా అనామోలీస్ ఉన్న ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట అదనపు ఏఈఆర్ఓల ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి నోటీసుల ప్రక్రియ దాదాపు పూర్తయిందని, కార్యాచరణ ప్రకారం గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఎన్నికల విభాగాధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట టౌన్ ఆగస్టు24 (వుదయం ప్రతినిధి)**



ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు

- వార్డు సభలు పకడ్బందీగా నిర్వహిస్తాం: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి):**



ఈనెల 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర CEO మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని, BLOలు, BLAలు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ నోటీసుల జనరేషన్ త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

BLOల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, సభల వద్ద ఫారం 6, 7, 8 సిద్ధంగా ఉంచాలని, డ్రాఫ్ట్ జాబితాలోని పేర్లను చదివి వినిపించాలని సూచించారు. అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు ఫారం6తో నమోదు చేసుకోవాలని, తప్పులకు ఫారం 8, అభ్యంతరాలకు ఫారం7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నోటీసు జారీకి, విచారణకు మధ్య 7 రోజుల వ్యవధి ఉండాలని, వివరాలను BLO యాప్ లో ఫోటోతో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, ఆర్డీఓలు, ఎంఆర్ఓలు పాల్గొన్నారు.

## కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభం.. 4,235 ఎకరాలకు సాగునీరు

**వనపర్తి ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి)**



ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలే కాకుండా, అదనంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు : రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

87.53 కోట్ల నిధులతో నిర్మించిన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను మంత్రి జూపల్లి తో కలిసి ఇవాళ ప్రారంభించారు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 4,235 ఎకరాలకు సాగునీరు అందించనున్న ప్రాజెక్ట్ ఈ ప్రాజెక్ట్‌కు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ పేరు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డియువత మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి : రాష్ట్ర అబ్కారి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావురాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలనే కాకుండా, ఇంకా అదనంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సహచర అబ్కారి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సోమవారం మోటార్లను ఆన్ చేసి ప్రారంభించారు.రూ.87.53 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో మొత్తం 4,235 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఈరోజు కర్నె తాండ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొంటూ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి జిల్లాలో 3384 ఎకరాలకు, నాగర్ కర్నూల్ జిల్లాలో 851 ఎకరాలు కలిపి మొత్తం 4,235 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గిరిజనుల ఆకాంక్ష మేరకు ప్రాజెక్టు పేరును గిరిజనుల ఇష్టదైవం అయిన శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఇదే కాకుండా పాలమూరు ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు.

**యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి--- మంత్రి జూపల్లి**

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. సంవత్సరానికి రూ.60 వేల కోట్ల రూపాయలు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తుందన్నారు.

**నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి**

మాట్లాడుతూ.. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలకు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాలకు సాగునీరు అందనుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం రూ.87.53 కోట్లు ఖర్చు చేశామని, 245 ఎకరాల భూసేకరణ కూడా చేపట్టామని వివరించారు.

గత పాలకులు అనేక ప్రాజెక్టులను పూర్తి చేశామని ప్రజలను మభ్యపెట్టారని, అయితే వాస్తవంగా పెండింగ్‌లో ఉన్న పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. మిగిలిన బ్యాలెన్స్ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కర్నె తండా పరిధిలోని తండాలకు సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు.ఈ ప్రాంతంలో మొబైల్ టవర్ ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు.పెండింగ్ పనులు పూర్తి చేసి ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తెచ్చాం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కోసం రూ.87 కోట్లతో జీఓ తీసుకు వచ్చినప్పటికీ, సుమారు రూ.47 కోట్లు ఖర్చు చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని, మిగిలిన 40 కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చు చేసి పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పెండింగ్‌లో ఉన్న పనులను సుమారు రూ.29 కోట్లు ఇప్పటివరకు ఖర్చు చేయడం జరిగిందని మిగిలిన 11 కోట్లు భూసేకరణ, ఇతరత్రా పెండింగ్ పనులకు ఖర్చు చేసి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.2,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత: నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో మార్కండేయ ప్రాజెక్ట్‌తో పాటు కర్నె తండా వంటి సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి పూర్తి చేసుకున్నామని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తి చేయడంపై దృష్టి సారించిందన్నారు. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంత్ సేవాలాల్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా పేరు పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని, ఇందుకు సంబంధించిన చర్యలు చేపడతామని తెలిపారు.కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో పాటు వ్యవసాయాభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ప్రాజెక్ట్ ద్వారా నీరు అందనున్న తండాల పరిధిలోని ఆయకట్టు భూములు సాగులోకి రావడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.అనంతరం వనపర్తి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ తో కలిసి సర్జ్ పూల్ వద్ద ప్రారంభమైన నీటి ప్రవాహానికి పూజలు చేసి పూలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## చిన్నంబావి లో రెండవ ప్రజావాణికి 68 దరఖాస్తులు

**చిన్నంబావి మండలం 24 ( వుదయం రిపోర్టర్ )**



చిన్నంబావి మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటుచేసిన రెండవ ప్రజావాణికి వివిధ గ్రామాల నుంచి ఫిర్యాదులు విశేషంగా వస్తున్నాయి. ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 దరఖాస్తులు ప్రజల నుంచి వినతులు వచ్చాయి. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రామస్వామి, ఏపీవో ధనుంజయ రాజుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

**ధర్మపురిలో స్మార్ట్ రేషన్ కార్డు లు అందజేసిన మంత్రి అడ్లూరి**

ధర్మపురి,ఆగస్ట్24(వుదయం ప్రతినిధి): పేద,మధ్యతరగతి వర్గాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబా నికి సంక్షేమ పథకాలు చేరవేయ డమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచే స్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. స్థానిక పౌరసరఫ రాల శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి పట్టణం లోని 8 రేషన్ దుకాణాల పరిధి లో మొత్తం 5,407 నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదా రులకు అందజేస్తున్నట్లు వెల్ల డించారు. అర్హత ఉన్న ఏ ఒక్క రూ ప్రభుత్వ పథకాలకు దూరం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా నిత్యా వసర సరుకులు సులభంగా పొందవచ్చని, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల అమలుకు ఇవి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి అత్యంతప్రాధాన్యమిస్తున్నామని,పథకాల అమలులో అధికా రులు సమన్వయంతో పనిచేసి అర్హులకు న్యాయం చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి,మం త్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ సంఘనబట్ల. దినేష్,కౌన్సిలర్లు, కోఆప్షన్స్,మున్సిపల్ సిబ్బంది,రెవెన్యూ సిబ్బంది,పౌరసర ఫరాల శాఖ అధికారులు,కాంగ్రెస్ నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డ వివాహానికి కందుల దంపతుల చేయూత

**దివ్య వివాహానికి పుస్తెమట్టెలు, మంచాలు, పరుపులు అందజేత**



మంథని, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి): రామగుండం ప్రాంతానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కల్లెడ దివ్య వివాహానికి మారేడుపాకకు చెందిన కందుల స్వప్న--లింగయ్య దంపతులు అండగా నిలిచారు. దివ్య వివాహానికి అవసరమైన పుస్తెమట్టెలు, మంచాలు, పరుపులతో పాటు ఇతర సామగ్రిని సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

దివ్య కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు దాతల సహకారంతో ఈ నెల 26న దివ్య వివాహాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కందుల స్వప్న--లింగయ్య దంపతులు తమ పిల్లలు అభిలాష్, శ్రీహర్షల సహకారంతో వివాహ సామగ్రిని అందించారు.

ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన దివ్య వివాహానికి తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు సమాజంలోని దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక నిర్వాహకులు మద్దెల దినేష్, గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ ఈ నెల 26న జరిగే దివ్య వివాహానికి మానవతా దృక్పథం కలిగిన దాతలు తమకు తోచిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద ఆడపిల్లల వివాహాలు కుటుంబాలకు ఆర్థిక భారంగా మారకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలువురికి వివాహాలు నిర్వహించినట్లు తెలిపారు.

దివ్య వివాహానికి స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, దాతలు వివిధ రూపాల్లో సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కంది సుజాత, రవళి, ఎం.ఏ. గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యంతో మిలాద్ ఉల్ నబీ వేడుకలు నిర్వహించాలి

**-- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి.**



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) : మిలాద్ ఉల్ నబీ వండుగను పురస్కరించుకుని సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయంలో సోమవారం పట్టణ పరిధిలోని మతపెద్దలతో డీఎస్పీ నాగేంద్రచారి శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. మతసామరస్యం, సోదరభావం ఉట్టిపడేలా వేడుకలు జరుపుకోవాలని, ప్రజల్లో సమన్వయం పెంపొందించేందుకు ఆయా మతాల పెద్దలు కృషి చేయాలని కోరారు,పండుగ ఏ మతానికి చెందినదైనా సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడం ద్వారా సమాజంలో స్నేహపూర్వక సంబంధాలు బలపడతాయని తెలిపారు. మిలాద్ ఉల్ నబీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలు జరిగేలా మతపెద్దలు సహకరించాలని సూచించారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, మతపెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నాం

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వం**
**200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాల అమలు**
**భూ భారతి ద్వారా ధరణి వల్ల ఏర్పడిన భూ సమస్యలకు పరిష్కారం**
**మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూ రీ-సర్వే**
**ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా తహసీల్దార్ కార్యాలయాలు పనిచేయాలి**
**మంథని గంగాపురి వద్ద రూ.2.55 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం**



కమాన్ పూర్‌లో రూ.75 లక్షలతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయం పెద్దపల్లి (మంథని, కమాన్ పూర్)ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) :ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం మంథని మండలం గంగాపురి వద్ద రూ.2.55 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను, కమాన్ పూర్ మండలంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి లిమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మంథని ప్రాంతంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు గంగాపురి వద్ద ఏర్పాటు చేసిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా పరిసర ప్రాంతాలకు నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. రైతులు, గృహ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్యుత్, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మంజూరైన నిధులను సకాలంలో వినియోగిస్తూ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం భూ భారతి ద్వారా చర్యలు చేపడుతోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గతంలో ధరణి వ్యవస్థలో ఏర్పడిన అనేక సమస్యల కారణంగా రైతులు, భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి, ప్రజలకు పారదర్శకంగా భూ సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భూ రీ-సర్వే కార్యక్రమాన్ని దశలవారీగా చేపడుతున్నామని, మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రికార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా అధికారులు సమగ్రంగా పనిచేయాలని సూచించారు. రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందుతాయని మంత్రి మరియు కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంధాలయ శాఖ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఆర్డీఓ సురేష్, తహసిల్దార్ వాసంతి, సంబంధిత ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్లలో లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీ

**పేద, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**



మంథని ఆగస్టు 24 వుదయం ప్రతినిధి పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం తాడిచర్ల గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రామంలోని నాలుగు రేషన్ డీలర్ల పరిధిలోని లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను సర్పంచ్ బండి స్వామి పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు సన్నబియ్యం, నిత్యావసర సరుకులు తదితర సంక్షేమ ప్రయోజనాలను మరింత సులభంగా అందించడమే స్మార్ట్ కార్డుల ఉద్దేశమని ఈ సందర్భంగా తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి, రెవెన్యూ శాఖకు చెందిన జీపీఓ నరేష్, రేషన్ డీలర్లు రేపాల ధనంజయులు, ఓలాల కవిత, తమ్మిశెట్టి వెంకటరమణ, బూడిద సురేష్, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం**



మంథని ఆగస్టు 24 వుదయం ప్రతినిధి విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంథని పట్టణంలోని గంగాపురి వద్ద ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై కిచెన్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, పోషక విలువలు కలిగిన అల్పాహారం అందించేందుకు సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌లు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష ప్రభుత్వ అధికారులు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రెసిడెంట్ శ్రీ సత్య గౌరచంద్రదాస ప్రభుజి, సీఈఓ శ్రీ కౌన్తేయదాస ప్రభుజి పాల్గొన్నారు

# తెలంగాణ రైజింగ్ ఓర్వలేకే సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అడ్డంకులు

**కేంద్రం తీరుపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం**




మంథని ఆగస్టు 24( వుదయం ప్రతినిధి) : తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడులు, విద్య, సాంకేతిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం సరికాదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు, విద్యాసంస్థలను తీసుకురావాలన్న ఉద్దేశంతో సీఎం చేపడుతున్న విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం విచారకరమని పేర్కొన్నారు. శనివారం మంథనిలో మీడియాతో మాట్లాడిన మంత్రి శ్రీధర్‌బాబు.. హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమెరికా, బ్రిటన్‌లలోని ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల క్యాంపస్‌లను హైదరాబాద్‌కు తీసుకువచ్చి రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్తున్నారని, దీనివల్ల వారి తల్లిదండ్రులపై లక్షలాది రూపాయల ఆర్థిక భారం పడుతోందని మంత్రి వివరించారు. అంతర్జాతీయ స్థాయి విద్యను రాష్ట్రంలోనే అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ భారాన్ని తగ్గించడంతోపాటు తెలంగాణ యువతకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్యంతోనే సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, బ్రిటన్ పర్యటనకు సిద్ధమయ్యారని, అయితే కేంద్ర ప్రభుత్వం అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం దురదృష్టకరమని శ్రీధర్‌బాబు అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా పర్యటనకు అవకాశం కల్పించి, తెలంగాణ ముఖ్యమంత్రికి ఎందుకు అనుమతి నిరాకరించారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా కేంద్రం పునరాలోచించి త్వరలోనే సీఎం అమెరికా పర్యటనకు అనుమతి ఇస్తుందని ఆశిస్తున్నానని తెలిపారు. పార్టీ వ్యవహారాలపై క్రమశిక్షణ సంఘం నిర్ణయం రాష్ట్ర కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు, నాయకుల మధ్య జరుగుతున్న ఆరోపణలపై పార్టీ క్రమశిక్షణ సంఘం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వంలో ఉన్న పెద్దలందరూ సమన్వయంతో వ్యవహరిస్తూ నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు.

అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనా విధానాన్ని ప్రజల్లో మరింతగా విస్తరించడంతోపాటు, అదే స్ఫూర్తితో పనిచేసే 100 మంది నాయకులను తయారు చేయడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, అభివృద్ధి లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

# గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజా ఫిర్యాదులను పరిశీలన...

**జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్**
**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం...**



జగిత్యాల ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా తేది 24 8 2026 జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 17 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు

# సీఎంఆర్ బియ్యం మళ్లింపు.. ఇద్దరు అరెస్టు

**- రూ.7.55 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం.**
**- మరో ముగ్గురు నిందితులు పరారీలో.**



వేములవాడ, ఆగస్టు 24 (వుదయం ప్రతినిధి) : ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్) కింద అప్పగించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించిన కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు, మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు వేములవాడ డిఎస్పి ఏ.శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఖరీఫ్ 2021-22 నుంచి ఖరీఫ్ 2024-25 వరకు వివిధ సీజన్లకు సంబంధించి 8,447.138 మెట్రిక్ టన్నుల వడ్లను వేములవాడ మండలం కొనాయిపల్లిలోని ఎంఎస్ అంజనేయ ట్రేడర్స్, సీ/ఓ కన్యకా పరమేశ్వరి రైస్‌మిల్‌కు కస్టమ్ మిల్లింగ్ ఒప్పందంపై అప్పగించారు, ఈ మిల్లుకు చేపూరి అంజయ్య, ఆచం సంతోష్, దొంతుల గణేష్, చేపూరి మధుకర్, లోపెల్లి వెంకటేశ్వర్‌రావు భాగస్వాములు, ఏజెంట్లుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 5,659.582 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ, సీడబ్ల్యూసీకి అప్పగించాల్సి ఉంది అయితే నిందితులు 3,167.605 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే తొలుత అందజేశారు. దీంతో 2,491.977 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం డిఫాల్ట్ అయ్యింది నిబంధనల ప్రకారం 25 శాతం పెనాల్టీతో కలిపి 3,114.972 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేయాల్సి ఉండగా, అదనంగా 879.131 మెట్రిక్ టన్నులు మాత్రమే డెలివరీ చేసినట్లు పోలీసులు తెలిపారు, ఇంకా 2,235.841 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని పెనాల్టీతో సహా ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని పేర్కొన్నారు, ఈ ధాన్యాన్ని నిందితులు పక్కదారి పట్టించి, ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు, దీని విలువ సుమారు రూ.7,55,71,688 ఉంటుందని తెలిపారు.

తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ జి.గోపాల్ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది, వేములవాడ డిఎస్పి ఏ.శ్రీనివాసులు దర్యాప్తు చేపట్టారు ఈ కేసులో నిందితులైన ఎ1 చేపూరి అంజయ్య, ఎ5 లోపెల్లి వెంకటేశ్వర్‌రావులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు, కేసులోని మరో ముగ్గురు నిందితులు ఆచం సంతోష్, దొంతుల గణేష్, చేపూరి మధుకర్ పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు తెలిపారు.

# చక్కని ఆరోగ్యం

## లంచ్ తర్వాత నిద్రొస్తోందా..?

మధ్యాహ్నం భోజనం చేశాక.. కొంతమంది నిద్రొచ్చినట్లుగా, మగతగా ఫీలవుతుంటారు. మరి, ఇంట్లో ఉంటే కాసేపు కునుకు తీయచ్చు.. కానీ ఆఫీసులో ఉండేవారికి ఇది కుదరదు.. ఇలా మగతగా ఉన్నప్పుడు చేసే పనిపై ఏకాగ్రత పెట్టలేం.. అలాగని కాసేపు రిలాక్సవుదామంటే కుదరకపోవచ్చు. అందుకే ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే కొన్ని అంశాలు దృష్టిలో ఉంచుకోవాలంటున్నారు నిపుణులు.

తిన్న వెంటనే శరీరం రిలాక్సవుతుంది.. దాంతో నిద్రొచ్చినట్లుగా అనిపిస్తుంది. కాబట్టి తిన్న వెంటనే సీట్లో వాలిపోకుండా.. ఓ పది నిమిషాల పాటు నడక మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల శరీరంలో ఆక్సిజన్ స్థాయులు పెరిగి.. అవయవాలకు రక్తప్రసరణ మెరుగవుతుందట. తద్వారా శరీరం తిరిగి శక్తిని కూడగట్టుకుంటుందట.

చూయింగ్ గమ్ నమిలితే నిద్ర మత్తు వదిలిపోతుందని ఓ అధ్యయనం చెబుతోంది. అయితే అది కూడా ఐదు నుంచి పది నిమిషాలు చాలట!

శరీరం డీహైడ్రేషన్‌కి గురైనా అలసిపోయినట్లుగా అనిపిస్తుంది. కాబట్టి రోజూ సరైన మోతాదులో నీళ్లు తాగడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అలాగే మధ్యాహ్నం భోజనం తర్వాత కూడా కొంత విరామం ఇచ్చి నీళ్లు, ఇతర పానీయాలు తీసుకోవడం వల్ల శరీరం పునరుత్తేజితమవుతుందట.

మధ్యాహ్న భోజనం కడుపు నిండుగా తినాలనుకుంటారు చాలామంది! ఆ సమయంలో నిద్ర రావడానికి, మగతగా అనిపించడానికి ఇదీ ఓ కారణమేనట. అతిగా తినడం వల్ల కడుపు ఉబ్బరంగా, అసౌకర్యంగా అనిపిస్తుంది.. శరీరం విశ్రాంతిని కోరుకుంటుంది. కాబట్టి ఒకేసారి ఎక్కువ మొత్తంలో తినకుండా, తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినేలా ప్లాన్ చేసుకోవాలంటున్నారు నిపుణులు.



రాత్రుళ్లు కనీసం ఏడెనిమిది గంటల సుఖ నిద్ర ఉన్న వారిలో ఈ మగత ఫీలింగ్ ఉండదట. కాబట్టి రాత్రిళ్లు సుఖంగా నిద్రపోయేలా అలవాటు చేసుకోవాలి. కాఫీ, టీలు ఎక్కువగా తాగడం వల్ల రాత్రుళ్లు సరిగా నిద్ర పట్టక, పగటి పూట మగతగా ఉండే అవకాశం ఉంటుందంటున్నారు. అందుకే రోజుకు ఒకటి లేదా రెండు కప్పులకు మించి వీటిని తీసుకోకపోవడమే ఆరోగ్యకరమని చెబుతున్నారు. అయితే ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. లంచ్ తర్వాత మగతగా, అలసటగా అనిపిస్తే మాత్రం.. రక్తహీనత, హార్మోన్ల అసమతుల్యత, ఇన్సులిన్ సెన్సిటివిటీ.. వంటి సమస్యలు కూడా కారణం కావచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వెంటనే డాక్టర్‌ని సంప్రదించి సమస్యేంటో నిర్ధరించుకొని.. వారి సలహా మేరకు తగిన చికిత్స తీసుకోవడం మేలంటున్నారు.

## ప్లమ్‌తో హృద్రోగాలు దూరం!

ఎరుపు, నీలం ఛాయల్లో నిగనిగలాడుతూ నోరూరిస్తాయి ఆలూబుఖారా పండ్లు. వీటినే ప్లమ్ అనీ అంటారు. రుచిలో తియ్యగా పుల్లగా ఉండే వీటిల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అవేంటో తెలుసా?



ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. ఫలితంగా గుండె జబ్బులతో పాటు క్యాన్సర్ ముప్పు తక్కువేనట. వీటిల్లో ఉండే సార్బిటాల్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. జీర్ణవ్యవస్థను సక్రమంగా పనిచేసేలా చేస్తుంది.

ప్లమ్ పండులోని ఐరన్... రక్తప్రసరణ వ్యవస్థలోని లోపాలను నివారిస్తుంది. ఫైబర్ శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయులను నియంత్రించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

వీటిల్లోని విటమిన్ కె, బోరాన్, పాలీఫెనాల్స్... మెనోపాజ్ తర్వాత మహిళల్లో ఎముకల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి రక్తపోటు, కొలెస్ట్రాల్‌ని నియంత్రిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ప్లమ్ పండ్లలో ఆంథోసైనిన్లు రొమ్ముక్యాన్సర్ కణాల పెరుగుదలను ఆపడంలో సాయపడతాయి.

ఆలూబుఖారా పండ్లలోని విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు ముందస్తు వృద్ధాప్య లక్షణాలను నివారిస్తాయి. చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడతాయి. వ్యాధినిరోధకశక్తిని పెంపొందిస్తాయి.

## 'లూపస్' గురించి తెలుసా..?



ఎంత విశ్రాంతి తీసుకున్నా అలసటగానే ఉండటం, ఇన్ఫెక్షన్లు లేకపోయినా... తరచూ జ్వరం రావడం, ఉన్నట్టుండి బరువు తగ్గిపోవడం; ముక్కు బుగ్గలపై సీతాకోకచిలుక ఆకారంలో దద్దుర్లు, ఎండలోకి వెళ్లగానే చర్మం ఎర్రబడటం, దద్దుర్లు రావడం, జుట్టు విపరీతంగా ఊడిపోవడం, ఉదయం నిద్రలేచాక చేతులు, మణికట్టు, మోకాళ్ల కీళ్లు బిగుసుకుపోవడం. నొప్పిరావడం వంటివన్నీ లూపస్ లక్షణాలే. ఇటీవల విడుదలైన అధ్యయనం ప్రకారం ఈమధ్య కాలంలో పదిలో తొమ్మిది మంది మహిళలు లూపస్ వ్యాధి బారిన పడుతున్నారట. వీళ్లలో చాలామందికి లక్షణాలు కనిపించినా... వయసుతోపాటు వచ్చే సమస్యలే అని పట్టించుకోవడం లేదట. ఇదో ఆటో ఇమ్యూన్ వ్యాధి. అవగాహనా లోపమే దీనికి ప్రధాన శత్రువు. కీళ్ల నొప్పి, వేళ్లు, మణికట్టు, మోకాళ్ల చుట్టూ వాపు, నొప్పి లూపస్ ప్రధాన సంకేతాలు. 'లూపస్ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' పరిశోధన ప్రకారం ఈ వ్యాధి పురుషుల కన్నా మహిళలకు వచ్చే ఆస్కారమే ఎక్కువట. టీనేజ్ నుంచి 30 ఏళ్ల వయసులో వస్తుంది ఇది.

ఈస్ట్రోజన్ స్థాయిలు ఎక్కువ గా ఉండటం, రుతుక్రమ సమయంలో రోగనిరోధక వ్యవస్థ ఎక్కువగా ప్రభావితం అవ్వడం, గర్భధారణ, హార్మోన్ల అసమతౌల్యత కూడా దీని కి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. జన్యుపరంగానూ వస్తుం ది. అతినీల లోహిత కిరణాలు రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసి లూపస్‌ను ప్రేరేపిస్తాయని పేర్కొంటున్నా రు. ప్రతిరోజూ బయటికి వెళ్లేటప్పుడు ఎస్‌పీఎఫ్ 50 ఉండే సన్‌స్క్రీన్ లోషన్లు, మాయిశ్చరైజర్లు వాడమని సిఫార్సు చేస్తున్నారు. ముఖం, చేతులు పూర్తిగా కప్పేలా కాటన్ దుస్తులు, గొడుగులు ఉపయోగించాలి. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, తాజాపండ్లు, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే నట్స్, చేపలు వంటివి తినమంటున్నారు. ప్యాకేజ్డ్ ఫుడ్స్‌కు దూరంగా, నూనెల్ని తగ్గించి వంటకాల్ని చేసుకోమంటున్నారు. మానసిక ఒత్తిడి తగ్గించుకుని, కనీసం 7 గంటలు నిద్రకు కేటాయించమని చెబుతున్నారు. చేతులు, మణికట్టు, మోకాళ్ల కీళ్లు బిగుసుకుపోవడం వంటి సమస్యలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించమంటున్నారు.

## పిల్లలకు పాలు.. మరింత రుచిగా!



కొంతమంది పిల్లలు పాలు తాగడానికి ఇష్టపడరు. అవి వారికి రుచించకపోవడమే ఇందుకు కారణం. దీంతో వారి శరీర ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు అందకుండా పోతాయి. అలా జరగకుండా ఉండాలంటే పాలను నేరుగా కాకుండా.. వాటిలో కొన్ని పదార్థాలు కలపడం వల్ల రుచికరంగా పిల్లలకు అందించచ్చంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి..

పిల్లలు ఇష్టంగా పాలు తాగాలంటే.. రకరకాల పండ్ల ముక్కలు వేసి స్మూతీలుగా, మిల్క్‌షేక్స్‌గా తయారు చేసి ఇవ్వచ్చు. అయితే వీటి తయారీలో పండ్ల పరిమాణం కాస్త తక్కువగా, పాల పరిమాణం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. తద్వారా ఎక్కువ మొత్తంలో పాలు వారికి ఇవ్వచ్చు. అలాగే చక్కెర మరీ ఎక్కువగా వేయకూడదు.

పోషకాహార నిపుణుల సలహా తీసుకొని రుచి కోసం పాలలో కలిపే కొన్ని పౌడర్స్, పదార్థాల్ని ఎంచుకోవచ్చు. ఫలితంగా పిల్లలకు అందించే పాలు రుచిగా మారడంతో పాటు క్యాల్షియం వంటి పోషకాలు పిల్లలకు సమృద్ధిగా అందుతాయి.

కార్న్‌ఫ్లేక్స్, చాకోస్.. వంటివి పాలలో కలిపి ఇవ్వడం వల్ల పాలు మరింత రుచిస్తాయి. ఫలితంగా వారు ఆ పదార్థాల్ని తిని పాలు తాగుతారు. ఈ క్రమంలో చక్కెర మోతాదు తక్కువ ఉన్న వాటిని ఎంచుకోవడం మర్చిపోవద్దు. అలాగే ఓట్‌మీల్, పాస్తా.. వంటి పదార్థాల్లో నీళ్లకు బదులుగా పాలను ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు.

## గర్భధారణ సమయంలో.. ఆరోగ్యంగా..!



కడుపులో పెరుగుతున్న బిడ్డ ఎదుగుదల గురించే అనుక్షణం ఆలోచిస్తుంటుంది కాబోయే అమ్మ. ఈ క్రమంలో ఆహారం దగ్గర్నుంచి వ్యాయామాల వరకు.. ప్రతి అంశంలోనూ జాగ్రత్తగా ఉండాల్సిందే అంటున్నారు నిపుణులు. ఆహారం ఏ పూటకు ఆ పూటే వేడివేడిగా వండుకొని తీసుకోవాలి. ఉదయం వండినవి సాయంత్రం, రాత్రి వండినవి మరుసటి రోజు వేడి చేసుకొని తినకపోవడమే మంచిదంటున్నారు. గర్భధారణ సమయంలో మహిళలు పెరిగే బరువు ఆరోగ్యకరంగా ఉండాలి. ఇందుకోసం నిపుణుల సలహా మేరకు పోషకాహారం తీసుకోవడం మంచిది. అలాగే ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకుంటూ ఈ సమయంలో జంక్‌ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్.. వంటి వాటికి దూరంగా ఉండాలి. అలాగే స్వీట్స్ కూడా మితంగానే తీసుకోవాలి. బిడ్డ ఎదుగుదలకు వివిధ పోషకాలతో కూడిన మాంసాహారం మంచిదే. అయితే వీటిని బాగా ఉడికించుకొని మితంగా తీసుకోవాలి. అప్పుడే అవి త్వరగా, సులభంగా జీర్ణమవుతాయని సూచిస్తున్నారు నిపుణులు. రోజూ తాగే నీళ్లు కూడా కాచి చల్లార్చినవైతే మరీ మంచిదంటున్నారు నిపుణులు. అలాగే డీహైడ్రేషన్ బారిన పడకుండా కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఫలితంగా ఉమ్మనీరు తగ్గకుండానూ జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో ఆరోగ్య పరిస్థితిని బట్టి నిపుణుల సలహాలు తీసుకొని.. యోగా, నడక.. వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే యాక్టివ్‌గా ఉండచ్చు.

## నిద్ర రాకపోతే... లేవండి!

తెల్లవారుజాము 2గం. అవుతోంది. శరీరమేమో విశ్రాంతి కావాలి అంటుంది. మరి కునుకు... రానంటే రానంటుంది. రేపు చేయాల్సిన పనులేమో బోలెడు. ఆలస్యంగా లేచినా అలసట దరిచేరినా మనకు రెట్టింపు పని. అందుకని ఏవేవో చేస్తుంటాం. ఒకటి నుంచి పది కాదు కదా... వంద లెక్కపెట్టినా అంతే. ధ్యానం చేసినా... ఒకే ప్రాంతాన్ని తదేకంగా చూసినా ఆఖరికి నిద్ర రావాలి అని మనసుకి ఎన్నిసార్లు చెప్పుకొన్నా... అరె ఎంతకీ రాదే! అయినా బలవంతంగా ప్రయత్నిస్తున్నారా? వద్దు లేవండి. 'అరె సరిగా నిద్రలేకపోతే ఎలా' అన్న కంగారొద్దు. ఒక్కరోజు పడుకోనంత మాత్రాన ఆరోగ్యానికి పెద్దగా హానేమీ కలగదు. కాకపోతే దాన్ని ఆలోచిస్తూ ఒత్తిడి పెంచుకుంటేనే ఇబ్బంది!

కాబట్టి, ఎంత ప్రయత్నించినా 20 నిమిషాలు దాటినా నిద్ర రాలేదంటే లేవడమే మంచిదంటున్నారు నిపుణులు.

పడుకోవాలి... పడుకోవాలి అని బలవంతంగా ప్రయత్నిస్తే మనసు కూడా ఎదురు తిరుగుతుంది. అది సహజంగా జరగాలి. ఇంకా కునుకు పట్టట్లేదు, అరెరె ఇంత సమయమైంది అని కంగారు పడుతోంటే... మెదడు మంచాన్ని విశ్రాంతి ప్రదేశంగా కాకుండా ఒత్తిడి తెచ్చే దానిలా చూస్తుంది. అందుకే లేవాలి. కాస్త విచిత్రంగా తోయొచ్చు కానీ... ఇలా లేవడం వల్ల మెదడుకీ మనకూ మధ్య జరిగే ఈ నిద్రా పోరాటానికి కాస్త తెర పడుతుంది. కాసేపటికి శరీరమే నిద్రా అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఈ క్రమంలో ఆలోచనలు పక్కకువెళ్లి కునుకు పట్టట్లేదన్న ఒత్తిడీ తగ్గుతుంది. దీంతో శరీరం రిలాక్స్ అయ్యి నిద్ర పడుతుంది.



తక్కువ వెలుతురులో కాసేపలా నడవండి. కాసేపు పుస్తకం చేతిలోకి తీసుకొని నడవండి. ఏదైనా సంఘటన గురించి రాయండి. శ్వాస వ్యాయామాలు చేయండి. సంగీతాన్నీ వినొచ్చు.

లేవమన్నారు కదా అని ఏ టీవీకో మొబైల్‌కో అతుక్కుపోవద్దు. ఇవి మెదడుని అలర్ట్‌గా చేస్తాయి. అప్పుడు నిద్ర దరిచేరే అవకాశమే ఉండదు. పదే పదే గడియారాన్నీ చూడొద్దు. ఇదీ ఆందోళనని పెంచి, నిద్ర పట్టనీయదు. కాబట్టి, మిమ్మల్ని రిలాక్స్ చేసేవేంటో ఆలోచించి, వాటిని చేయడం మేలు.

కాసేపు శరీరం విశ్రాంతి పొందితే కళ్లు రెప్పలు పడటం ఖాయం. ఈసారి నాణ్యమైన నిద్ర వస్తుంది. అలాగని ఉన్నచోటే కుర్చీలోనో సోఫాలోనో పడుకోవద్దు. లోపలికి వెళ్లి మంచం మీదే పడుకోండి. తిరిగి మెలకువ వచ్చి, నిద్ర పట్టలేదా? మళ్లీ బయటికి రావడమే.

## మన తప్పు కాదులే..!

కాస్త లావైతే చాలు... ఎలాగైనా వెంటనే బరువు తగ్గాలి... అంటూ చాలామంది అమ్మాయిలు ప్రతిన పూనుతుంటారు. తీపి మానేశాం, అన్నం తగ్గించేశాం... అంటూ కెలొరీలు తగ్గించడానికి బోలెడు దారులు వెతుక్కుంటారు. కానీ, ఫలితం ఉండదు. అయితే, అందులో మన తప్పేం లేదు లెండి..ఎందుకంటారా? మనం బరువు తగ్గాలని సంకల్పించుకున్నా అలా కాకుండా చేస్తుంది మన మెదడేనని పరిశోధనలు చెబుతున్నాయి. ఒకసారి శరీరం అధిక బరువుకి



చేరుకున్న తరవాత, మన మెదడు దాన్నే ఒక 'సెట్ పాయింట్'లాగా పరిగణించి, ఆ బరువు తగ్గకుండా కాపాడుకుంటూ వస్తుందట. ఎప్పుడైతే మనం తగ్గటానికి ప్రయత్నిస్తామో... మెదడు దాన్ని ముప్పుగా భావించి, వెంటనే ఆకలి పెంచే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. అలానే, ఉన్న శక్తిని ఆదా చేయడానికి జీవక్రియ మందగించేలానూ చేస్తుంది. అసంకల్పిత కదలికలను తగ్గిస్తుంది. ఇది మన మనుగడలో ఓ భాగం. అందుకే, బరువు తగ్గేందుకు మనతో మనమే యుద్ధం చేయాల్సి వస్తుంది. కాబట్టి, ఒక్కసారిగా బరువు తగ్గాలని ఆరాటపడకుండా, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ పోషకాహారం తీసుకోవాలి. దానివల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. క్రమంగా బరువూ తగ్గుతారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలా చేస్తారా మరి?

## మేకప్ వేసుకోకపోయినా..!

బయటికి వెళ్లిన ప్రతిసారీ మేకప్ వేసుకోవడం కుదరకపోవచ్చు.. అలాగే తరచూ మేకప్ వేసుకోవడం కొందరికి నచ్చకపోవచ్చు. అయినా మేకప్ వేసుకున్న లుక్‌ని సొంతం చేసుకోవాలంటే..? ఈ చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు.

మేకప్ డీటాక్స్‌లో భాగంగా ప్రాథమిక చర్మ సంరక్షణను పాటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసుకోవాలి. ఇది ఎండ నుంచి చర్మానికి రక్షణ కల్పించడమే కాదు.. చర్మానికి ఒక రకమైన మెరుపును తీసుకొస్తుంది. డల్‌గా ఉన్న ముఖాన్ని ప్రకాశవంతంగా మార్చాలంటే టింటెడ్ మాయిశ్చరైజర్‌ను వాడాలి. ఇక ప్రత్యేక సందర్భాల్లో మాత్రం హై కవరేజ్ ఫౌండేషన్స్‌ను వాడితే ఫలితం ఉంటుంది. అయితే ఏది ఎంచుకున్నా చర్మతత్వాన్ని బట్టి ఎంచుకోవడం ముఖ్యం.

చర్మంపై మృత కణాలు ఏర్పడడం, పొలుసులుగా ఊడిపోవడం వల్ల ముఖం డల్‌గా కనిపిస్తుంది. దీనికి ఎక్స్‌ఫోలియేషన్ పద్ధతి మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మీ చర్మతత్వాన్ని బట్టి స్క్రబ్‌ను ఎంచుకొని లేదంటే ఇంట్లోనే సహజ స్క్రబ్‌లను తయారుచేసుకొని స్క్రబింగ్ చేసుకోవాలి. దీనివల్ల చర్మం లోలోపలి నుంచి శుభ్రపడి సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. మేకప్ వేసుకోకపోయినా ఆ మెరుపును పొందాలంటే ముఖం శుభ్రం చేసుకున్నాక టోనర్ వాడమంటున్నారు నిపుణులు. దీనివల్ల ముఖంపై పీహెచ్ స్థాయులు బ్యాలన్స్ అయి చర్మం తాజాగా కనిపిస్తుందట.

పెదాలు మృదువుగా ఉన్నప్పుడే వాటి అందం ఇనుమడిస్తుంది. ఇందుకోసం రోజూ లిప్‌బామ్ రాసుకోవడం తప్పనిసరి! అలాగే ఆలివ్ ఆయిల్ వంటి నూనెలతో పెదాలపై మర్దన చేసుకోవడం వల్ల వాటికి సహజ మెరుపు వస్తుంది. ఫలితంగా లిప్‌స్టిక్ రాసుకునే అవసరమే ఉండదంటున్నారు నిపుణులు.



## స్థిరాస్తి సంస్థల బుకింగులు తగ్గాయ్



దేశీయ స్టాక్ మార్కెట్‌లో నమోదైన 28 స్థిరాస్తి సంస్థల బుకింగ్‌లు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో రూ.39,964 కోట్లకు పరిమితమయ్యాయి. 2025–26 ఏప్రిల్–జూన్ త్రైమాసిక బుకింగులు రూ.50,900 కోట్ల కంటే ఇవి 21% తక్కువ. ఇందులో వాణిజ్య, నివాస సముదాయాలు నిర్మించే సంస్థల వివరాలున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో, కొందరు పెద్ద డెవలపర్లు గృహ నిర్మాణ ప్రాజెక్టులను ప్రారంభించడానికి వెనుకాడటంతోనూ, అమ్మకాల పరిమాణం తగ్గింది. మొత్తంమీద బుకింగుల్లో అత్యధిక వాటాను గృహ నిర్మాణ రంగమే సమకూర్చింది. అమ్మకాల బుకింగ్‌ల్లో గోద్రేజ్ ప్రోపర్టీస్ అతిపెద్ద నమోదిత స్థిరాస్తి డెవలపర్‌గా నిలిచింది.




# నష్టాలతో ముగిసిన సూచీలు..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు సూచీలను పడేశాయి. జూన్‌లో కుదిరిన ఒప్పందం గడువు ముగియడం, ఇరాన్‌పై అమెరికా కఠిన ఆర్థిక ఆంక్షలను తీవ్రతరం చేసింది. ప్రతిగా ఇరాన్ కూడా హెచ్చరికలకు దిగడంతో యుద్ధ వాతావరణం నెలకొంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ఉదయం స్వల్ప లాభాల్లో కదలాడిన సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 77,629.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,540.83) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల బాట పట్టింది. ఇంట్రాడేలో 77,201.66 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 171.72 పాయింట్ల నష్టంతో 77,369.11 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32.95 పాయింట్ల నష్టంతో 24,219.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92.73 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4646 డాలర్ల వద్ద ట్రేడుతోంది.

# మోనోషాక్ సస్పెన్షన్‌తో పల్సర్ 125, పల్సర్ 150..



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో కొత్త పల్సర్ మోటార్ సైకిళ్లను దేశీయంగా లాంచ్ చేసింది. 125, 150 సీసీ సెగ్మెంట్లలో వీటిని ఆవిష్కరించింది. మోనోషాక్ సస్పెన్షన్, రైడ్‌మోడ్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లను కొత్తగా జోడించింది. క్లాసిక్ మోడళ్లలో వెనుక భాగంలో ఉండే డ్యూయల్‌షాక్ సస్పెన్షన్ స్థానంలో మోనోషాక్ తీసుకురావడం ఇదే తొలిసారి. దీంతోపాటు క్రాల్‌టెక్ అనే కొత్త ఫీచర్‌ను జోడించారు. ట్రాఫిక్‌లో పదే పదే థ్రాటిల్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా బైక్ నెమ్మదిగా కదిలేందుకు ఈ ఫీచర్ సహాయపడుతుంది. ఇంజిన్ ఆగిపోకుండా చూస్తుంది.

కొత్త పల్సర్ 150.. 13.6 బీహెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. సింగిల్ డిస్క్, ట్విన్ డిస్క్ వేరియంట్లలో లభిస్తుంది. సింగిల్ డిస్క్ వేరియంట్‌లో రోడ్, రెయిన్, స్పోర్ట్– 3 రైడింగ్ మోడ్‌లు ఉంటాయి. కలర్ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, యూఎస్‌బీ టైప్–సీ ఛార్జింగ్ పోర్ట్ సదుపాయం ఉంది. ట్విన్ డిస్క్ వేరియంట్‌లో గూగుల్ మ్యాప్స్ నావిగేషన్‌తో కూడిన 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఇచ్చారు. ఎల్ఈడీ ఇండికేటర్లు, హజార్డ్ ల్యాంప్స్, ఇంటిగ్రేటెడ్ స్టార్టర్ జనరేటర్ సదుపాయాలు ఉన్నాయి. సింగిల్ సీట్, స్పోర్టీ స్ప్లిట్ సీట్ ఆప్షన్లతో లభిస్తుంది.

ఇక పల్సర్ 125 ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులోని ఇంజిన్ 11.7 బీహెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. బేస్ వేరియంట్ కలర్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్ సదుపాయంతో వస్తోంది. మిడ్, టాప్ వేరియంట్లలో రోడ్, రెయిన్, స్పోర్ట్ రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉంటుంది. ఎల్ఈడీ ఇండికేటర్లు, హజార్డ్ లైట్లు, ఇంటిగ్రేటెడ్ స్టార్టర్ జనరేటర్ సదుపాయాలు ఉన్నాయి. ఈ వేరియంట్లలో స్టాండర్డ్‌గా టైప్–సి ఛార్జింగ్ పోర్ట్ సదుపాయం ఉంటుంది. సింగిల్ సీట్ లేదా స్ప్లిట్ సీట్ ఆప్షన్లతో లభిస్తుంది.

కొత్త పల్సర్ 150 ధర రూ.1.15 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. సింగిల్ డిస్క్ వేరియంట్ ధర రూ.1,15,233గా నిర్ణయించారు. ఇక ట్విన్ డిస్క్ సింగిల్ సీట్ ధర రూ.1,22,184, ట్విన్ డిస్క్ స్ప్లిట్ సీట్ వేరియంట్ ధర రూ.1,23,187గా కంపెనీ నిర్ణయించింది. పల్సర్ 125 మొత్తం నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. బేస్ వేరియంట్ ధరను రూ.92,990గా నిర్ణయించారు. ఎస్‌టీడీ సింగిల్ సీట్ రూ.99,291, ఎస్‌టీడీ స్ప్లిట్ సీట్ రూ.1,00,288, ప్రీమియం స్ప్లిట్ సీట్ ధర రూ.1,04,318గా కంపెనీ పేర్కొంది.

## 2030కి రూ.200 లక్షల కోట్ల వ్యాపారం



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన 75వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకొనే 2030 సంవత్సరానికి, బ్యాంకు మొత్తం వ్యాపారం ప్రస్తుతం కంటే రెట్టింపై, సుమారు రూ.200 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. పార్లమెంటు చట్టం ద్వారా 1955 జులై 1న ఉనికిలోని వచ్చిన ఎస్‌బీఐ, దేశంలోనే అతిపెద్ద రుణదాత సంస్థగా ఎదిగింది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బ్యాంకు రుణాలు, డిపాజిట్ల కలయికతో కూడిన మొత్తం వ్యాపారంలో రూ.100 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. 2026 జూన్ నాటికి ఇది రూ.110.01 లక్షల కోట్లకు పెరిగింది. వజ్రోత్సవ సంవత్సరమైన 2030కి బ్యాంక్ ఏదైనా నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుందా అని అడిగినప్పుడు, అటువంటి నిర్దేశిత లక్ష్యాన్ని ఏమీ పెట్టుకోలేదని ఎస్‌బీఐ ఛైర్మన్ పేర్కొన్నారు. అయితే బ్యాంక్ వృద్ధి గమనాన్ని పరిశీలిస్తే 2030 నాటికి మొత్తం వ్యాపారం రూ.170–180 లక్షల కోట్లకు/గరిష్ఠంగా రూ.200 లక్షల కోట్లకూ చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎస్‌బీఐ కార్యకలాపాల స్థాయి భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుతో దగ్గరి సంబంధం కలిగి ఉంటుందని శెట్టి వివరించారు. భారత ఆర్థిక వ్యవస్థ 7–8% వృద్ధిరేటుతో సాగితే, ఎస్‌బీఐ బ్యాలెన్స్ షీట్ ఏటా సుమారు 11–12% విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది జరిగితే ప్రతి ఆరు సంవత్సరాలకు ఒకసారి బ్యాలెన్స్ షీట్ రెట్టింపు అవుతుందని విశ్లేషించారు. అందుకే 2030 నాటికి ఎస్‌బీఐ మొత్తం వ్యాపారం రూ.200 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని వివరించారు.

## లలితా జువెలరీ ఐపీఓ..




ప్రముఖ ఆభరణాల సంస్థ లలితా జువెలరీ మార్ట్ లిస్టింగ్‌లో అదరగొట్టింది. ఇష్యూ ధరతో పోలిస్తే 32 శాతం ప్రీమియంతో షేర్లు లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.201 కాగా.. బీఎస్ఈలో 31.99 శాతం ప్రీమియంతో రూ.265.30 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. అటు ఎన్ఎస్ఈలోనూ 31.84 శాతం ప్రీమియంతో రూ.265 వద్ద షేర్లు లిస్టయ్యాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.14,462.90 కోట్లకు చేరింది. లలితా జువెలరీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 17న ప్రారంభమై.. 19న ముగిసింది. ధరల శ్రేణిని రూ.190–201గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.1200 కోట్లు , ఆఫర్ ఫర్ సేల్ కింద రూ.500 కోట్లు.. వెరసి రూ.1700 కోట్లు కంపెనీ మార్కెట్ నుంచి సమీకరించింది. ఈ ఐపీఓకు 62.97 రెట్లు సబ్‌స్క్రిప్షన్ అందింది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మరో రూ.508 కోట్లు సమీకరించింది. 1985లో చెన్నైలోని టీనగర్‌లో లలితా జువెలరీ ప్రస్థానం ప్రారంభమైంది. 'డబ్బులు ఎవరికీ ఊరికే రావు' అనే స్లోగన్‌తో ఈ సంస్థ అధినేత కిరణ్ కుమార్ బాగా పాపులర్ అయ్యారు.

# యూపీఐకి పదేళ్లు.. లావాదేవీల సంఖ్యలో 13 వేల రెట్లు వృద్ధి




భారత ఆర్థిక వ్యవస్థను డిజిటల్ బాట పట్టించడంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI)ది కీలక పాత్ర. 2016 ఆగస్టు 25న ప్రారంభమైన ఈ వ్యవస్థకు ఈ నెల 25తో పదేళ్లు పూర్తవుతున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంకు (RBI) నియంత్రణ పర్యవేక్షణలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) దీన్ని రూపొందించింది. ఫోన్ నంబర్లు, క్యూఆర్ కోడ్, మొబైల్ యాప్‌ల ద్వారా వ్యక్తి నుంచి వ్యక్తికి, వ్యక్తి నుంచి వ్యాపారికి రియల్‌టైమ్‌లో జరిగే యూపీఐ చెల్లింపులు.. దశాబ్ద కాలంలో దేశ డిజిటల్ పేమెంట్స్ రూపురేఖలను మార్చేశాయి.

కేంద్ర ఆర్థిక శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. 2016–17లో వార్షిక యూపీఐ లావాదేవీల సంఖ్య 1.78 కోట్లుగా ఉండగా, 2025–26 నాటికి అది ఏకంగా 24,162 కోట్లకు పైగా పెరిగింది. అంటే దాదాపు 13 వేల రెట్లు వృద్ధి నమోదైంది. అదే సమయంలో లావాదేవీల విలువ రూ.ఏడు వేల కోట్ల నుంచి దాదాపు రూ.314 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది మే నెలలో యూపీఐ నెలవారీ లావాదేవీల సంఖ్య తొలిసారిగా 2,300 కోట్లను దాటి 2,320 కోట్లకు చేరుకుంది. జులైలో ఏకంగా 2,366 కోట్ల లావాదేవీలతో పదేళ్లలో సరికొత్త గరిష్ఠ స్థాయి నమోదైంది. ప్రస్తుతం రోజూ దాదాపు 66 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. లావాదేవీల సంఖ్యపరంగా ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా యూపీఐని అంతర్జాతీయ ద్రవ్యనిధి (IMF) గుర్తించింది. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా రియల్‌టైమ్ పేమెంట్ లావాదేవీల్లో దాదాపు 49 శాతం వాటా యూపీఐదే. దేశీయ ఆవిష్కరణగా ప్రారంభమైన యూపీఐ.. ప్రస్తుతం యూఏఈ, ఫ్రాన్స్, భూటాన్, శ్రీలంక, నేపాల్, సింగపూర్, మారిషస్, ఖతార్, కంబోడియా, గ్రీస్, మాల్దీవుల్లోనూ అందుబాటులో ఉంది.

డిజిటల్ చెల్లింపుల రంగంలో రాబోయే దశాబ్ద కాలంలో యూపీఐ మరిన్ని గొప్ప మార్పులకు నాంది పలకనుందని ఆర్థిక శాఖ పేర్కొంది. కొత్త వినియోగదారులు, వ్యాపారులను ఈ వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా.. నిరంతర మార్పులు, సాంకేతిక పురోగతితో యూపీఐను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు, దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపింది.




## అక్కడేం జరిగిందో తెలియకుండా జడ్జ్ చేయొద్దు: యశస్వి జైస్వాల్



రెండో టెస్టులో భారత ఆటగాడు యశస్వి జైస్వాల్ – అసిత ఫెర్నాండో మధ్య చోటుచేసుకున్న వివాదం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొందరు యశస్వికి మద్దతుగా నిలుస్తుంటే.. మరికొందరేమో సరైంది కాదనే విధంగా కామెంట్లు చేస్తున్నారు. మాజీ క్రికెటర్ అజయ్ జడేజా, వ్యాఖ్యాత హర్షా భోగ్లే ఇలాగే యశస్వి జాగ్రత్తగా ఉండాలంటూ హితవు పలికారు. ఈ క్రమంలో భోగ్లే పెట్టిన కామెంట్‌కు యశస్వి కాస్త ఘాటుగానే స్పందించాడు. ''అతడు ఏమన్నాడో తెలియకుండా.. ఓ అభిప్రాయానికి రావొద్దు. మీకు మీరే జడ్జిమెంట్లు ఇచ్చేయొద్దు. ఎవరైనా హద్దు దాటితే ఆ విషయాన్ని వారికే తెలియజేయండి. మన భారత్ తప్పకుండా పోరాడుతుంది. సరైన సమాధానం ఇస్తుంది'' అని యశస్వి పోస్టు పెట్టాడు.

# శ్రీలంకతో రెండో టెస్టు.. భారత్ 503/9 డిక్లేర్



శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా భారీ స్కోరు చేసింది. 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ఏడు పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (115★; 177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆదివారం మూడు పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ అయిన రిషభ్ పంత్ (63; 89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి అర్ధ శతకం బాదాడు. మానవ్ సుతార్ (18) పరుగులు చేసి వెనుదిరిగాడు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 2, కేశర నువాంతు 2, లాహిరు కుమార ఒక వికెట్ పడగొట్టారు. తర్వాత శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా.. రెండు బంతులు పడగానే ఆకాశం మేఘావృతం కావడంతో ముందు జాగ్రత్తగా ఆటను నిలిపి వేసి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. ఆట తిరిగి ప్రారంభం కాగా.. భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్ బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 171 బంతుల్లో అతను మూడంకెల స్కోరు అందుకున్నాడు. జురెల్ 99 పరుగులకు చేరిన తర్వాత సెంచరీ అందుకోవడానికి 13 బంతులు తీసుకున్నాడు. అయితే, శతకం పూర్తి చేసుకున్న తర్వాత ఎదుర్కొన్న తొలి బంతినే జురెల్ సిక్సర్‌గా మలిచాడు. అనంతరం ప్రభాత్ జయ సూర్య బౌలింగ్‌లో సిరాజ్ (3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడంతో భారత్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 137 ఓవర్లకు భారత్ స్కోరు 489/9. జురెల్ (106)తోపాటు ప్రసిద్ధ్ కృష్ణ క్రీజులో ఉన్నారు. వర్షం తగ్గిపోవడంతో మ్యాచ్‌ను కొనసాగించేందుకు మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. 4:25 గంటలకు ఆట తిరిగి ప్రారంభంకానుంది. సరైన వెలుతురు ఉండి వాతావరణం అనుకూలిస్తే సాయంత్రం 6 గంటల వరకు ఆట నిర్వహించనున్నారు. కొలంబోలో వర్షం కురవడం ఆగిపోయింది. ప్రస్తుతం ఎండ కూడా కాస్తోంది. దీంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా సిబ్బంది మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. రెండో టెస్టుకూ వరుణుడు అంతరాయం కలిగించింది. దీంతో ఆటను అంపైర్లు నిలిపివేశారు. మైదానాన్ని సిబ్బంది కవర్లతో కప్పేశారు. ప్రస్తుతం భారత్ స్కోరు 131.2 ఓవర్లకు 475/8. ధ్రువ్ జురెల్ (95★) సెంచరీకి చేరువగా వచ్చాడు. అతడితోపాటు క్రీజ్‌లో మహ్మద్ సిరాజ్ ఉన్నాడు. వర్షం రావడంతో టీ బ్రేక్‌ను ముందే ప్రకటించారు. భారత్ ఎనిమిదో వికెట్‌ను నష్టపోయింది. ఇక ప్రభాత్ జయసూర్యకు ఎట్టకేలకు వికెట్ దక్కింది. జయ సూర్య వేసిన (124.4వ ఓవర్) బంతిని ఆడే క్రమంలో మానవ్ సుతార్ (18) వికెట్ కీపర్ డిక్వెల్లాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ప్రభాత్‌కు ఇది 36వ ఓవర్ కావడం గమనార్హం. ప్రస్తుతం భారత్ స్కోరు 458/8. భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతోంది. రిషభ్ పంత్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ (13★) కూడా క్రీజ్‌లో పాతుకుపోయాడు. మరోవైపు ధ్రువ్ జురెల్ (76★) కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అనవసరమైన షాట్లకు పోకుండా పరుగులు రాబట్టడంపైనే భారత బ్యాటర్లు దృష్టి పెట్టారు. ప్రస్తుతం భారత్ స్కోరు 122 ఓవర్లకు 450/7. రిషభ్ పంత్ (63) ఔటయ్యాడు. లంచ్ బ్రేక్ తర్వాత ఆడిన తొలి బంతికే పెవిలియన్‌కు చేరడం గమనార్హం. కేశర నువాంత వేసిన (112.1వ ఓవర్) తొలి బంతిని పంత్ భారీ షాట్ కొట్టాడు. కానీ, డీప్ మిడాఫ్‌లో లాహిరు ఉదారా చేతికి చిక్కాడు.

# ధోనిని అధిగమించి.. రికార్డు సృష్టించిన పంత్



రెండో టెస్టులోనూ శ్రీలంకపై భారత్ పట్టు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటికే 400+ స్కోరు నమోదు చేసింది. దేవదత్ పడిక్కల్ సెంచరీ సాధించగా.. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్ అర్ధ శతకాలు నమోదు చేశారు. ఈ క్రమంలో రిషభ్ పంత్ ఓ ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని రికార్డును పంత్ అధిగమించడం గమనార్హం. విదేశీ గడ్డపై ఏ భారత వికెట్ కీపర్ కూడా టెస్టుల్లో 2500+ పరుగులు చేయలేదు. ఇప్పుడు రిషభ్ పంత్ ఆ ఘనత సాధించాడు. పంత్ 41.48 సగటుతో ఈ మార్క్‌ను అధిగమించాడు. ఇక, ధోని 2,496 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు. ఫరూఖ్ ఇంజినీర్ (1,209), సయ్యద్ కిర్మాణి (1,109), కిరణ్ మోరె (901) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. శ్రీలంకతో రెండో టెస్టులో పంత్ హాఫ్ సెంచరీతో (63) ఆకట్టుకున్నాడు. నిన్న చేతికి దెబ్బ తగలడంతో మైదానం వీడిన సంగతి తెలిసిందే. ఇవాళ ఉదయం ఆరో వికెట్ పడిన తర్వాత పంత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి సెంచరీ భాగస్వామ్యం నిర్మించాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో 21వ అర్ధశతకాన్ని పంత్ నమోదు చేశాడు. అయితే, 63 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్‌కు చేరాడు.

# అసిత ఫెర్నాండోతో గొడవ.. యశస్వి జైస్వాల్‌కు జరిమానా

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు భారత ఆటగాడు యశస్వి జైస్వాల్ – అసిత ఫెర్నాండో మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఐసీసీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళి లోని లెవెల్ –1ను ఉల్లంఘించినట్లు తేలడంతో యశస్వితోపాటు ఫెర్నాండోకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ ఇచ్చింది. తొలి రోజు ఆటలో యశస్వి జైస్వాల్ ఔట్ చేసిన తర్వాత ఫెర్నాండో అత్యుత్సాహం ప్రదర్శించాడు. దీంతో జైస్వాల్ అతడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో లంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ దూరం తీసుకెళ్లడంతో ఈ గొడవ సద్దుమణిగింది.



## శ్రీలంక సిరీస్‌లో కోచ్‌గా గంభీర్‌కు పెద్దగా పనిలేదు: క్రిష్



శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారత్ అదరగొట్టేస్తోంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌ను నెగ్గిన టీమ్‌ఇండియా రెండో టెస్టుపైనా పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది. ఇక వన్‌డౌన్‌లో దేవదత్ పడిక్కల్ సెట్ అయిపోయాడు. వరుసగా రెండో సెంచరీతో అలరించాడు. సాయి సుదర్శన్ లేకపోయినా భారత్‌కు వన్‌డౌన్ ఇబ్బంది లేదు. ఇటు బౌలింగ్‌తోపాటు బ్యాటింగ్ లోనూ మెరుగైన ప్రదర్శనతో గంభీర్ అండ్ కో హ్యాపీగా ఉంది. అయితే, ఈ సమయంలో భారత మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ కాస్త వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. ఈ సిరీస్‌లో గంభీర్‌కు పెద్దగా పనేమీ లేదని వ్యాఖ్యానించాడు. అఫ్గాన్‌తో పాటు శ్రీలంకపై సిరీస్ గెలిచినందుకు ఎగిరి గంతేస్తాడంటూ కామెంట్ చేశాడు. ''గంభీర్‌కు పనిలేదు. రెండో టెస్టుకు ముందు జట్టు కూర్పుపై అతడు ఏదో చెప్పాడు కానీ.. శ్రీలంక సిరీస్‌లో మేధోమథనం చేయాల్సినంత ఏమీ లేదు. ఎందుకంటే లంక జట్టేమీ గొప్పగా లేదు. ఈ సిరీస్‌ను భారతే గెలుచుకుంటుంది. అందులో ఎలాంటి అనుమానం లేదు. మొన్న అఫ్గాన్.. ఇప్పుడు లంకపై విజయం సాధించాక గంభీర్ ఎగిరి గంతేస్తాడు. ఇక్కడ నేనేదో అతడిపై పరుషంగా వ్యాఖ్యలు చేయడంలేదు. గంభీర్ మంచి ఆటగాడు.

# క్రిస్మస్ బరిలో బాలయ్య...!



**వుదయం సినిమా:** నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'NBK111'( వర్కింగ్ టైటిల్ ). ఇటీవలే బాలయ్యకు స్వల్పం గాయం కావడంతో సినిమాలకు కొంత విరామం తీసుకున్నాడు. దీంతో దసరాకి రావాల్సిన ఈ సినిమాను డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుందట. బాలయ్య త్వరలోనే షూటింగ్‌లో పాల్గొనున్నారని సమాచారం. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. కాజల్ అగర్వాల్ హీరోయిన్ కాగా మంచు మనోజ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం అధికారిక టైటిల్ త్వరలోనే ప్రకటించనున్నారు.

వుదయం సినిమా MOVIE TIME!

# 'రంభ ఊర్వశి మేనక' హిలేరియస్ ట్రైలర్



**వుదయం సినిమా:** అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ 'రంభ ఊర్వశి మేనక'తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. పౌరాణిక కథలు, గ్రామీణ హాస్యం, వినోదాత్మకమైన అంశాలతో అలరించనుంది. కింగ్ నాగార్జున ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సూరి(అల్లరి నరేష్) మొక్కుబడులతో భూలోకానికి దిగివచ్చిన రంభ, ఊర్వశి, మేనకలు.. తమ దివ్య శక్తులను కోల్పోవడంతో అసలు కథ మొదలవుతుంది.

# ఘనంగా ప్రారంభమైన 'శివాలయం'




**వుదయం సినిమా:** తెలుగు వెండితెరపై మరో భక్తి రస చిత్రం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఆధ్యాత్మికత, భక్తి, భావోద్వేగాలను మేళవిస్తూ తెరకెక్కనున్న నూతన చిత్రం 'శివాలయం' పూజా కార్యక్రమాలతో తెలుగు ఫిలిం ఛాంబర్ లో ఘనంగా ప్రారంభమైంది. ఆచంట మహేష్ (రంగస్థలం ఫేమ్), కాంచన దీప్తిరెడ్డి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి వెంకట్‌రెడ్డి నంది దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.దేవునిపటాల సమక్షంలో నిర్వహించిన ఈ చిత్ర ముహూర్తపు కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు, కళాకారులు, శ్రేయోభిలాషులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన తొలి సన్నివేశానికి దిల్ రమేష్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఘర్షణ శ్రీనివాస్ క్లాప్ కొట్టారు. ప్రముఖ వ్యవసాయవేత్త కల్లెం నరసింహారెడ్డి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు.నటుడు, నిర్మాత లెంకల అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. "దర్శకుడు, నిర్మాత వెంకట్‌రెడ్డి గారు గత ఆరు నెలలుగా ఈ సినిమా ప్రీ–ప్రొడక్షన్ పనులను ఎంతో శ్రద్ధగా చేస్తున్నారు. దేవుడి పేరుతో తెరకెక్కిన సినిమాలకు ప్రేక్షకుల నుంచి ఎప్పుడూ మంచి ఆదరణ ఉంటుంది. 'శివాలయం' కూడా మంచి విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమాలో నేను కూడా నటిస్తున్నాను. మా చిత్ర బృందం మొత్తాన్ని భగవంతుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు ఘర్షణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "శివాలయం అనే టైటిల్ చాలా అద్భుతంగా ఉంది. శివుడి నేపథ్యంలో వచ్చిన పాటలు, కథాంశంతో తెరకెక్కిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాంటి మంచి కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. మంచి కథ, బలమైన భావోద్వేగాలతో 'శివాలయం' రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను.వెంకట్‌రెడ్డి గారికి ఇది 11వ సినిమా. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాత వెంకట్‌రెడ్డి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

# ఇరుముడి బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ హార్ట్ విన్నింగ్ బ్లాక్‌బస్టర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్‌తో, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో ఘన విజయాన్ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు.బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్ లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. డైరెక్టర్ శివ ఈ సినిమా కోసం చాలా మంచి ఆర్టిస్టులను ఎంచుకున్నారు. కొమరం, భార్గవ్, కిషోర్ అందరూ సూపర్‌గా చేశారు. చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. అలాగే రమేష్ ఇంద్ర గారు కూడా బాగా చేశారు. స్టూడెంట్స్‌గా చేసిన అందరూ చక్కగా చేశారు. వాళ్లందరికీ చాలా మంచి ఫ్యూచర్ ఉంది. సాయి సురేష్ చాలా నేచురల్‌గా ఆర్ట్ వర్క్ చేశారు. తను చాలా జెన్యూన్ పర్సన్. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడతాడు. అలాగే మా డీఓపీ విష్ణు అమేజింగ్ వర్క్ ఇచ్చాడు. తను చాలా స్పీడ్‌గా వర్క్ చేస్తాడు. అలాగే దినేష్ సీలేరులో అన్నీ చాలా అద్భుతంగా చూసుకున్నారు. బాబా భాస్కర్, శేఖర్ మాస్టర్, అలాగే మా డైరెక్టర్ శివ ఈ సినిమాకి అద్భుతమైన కొరియోగ్రఫీ చేశారు. ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ గారు, రియల్ సతీష్ అద్భుతమైన యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. సతీష్‌తో ఇంకా చాలా సినిమాలు చేయాలి. జీవీ ప్రకాష్ మ్యూజిక్ ఈ సినిమాకి సోల్.




## పౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్ తో కలిసి కేఏ ప్రొడక్షన్స్ పై

# మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్: హీరో కిరణ్ అబ్బవరం




**వుదయం సినిమా:** వెర్సటైల్ స్టోరీస్, ఇన్నోవేటివ్ కాన్సెప్ట్స్ ను తెలుగు ప్రేక్షకులకు అందిస్తూ యంగ్ టాలెంట్ ను ఎంకరేజ్ చేయాలనే లక్ష్యంతో హీరో కిరణ్ అబ్బవరం కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్ స్థాపించారు. బ్యానర్ పై ఇటీవల తిమ్మరాజుపల్లి టీవీ సినిమాను నిర్మించి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు పౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ తో కలిసి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో అనూష్ గోరక్ డైరెక్ట్ చేస్తున్నారు. శివశంకర నాయుడు. వై. తో కలిసి కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్బూ మద్దాల, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ సినిమా అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో పక్షి కాళ్లను చూపిస్తూ, 'ఇలాంటి కథను మీరు ఇప్పటిదాకా తెరపై చూడలేదు, ఇలాంటి జానర్ ను మీరు ఊహించలేదు..'అంటూ రాసిన క్యాప్షన్ ఆసక్తి కలిగిస్తోంది. ఒక కొత్త తరహా కథను స్క్రీన్ మీద ప్రెజెంట్ చేయబోతున్నారు అనే ఇంప్రెషన్ అనౌన్స్ మెంట్ పోస్టర్ తో అందరిలో కలుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.నటీనటులు – కుష్బు, నమ్రిత.ఎంవీ, రెహమాన్, తనూజ పుట్టుస్వామి, తదితరులుటెక్నీషియన్స్పబ్లిసిటీ డిజైన్ – అనంత్ కంచెర్లకాస్ట్యూమ్ డిజైనర్ – మేఘన గుమ్మడిఆర్ట్ డైరెక్టర్ – మక్కెన విజయ్ కుమార్, జీమోస్వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ – జునైద్ ఉల్లా, హైకా స్టూడియోస్అసోసియేట్ ప్రొడ్యూసర్ – రితికేష్ గోరక్ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ – అల్లు బాలకృష్ణలైన్ ప్రొడ్యూసర్ – వెంకట్ రాహుల్ఎడిటర్ – అఖిల్ చక్రవర్తి మ్యూజిక్ – జేసిన్ జార్జ్.


# 'ధర్మస్థల నియోజకవర్గం' నుంచి పాట విడుదల

**వుదయం సినిమా:** 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రంలోని 'న్యాయం చేయరా దేవుడా' థియేట్రికల్ వెర్షన్ పాటను ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ నేడు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రబోస్ తనయుడు నంద వనమాలి తో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు.మూవింగ్ డ్రీమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వం వహిస్తుండగా, మేరుం భాస్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మహావీర్ యేలేందర్ సంగీతం అందించిన ఈ పాటను ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట ఆలపించారు. చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రష్టి వర్మ డ్యాన్స్, కొరియోగ్రఫీ చేశారు.వారాహి మ్యూజిక్ ద్వారా విడుదలైన 'న్యాయం చేయరా దేవుడా' పాటకు మంచి స్పందన లభిస్తోంది. భావోద్వేగభరితమైన ఈ పాట చిత్ర కథాంశానికి అనుగుణంగా ఉండటంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్ర బృందం తెలిపింది.



# 'మహాకాళి' నుంచి శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్ గ్లింప్స్

**వుదయం సినిమా:** ప్రశాంత్ వర్మ, ఆర్కేడీ స్టూడియోస్, పూజా కొల్లూరు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పీవీసీయూ (PVCU) మోస్ట్ అవైటెడ్ హిస్టారికల్ స్పెక్టకిల్ 'మహాకాళి' నుంచి పవర్ ఫుల్ ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. #శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదలైన ఈ గ్లింప్స్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. 2027 జనవరి 8న ప్రపంచవ్యాప్తంగా 'మహాకాళి' థియేటర్లలోకి రానుంది.ధర్మం, అధర్మం మధ్య జరిగే మహా సంగ్రామాన్ని ఈ గ్లింప్స్ ప్రజెంట్ చేస్తోంది. ఇది కేవలం మంచి–చెడు మధ్య జరిగే పోరాటం కాదని, ఓ ప్రపంచ భవిష్యత్తునే నిర్ణయించే స్థాయిలో యుద్ధం ఉండబోతుందనే ఆసక్తిని కలిగిస్తోంది. అసురుల గురువు శుక్రాచార్యుడి నాయకత్వంలో జరిగే ఈ పోరాటం మరింత పెద్ద యుద్ధానికి దారితీస్తున్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. "ది ఎండ్ బిగిన్స్" గా మహా సంగ్రామానికి నాంది పలికారు. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది అక్షయ్ ఖన్నా. శుక్రాచార్యుడిగా ఆయన కొత్త అవతార్‌లో కనిపించారు. ఇంటెన్స్ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆయన పాత్రపై ఆసక్తిని మరింత పెంచారు. ఇప్పటికే ఆయన ఫస్ట్ లుక్‌పై ఏర్పడిన క్యూరియాసిటీని ఈ గ్లింప్స్ మరింత పెంచింది.అలాగే శ్రియా రెడ్డి కూడా పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. భారీ సెట్స్, విస్తృతమైన వరల్డ్ బిల్డింగ్, విజువల్ ఎఫెక్ట్స్‌తో 'మహాకాళి' ప్రపంచాన్ని భారీ స్థాయిలో ఆవిష్కరించినట్లు గ్లింప్స్ సూచిస్తోంది.'హనుమాన్'తో పీవీసీయూకు బలమైన పునాది వేసిన ప్రశాంత్ వర్మ.. భారతీయ ఇతిహాసాలను మోడరన్ విజువల్ ట్రీట్‌మెంట్‌తో తెరపై ఆవిష్కరించే ప్రయత్నాన్ని 'మహాకాళి'తో మరింత భారీ స్థాయికి తీసుకెళ్తున్నట్లు ఈ 2 నిమిషాల 55 సెకన్ల గ్లింప్స్ ద్వారా ప్రజెంట్ చేశారు.ఆర్కే దుగ్గల్ సమర్పణలో రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పూజా అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. పీవీసీయూ సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది నెక్స్ట్ పార్ట్ గా రాబోతోంది. అక్షయ్ ఖన్నా, శ్రియా రెడ్డితో పాటు భూమి శెట్టి, రోహిత్ సరాఫ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.తారాగణం: భూమి శెట్టి, అక్షయ్ ఖన్నా, శ్రీయా రెడ్డి, రోహిత్ సరాఫ్, ఖుష్బూ సుందర్, రాకేష్ బేడీ, సముద్రఖని, జితిన్ గులాటి, రజత్ కపూర్, మురళీ శర్మ, నాసర్, బబ్లూ పృథ్వీరాజ్.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.